


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 97 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ మంగళవారం 17 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 97 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD TUE 17 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur

### నల్గొండను దేశం గర్వించేలా

## తీర్చిదిద్దడమే నా లక్ష్యం

- నల్గొండ మేయర్, డిప్యూటీ మేయర్లకు కోమటిరెడ్డి అభినందనలు
- తన మనసు గర్వంతో నిండిపోయిందని వ్యాఖ్య
- ఓడిపోయిన డివిజన్లలో కూడా అభివృద్ధిని కొనసాగిస్తామన్న మంత్రి



**హైదరాబాద్ పెన్ పవర్:**నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పీఠాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. కార్పొరేషన్ మేయర్, డిప్యూటీ మేయర్ లను ఈరోజు ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ... నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు తన జీవిత కల అని భావోద్వేగంతో చెప్పుకొచ్చారు.

- మిగతా 2లో...

### సన్న వడ్ల బోనస్

# 514.36 కోట్లు

- రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త
- వరి బోనస్ బకాయిలను విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం
- పెండింగ్‌లో ఉన్న రూ.514.36 కోట్ల బోనస్ నిధులు విడుదల
- ఇప్పటి వరకు రూ.1,939.58 కోట్ల బోనస్ నిధులు చెల్లింపు






**హైదరాబాద్ పెన్ పవర్:**రైతులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్తను అందించింది. వరి బోనస్ బకాయి నిధులను విడుదల చేసింది. పెండింగ్‌లో ఉన్న రూ.514.36 కోట్ల బోనస్ నిధులను విడుదల చేసింది. దీంతో 2.17 లక్షల రైతులకు ప్రయోజనం చేకూరనుంది. వరి రైతులకు సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 చొప్పున బోనస్ ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ బోనస్ ద్వారా 2025–26లో ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన రెండు లక్షల మందికి పైగా రైతులకు ప్రయోజనం కలగనుంది. వ్యవసాయాన్ని మరింత లాభసాటిగా మార్చడం, సాగును ప్రోత్సహించడానికి ప్రభుత్వం వరి క్వింటాల్‌పై రూ.500 బోనస్ ఇస్తున్న విషయం తెలిసిందే. కనీస మద్దతు ధరకు ఈ రూ.500 అదనం. బకాయిల చెల్లింపుతో రైతులకు ఆర్థిక ఉపశమనం లభిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు.



### తెలంగాణలోని 7 కార్పొరేషన్‌లలో...

## మేయర్, డిప్యూటీ మేయర్‌లు వీరే

- కరీంనగర్ మేయర్‌గా కొలగాని శ్రీనివాస్, నల్గొండ మేయర్‌గా బుర్రి చైతన్య రెడ్డి
- కొత్తగూడెం మేయర్‌గా మూడ్ గణేశ్.. రెండున్నరేళ్ల పాటు పదవిలో ఉండనున్న గణేశ్
- మజ్లిస్ సహకారంతో నిజామాబాద్‌ను దక్కించుకున్న కాంగ్రెస్

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలంగాణలో ఏడు కార్పొరేషన్‌లలో మేయర్, డిప్యూటీ మేయర్‌ల ఎన్నిక ప్రక్రియ ముగిసింది. కాంగ్రెస్ పార్టీ ఐదు స్థానాలను గెలుచుకోగా, బీజేపీ కరీంనగర్ మేయర్ పదవిని కైవసం చేసుకుంది. కొత్తగూడెంలో కాంగ్రెస్, సీపీఐ పార్టీలకు సమానంగా సీట్లు రావడంతో రెండు పార్టీలు అవగాహన కుదుర్చుకున్నాయి. మొదటి రెండున్నరేళ్లు మేయర్ పదవి సీపీఐకి, డిప్యూటీ మేయర్ పదవి కాంగ్రెస్‌కు ఇవ్వాలని నిర్ణయించాయి.కాంగ్రెస్ పార్టీ మజ్లిస్ పార్టీ సహకారంతో

- మిగతా 2లో...



### ఏఐ సమ్మిట్..భారత్ వేగవంతమైన

## వృద్ధికి నిదర్శనం

- ఢిల్లీలో ప్రారంభమైన ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026
- 80 దేశాల ప్రతినిధులు, 500 మందికి పైగా ఏఐ నిపుణుల హాజరు
- ఫిబ్రవరి 19న ప్రధాని మోదీ చేతుల మీదుగా ప్రారంభోత్సవ ప్రసంగం
- గ్లోబల్ సౌత్‌లో ఈ స్థాయిలో ఏఐపై సదస్సు జరగడం ఇదే ప్రప్రథమం
- ఏఐ ఛాలెంజ్‌ల ఫైనలిస్టులు తమ ఆవిష్కరణలను ప్రదర్శించనున్నారు

**పెన్ పవర్ డెస్క్:**దేశ రాజధాని ఢిల్లీ వేదికగా 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ 2026' సోమవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ సదస్సులో 80కి పైగా దేశాల నేతలు, 500 మందికి పైగా గ్లోబల్ ఏఐ నిపుణులు, సీఈఓలు, పరిశోధకులు పాల్గొంటున్నారు. సమ్మిళిత వృద్ధి, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనలో కృత్రిమ మేధ (ఏఐ) పాత్రపై ఈ సదస్సులో ప్రధానంగా చర్చిస్తారు. గ్లోబల్ సౌత్‌లో

- మిగతా 2లో...

### ఏపీ సీఎం చంద్రబాబుతో తెలంగాణ

## మంత్రి తుమ్మల భేటీ..

**ఆ 5 పంచాయతీలను తెలంగాణకు ఇవ్వాలని విజ్ఞప్తి**



- సీఎం చంద్రబాబు ముందు తుమ్మల కీలక ప్రతిపాదనలు
- ఏపీలో విలీనమైన 5 గ్రామాలను తిరిగివ్వాలన్న తుమ్మల
- సరిహద్దుల్లోని సాగునీటి ప్రాజెక్టుల నిర్వహణపై కీలక చర్చలు
- రెండు రాష్ట్రాల మధ్య సహకారంతో సమస్యలు పరిష్కరించుకోవాలని నిర్ణయం

**హైదరాబాద్ పెన్ పవర్:**తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న సరిహద్దు సమస్యల పరిష్కారం దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సోమవారం ఉండవల్లిలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. ఈ భేటీలో రెండు రాష్ట్రాల మధ్య సమన్వయంతో పరిష్కరించుకోవాల్సిన పలు ముఖ్యమైన అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌లో విలీనం

- మిగతా 2లో...

### పదవులపై కోమటిరెడ్డి

## రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

- పదవులు శాశ్వతం కాదన్న కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి
- తనకు నియోజకవర్గ అభివృద్ధి ముఖ్యమన్న రాజగోపాల్ రెడ్డి
- తనకు పదవులు ఇవ్వకపోయినా పర్వాలేదని వ్యాఖ్య



**హైదరాబాద్ పెన్ పవర్:**మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మంత్రి పదవిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. పదవులు శాశ్వతం కాదని, తన నియోజకవర్గం అభివృద్ధి తనకు ముఖ్యమని ఆయన అన్నారు. తనకు పదవులు ఇవ్వకపోయినా పర్వాలేదని మునుగోడు నియోజకవర్గం అభివృద్ధికి సహకరిస్తే చాలని అన్నారు. కాగా, రాజగోపాల్ రెడ్డి ఇటీవలి వరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకున్న విషయం తెలిసిందే.తనకు

- మిగతా 2లో...



## మహిళలకు మరోసారి భారీ కానుక ఇచ్చిన నితీశ్ కుమార్

- శివరాత్రి సందర్భంగా మహిళల ఖాతాల్లో రూ. 10 వేల చొప్పున జమ
- సంతోషం వ్యక్తం చేస్తున్న మహిళలు
- గత ఎన్నికలకు ముందు కూడా రూ.10 వేలు జమ చేసిన నితీశ్

**పెన్ పవర్ డెస్క్:**బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ మహిళలకు శివరాత్రి కానుకను అందించారు. రాష్ట్రంలోని అర్హత కలిగిన మహిళల ఖాతాల్లో రూ.10 వేల చొప్పున నేరుగా జమ చేశారు. తమ ఖాతాల్లో డబ్బు జమ

- మిగతా 2లో...

### కరీంనగర్ మేయర్ పీఠం దక్కించుకున్న బీజేపీ..

## ఎన్నికను బహిష్కరించిన బీఆర్ఎస్

**మేయర్‌గా బీజేపీ అభ్యర్థి కొలగాని శ్రీనివాస్**

**శ్రీనివాస్‌కు 34, కాంగ్రెస్ అబ్యర్థి నర్మదకు 21 ఓట్లు**

**కాంగ్రెస్‌కు మద్దతు పలికిన మజ్లిస్, ఇతరులు**



**హైదరాబాద్ పెన్ పవర్:**పుర ఫలితాలు వెలువడినప్పటి నుంచి ఎంతో ఉత్కంఠగా మారిన కరీంనగర్ కార్పొరేషన్ పీఠాన్ని బీజేపీ దక్కించు కుంది. కరీంనగర్ కార్పొరేషన్‌ను బీజేపీ తొలిసారి దక్కించుకుంది. కరీంనగర్ మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ ప్రమాణ స్వీకారం చేశారు. మేయర్ ఎన్నిక సమయంలో బీఆర్ఎస్ పార్టీ తటస్థంగా వ్యవహరించింది. దీంతో బీజేపీ అభ్యర్థి గెలుపు సునాయాసమైంది.బీజేపీకి 34 ఓట్లు రాగా, కాంగ్రెస్ పార్టీ ప్రతిపాదించిన మేయర్ అభ్యర్థి నర్మదకు 21 ఓట్లు వచ్చాయి. తొమ్మిది స్థానాలు ఉన్న బీఆర్ఎస్ ఎన్నికను బహిష్కరించింది. కరీంనగర్ కార్పొరేషన్‌లో

- మిగతా 2లో...

### చైనా సరిహద్దు ప్రాంతంలో కేంద్రమంత్రి

## కిరణ్ రిజిజు పర్యటన

- నరవణే పస్తకం నేపథ్యంలో చైనా సరిహద్దుల్లో పర్యటన
- దేశ భద్రత విషయంలో రాజకీయం సరికాదని రాహుల్ గాంధీకి హితవు
- ప్రచురితం కాని పుస్తకం గురించి చెప్పడానికేముండదని వ్యాఖ్య

**హైదరాబాద్ పెన్ పవర్:**ఆర్మీ మాజీ చీఫ్ నరవణే పుస్తకం వివాదం వేళ, కేంద్రమంత్రి కిరణ్ రిజిజు చైనా సరిహద్దుల్లో పర్యటించారు. ప్రచురితం కాని నరవణే పుస్తకాన్ని ప్రదర్శిస్తూ రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్న

- మిగతా 2లో...



## ఎడిటర్ వ్యూ

# విద్యా వ్యవస్థకు మహర్దశ!

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కారు విద్యా వ్యవస్థపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రాన్ని విద్యారంగంలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలపాలన్న సంకల్పంతో ముందుకు పోతున్నదనడంలో అతిశయోక్తి లేదు. అధికారంలోకి రాగానే పాఠశాలకు ఉచిత కరెంటుతో పాటు, తెలంగాణ మోడల్ స్కూల్, ఇంటిగ్రేటెడ్ స్కూళ్లకు స్వీకారం చుట్టడం, అన్ని పాఠశాలల్లో స్కావెంజర్‌లను ఏర్పాటు చేయడంతో పాటు ఇతర మౌలిక వసతులను సమకూరుస్తుండటం ముదావహం. అధికారంలోకి వచ్చీరాగానే ఉపాధ్యాయులు ఎంతో కాలంగా వేచిచూస్తున్న పదోన్నతుల, బదిలీల ప్రక్రియలను విజయవంతంగా పూర్తిచేయడం, ఉపాధ్యాయుల హాజరు కోసం ముఖ గుర్తింపు హాజరును ప్రవేశ పెట్టడం వంటి నిర్ణయాలతో విద్యావ్యవస్థను అగ్రస్థానంలో నిలబెట్టడానికి చేస్తున్న కృషిగా అభివర్ణించవచ్చును. విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం, రాగి జావ, ప్రత్యేక తరగతులకు హాజరయ్యే పదవ తరగతి విద్యార్థులకు సాయంత్రం వేళల్లో అల్పాహారం అందించడం హర్షించదగ్గ పరిణామం. స్వయంగా ముఖ్యమంత్రే విద్యాశాఖ మంత్రిగా ఉండి ఆ శాఖలో వినూత్న మార్పులకు శ్రీకారం చుట్టడం అభినందనీయం. ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, ఉచిత ఏకరూప దుస్తులను అందించడం జరుగుతూ వస్తున్నది. కానీ రాబోయే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ బడులలో చదివే విద్యార్థులకు టై, బెల్టు, షూస్, స్టేషనరీ ఐటమ్స్ ఇతరత్రా అన్ని కలిపి 22 అంశాలతో కూడిన కిట్‌ను అందిస్తామని ప్రకటించడం అందుకు తగ్గ ప్రణాళికలను రూపొందించమని అధికారులను ఆదేశించడంతో అటు విద్యార్థుల తల్లిదండ్రుల, ఇటు విద్యార్థుల, ఉపాధ్యాయుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. ఉపాధ్యాయ సంఘాలు కూడా ఈ ప్రకటన పట్ల సానుకూలంగా స్పందించాయి. అత్యధిక మానవ వనరులు కలిగిన దేశాన్ని అత్యధిక నైపుణ్యాలు కలిగిన దేశంగా రూపుదిద్దాలంటే కేటాయింపులు అధికంగా జరగాలి. ప్రస్తుత ప్రజాప్రభుత్వం ఆ దిశగా కొంత ప్రయత్నం చేస్తుండడం ముదావహం. ఒకవైపు అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల పేరుతో, మన ఊరు మన బడి పేరుతో బడులు బాగైన సందర్భంలో ఇక ప్రవేశాలు, నాణ్యతపై దృష్టి పెట్టాల్సిన సమయం ఆసన్నమైంది. కనుక 22 వస్తువులతో కూడిన కిట్ ప్రభుత్వ సెక్టారులో చదువుతున్న పిల్లలకి ఈ పథకం వలన లబ్ది చేకూరుతుందని సగటు విద్యాభిమానులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రెండు దశాబ్దాల అనుభవం కలిగిన ఒక ఉపాధ్యాయుడిగా ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే పిల్లలు రంగు పెన్సిల్లు, స్కెచ్ పెన్నులు, బ్యాగులు ఇతర సామాగ్రి లేక వారి వర్క్ బుక్కులు పూర్తి చేయలేని సందర్భాలు చూస్తున్నా.. ఎక్కడైనా పిల్లలకి అలాంటి అవసరాలు ఏర్పడితే టీచర్లు కొనిస్తున్న సందర్భాలు కోకొల్లలు. ఇప్పుడు ఈ కిట్ పంపిణీ వలన వారిలో కొత్త ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని నమ్మకం ఉంది. అలాగే డ్రాయింగ్ ఆర్ట్ క్రాఫ్ట్ వంటి కళల పట్ల వారిలో ఆసక్తి ఏర్పడుతుంది. ప్రభుత్వం ఉపాధ్యాయుల సంఖ్యను పెంచితే, ముఖ్యంగా ప్రాథమిక స్థాయిలో తరగతికొక ఉపాధ్యాయ నియామకం చేసినట్లయితే బడుల్లో సంఖ్య పెరిగే అవకాశం లేకపోలేదు.. ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న బదిలీ పదోన్నతులు చేసి, నియామకాలు చేసిన ప్రభుత్వం విద్య పట్ల కాస్త సానుకూలంగా కనిపిస్తున్నది. ఇది విద్యారంగానికి మంచి సమయంగా మారితే రాష్ట్ర ప్రజలకు అంతకన్నా కావలసింది ఏముంది? అందరికీ ఆదర్శంగా మన రాష్ట్ర విధానాలు ఉండాలని ఆశిస్తూ, 22 వస్తువులతో కూడిన కిట్ ఓ మంచి మార్పుకు శ్రీకారం చుట్టాలని కోరుకుందాం.

# తెలంగాణలోని 7 కార్పొరేషన్‌లలో... మేయర్, డిప్యూటీ మేయర్‌లు వీరే

- మొదటి పేజి తరువాయి

నిజామాబాద్ మేయర్ పదవిని దక్కించుకుంది. మొదటి నుంచి ఉత్కంఠ రేపిన కరీంనగర్ మేయర్ పదవి బీజేపీకి దక్కింది. కొత్తగూడెంలో కాంగ్రెస్, సీపీఐ పార్టీలు 22 స్థానాల చొప్పున గెలిచాయి. ఇక్కడ బీఆర్ఎస్ 8 సీట్లు గెలుచుకుంది. సీపీఐకి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బేషరతుగా మద్దతు ప్రకటించినప్పటికీ, సీపీఐ మాత్రం రొటేషన్ పద్ధతిలో మిత్రపక్షం కాంగ్రెస్ పార్టీతో నడిచేందుకు మొగ్గు చూపింది.

**కార్పొరేషన్‌లలో మేయర్, డిప్యూటీ మేయర్‌లు వీరే**

1. కరీంనగర్ కార్పొరేషన్ – మేయర్: కొలగాని శ్రీనివాస్ (బీజేపీ), డిప్యూటీ మేయర్: సునీల్ రావు (బీజేపీ).
2. నిజామాబాద్ కార్పొరేషన్ – మేయర్: ఉమారాణి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సల్మా తహసీన్ (మజ్లిస్)
3. రామగుండం కార్పొరేషన్ – మేయర్: మహంకాళి స్వామి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: పాతిపెల్లి ఎల్లయ్య (కాంగ్రెస్)
4. కొత్తగూడెం కార్పొరేషన్ – మేయర్: మూడ్ గణేశ్ (సీపీఐ), డిప్యూటీ మేయర్: సిరిపురపు లలిత కుమారి (కాంగ్రెస్)
5. నల్గొండ కార్పొరేషన్ – మేయర్: బుర్రి చైతన్య శ్రీనివాసరెడ్డి (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: మహమ్మద్ అష్రఫ్ అలీ అమర్
6. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ – మేయర్: గుమల్ మమత (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: సురేందర్ రెడ్డి (కాంగ్రెస్),
7. మంచిర్యాల కార్పొరేషన్ – మేయర్: మధుకర్ (కాంగ్రెస్), డిప్యూటీ మేయర్: రమ్య మహేశ్ (కాంగ్రెస్).

# నల్గొండను దేశం గర్వించేలా తీర్చిదిద్దడమే నా లక్ష్యం

- మొదటి పేజి తరువాయి

నూతన మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లకు ఆయన అభినందనలు తెలిపారు. నల్గొండ తన జన్మభూమి అని కోమటిరెడ్డి అన్నారు. నల్గొండలోని ప్రతి గల్లీ తన గుండెచప్పుడు అని చెప్పారు. ఈరోజు కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు ప్రమాణస్వీకారం చేస్తుంటే... తన మనసు ఎంతో గర్వంతో నిండిపోయిందని అన్నారు. నల్గొండను దేశం గర్వించేలా క్లీన్ అండ్ గ్రీన్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని చెప్పారు. "రాజకీయాలకు తావు లేకుండా, మేము ఓడిపోయిన డివిజన్లలో కూడా అభివృద్ధిని కొనసాగిస్తాం. ప్రతి పేదవాడి ఇంటికి సంక్షేమం, ప్రతి వీధికి ఆధునిక వసతులు చేరేలా చూడడమే నా బాధ్యత" అని మంత్రి ప్రకటించారు. "నాటి ఫ్లోరోసిస్ వ్యతిరేక పోరాటం నుంచి నేటి స్మార్ట్ సిటీ నిర్మాణం వరకు... మీ కోమటిరెడ్డి ఎప్పుడూ మీ తోడుగానే ఉంటాడు. మనందరం కలిసి నవ నల్గొండను నిర్మిద్దాం" అని పిలుపునిచ్చారు.

# ఏపీ సీఎం చంద్రబాబుతో తెలంగాణ మంత్రి తుమ్మల భేటీ..

- మొదటి పేజి తరువాయి

చేసిన ఐదు గ్రామ పంచాయతీలను తిరిగి తెలంగాణలో కలపాలని తుమ్మల చంద్రబాబుకు ప్రధానంగా విజ్ఞప్తి చేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు సమీపంలో ఉన్న యటపాక, కన్నాయిగూడెం, పిచుకలపాడు, పురుషోత్తపట్నం, గుండాల పంచాయతీలను తెలంగాణకు బదిలీ చేయాలని ఆయన కోరారు. ఈ గ్రామాలు భౌగోళికంగా తెలంగాణ భూభాగంలో ఉన్నప్పటికీ, పరిపాలనపరంగా ఏపీలో ఉండటంతో అక్కడి గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తుమ్మల వివరించారు. జిల్లా కేంద్రాలకు వెళ్లాలంటే గంటల తరబడి ప్రయాణించాల్సి రావడం, అంతర్రాష్ట్ర చెక్‌పోస్టుల సమస్యలు, పరిపాలనాపరమైన ఇబ్బందులను ఆయన చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారు. భద్రాచలం రామాలయానికి చెందిన కొన్ని భూములు ఏపీ పరిధిలో ఉండటం వల్ల తలెత్తుతున్న సమస్యలను కూడా ప్రస్తావించారు. ఈ సమావేశంలో మరికొన్ని కీలక ప్రతిపాదనలను కూడా తుమ్మల సీఎం చంద్రబాబు ముందుంచారు. తిరుమలలో తెలంగాణ భక్తుల సౌకర్యార్థం యాత్రికుల భవనం నిర్మించడానికి 5 ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. అలాగే, ఖమ్మం జిల్లాలో టీటీడీ ఆలయ నిర్మాణానికి

సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. వీటితో పాటు, ఖమ్మం జిల్లాలోని పెద్దవాగు ప్రాజెక్టు శాశ్వత మరమ్మతుల అంశాన్ని కూడా చర్చించారు. ఈ ప్రాజెక్టు కింద 85 శాతం ఆయకట్టు ఏపీలోనే ఉన్నందున, మరమ్మతుల కోసం అయ్యే రూ.92.20 కోట్ల ఖర్చును 85:15 నిష్పత్తిలో భరించేందుకు అంగీకరించాలని సూచించారు.

ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తుమ్మల ఆయనతో భేటీ కావడం ఇదే తొలిసారి. కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వంలో చంద్రబాబు కీలక పాత్ర పోషిస్తున్నందున, ఆయన చొరవ తీసుకుంటే దశాబ్దాలుగా ఉన్న ఈ సమస్యలు త్వరగా పరిష్కారమవుతాయని తుమ్మల ఆశాభావం వ్యక్తం చేశారు.

# ఏఐ సమ్మిట్..భారత్ వేగవంతమైన వృద్ధికి నిదర్శనం

- మొదటి పేజి తరువాయి

ఈ స్థాయిలో ఏఐపై సదస్సు జరగడం ఇదే ప్రప్రథమం కావడం విశేషం. ఫిబ్రవరి 20 వరకు ఐదు రోజుల పాటు ఈ సదస్సు కొనసాగుతుంది. ఫిబ్రవరి 19న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభోపన్యాసం చేస్తారు. సమ్మిళిత, బాధ్యతాయుతమైన ఏఐపై భారత్ విజన్‌ను, ప్రపంచ దేశాల సహకారంపై ఆయన తన ప్రసంగంలో దిశానిర్దేశం చేయనున్నారు. ఈ సదస్సులో 20 దేశాల అధినేతలు, 60 మంది మంత్రులు, ఉప మంత్రులు పాల్గొంటున్నారు. ఈ సదస్సులో భాగంగా నిర్వహిస్తున్న 'ఏఐ ఫర్ ఆల్', 'ఏఐ బై హర్', 'యువ ఏఐ' పేర్లతో మూడు గ్లోబల్ ఇంపాక్ట్ ఛాలెంజ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఈ ఛాలెంజ్‌లకు 60 దేశాల నుంచి 4,650కి పైగా అప్లికేషన్లు రావడం, బాధ్యతాయుత ఏఐ ఆవిష్కరణలలో భారత్ గ్లోబల్ హబ్‌గా ఎదుగుతోందనడానికి నిదర్శనంగా నిపుణులు పేర్కొంటున్నారు. వీటిలో ఫైనలిస్టులుగా ఎంపికైన 70 బృందాలు ఫిబ్రవరి 16, 17 తేదీల్లో భారత్ మండపం, సుష్మా స్వరాజ్ భవన్‌లలో తమ ఆవిష్కరణలను ప్రదర్శిస్తాయి. ఇదే క్రమంలో, ఫిబ్రవరి 18న ఐఐటీ హైదరాబాద్ భాగస్వామ్యంతో 'ఏఐ, దాని ప్రభావం' అనే అంశంపై రీసెర్చ్ సింపోజియం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్, ఎస్టోనియా అధ్యక్షుడు అలర్ కారిస్ హాజరవుతున్నారు. ఈ సింపోజియంలో ప్రపంచవ్యాప్తంగా ప్రఖ్యాత ఏఐ మార్గదర్శకులు, పరిశోధనా సంస్థలు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకోవడం జరుగుతుంది.

# కరీంనగర్ మేయర్ పీఠం దక్కించుకున్న బీజేపీ.. ఎన్నికను బహిష్కరించిన బీఆర్ఎస్

- మొదటి పేజి తరువాయి

66 స్థానాలు ఉండగా, బీజేపీ 30, కాంగ్రెస్ 14, బీఆర్ఎస్ 9, మజ్లిస్ 3 స్థానాలు కైవసం చేసుకున్నాయి. ఇతరులు 10 చోట్ల గెలుపొందారు. బీఆర్ఎస్, మజ్లిస్, స్వతంత్రులతో కలిపి కరీంనగర్ కార్పొరేషన్‌ను దక్కించుకోవడానికి కాంగ్రెస్ ప్రయత్నించింది. కరీంనగర్ కార్పొరేషన్‌లో తమకు అధికారానికి కావాల్సిన స్థానాలు దక్కలేదు కాబట్టి తాము మేయర్ ఎన్నికను బహిష్కరించామని

బీఆర్ఎస్ కౌన్సిలర్లు వెల్లడించారు. తాము బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు సమదూరం పాటించామని అన్నారు. తమకు మెజారిటీ స్థానాలు వస్తే తాము మేయర్ పదవి కోసం బరిలో నిలిచేవాళ్లమని వెల్లడించారు.

# అంబటి రాంబాబు కస్టడీ, బెయిల్ పిటిషన్లపై తీర్పు రిజర్వ్

**పెన్ పవర్ డెస్క్:** మాజీ మంత్రి, వైసీపీ నేత అంబటి రాంబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌తో పాటు పోలీస్ కస్టడీ కోరుతూ దాఖలైన పిటిషన్లపై గుంటూరు ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో విచారణ జరిగింది. ఇరుపక్షాల వాదనలు విన్న కోర్టు తీర్పును 18వ తేదీకి రిజర్వ్ చేసింది. ఈ కేసు 2023 సంక్రాంతి సంబరాల పేరుతో నిర్వహించిన లక్కీ డ్రా వ్యవహారానికి సంబంధించినది. అంబటి రాంబాబు తరఫున పొన్నవోలు సుధాకరరెడ్డి వాదనలు వినిపించారు. తీవ్ర నేరాలు, జీవితఖైదు శిక్షలు పడే కేసుల్లోనే బెయిల్ నిరాకరించాలని ఈ సందర్భంగా పొన్నవోలు అన్నారు. ఏడేళ్లలోపు శిక్ష పడే కేసుల్లో రిమాండ్ అవసరం లేదని చెప్పారు. ఈ కేసులో రెండేళ్లలోపు శిక్ష విధించే సెక్షన్లు మాత్రమే ఉన్నాయి కాబట్టి కస్టడీ అవసరం లేదని... బెయిల్ మంజూరు చేయాలని కోర్టును కోరారు. పోలీసుల తరఫున న్యాయవాది తన వాదనలు వినిపిస్తూ... అంబటి రాంబాబు లాటరీ పేరుతో డబ్బులు వసూలు చేసి మోసం చేశారని... పూర్తి స్థాయి విచారణ కోసం పోలీస్ కస్టడీ అవసరమని కోర్టును కోరారు. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి బెయిల్, పోలీస్ కస్టడీ పిటిషన్లపై తీర్పును రిజర్వ్ చేశారు. ఈ కేసులో కోర్టు ఏ నిర్ణయం తీసుకుంటుందన్నది రాజకీయ వర్గాల్లో ఆసక్తిగా మారింది.

# పదవులపై కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

- మొదటి పేజి తరువాయి

మంత్రి పదవి ఇవ్వాలని, ఆ హామీతోనే తాను పార్టీలోకి వచ్చానని ఆయన ఇటీవల వెల్లడించారు. తనకు మంత్రి పదవి ఇవ్వాల్సిందేనని లేదంటే ముఖ్యమంత్రి పదవి కోసం ప్రయత్నిస్తానని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మళ్లీ అడగబోనని, కానీ తనకూ ఒకరోజు వస్తుందని, ఆ రోజు లాక్కుంటానని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి ఒక్కరే కష్టపడితే కాంగ్రెస్ అధికారంలోకి రాలేదని, పార్టీలోని వారంతా శ్రమించారని అన్నారు. అయితే, మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో తాజాగా ఆయన చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి.

# మహిళలకు మరోసారి భారీ కానుక ఇచ్చిన నితీశ్ కుమార్

- మొదటి పేజి తరువాయి

కావడంతో మహిళలు ఖుషీగా ఉన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల ముందు కూడా ఇలాగే మహిళల ఖాతాల్లో రూ.10 వేలు జమ చేశారు. ఆ డబ్బు ప్రభావంతో మహిళలు పెద్ద ఎత్తున ఓటు వేసి బీజేపీ–జేడీయూ కూటమికి భారీ మద్దతు తెలిపారు. ఫలితంగా ఎన్డీయే కూటమి 202 స్థానాలు కైవసం చేసుంది. నితీశ్ మరోసారి సీఎం అయ్యారు. ఇప్పుడు శివరాత్రి పండుగ సమయంలో మళ్లీ ఖాతాల్లో రూ.10 వేలు జమ కావడంతో మహిళలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మహిళల సంక్షేమం విషయంలో నితీశ్ ఎప్పుడూ ముందుంటారని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

# చైనా సరిహద్దు ప్రాంతంలో కేంద్రమంత్రి కిరణ్ రిజిజు పర్యటన

- మొదటి పేజి తరువాయి

విషయం తెలిసిందే. ఇలాంటి తరుణంలో చైనా సరిహద్దుకు దగ్గరలోని తన నియోజకవర్గం అరుణాచల్ వెస్ట్‌లో కేంద్రమంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా కిరణ్ రిజిజు మాట్లాడుతూ, పార్లమెంటు సజావుగా సాగడంపై రాహుల్ గాంధీకి ఆసక్తి లేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి మంచి రోజులు వస్తాయని కొన్ని ఎన్జీవోలు ఆయనకు చెప్పాయని, అందుకే పదేపదే సభను అడ్డుకుంటున్నారని ఎద్దేవా చేశారు. దేశ భద్రత విషయంలో రాజకీయం చేయడం సరికాదని హితవు పలికారు.

ప్రచురితం కాని పుస్తకం గురించి చెప్పడానికి ఏముంటుందని కిరణ్ రిజిజు అన్నారు. ఆ పుస్తకం గురించి మనం మాట్లాడుకోకూడదని అన్నారు. అయితే రాహుల్ గాంధీ మాట్లాడింది జాతీయ భద్రతకు సంబంధించిన అంశం కాబట్టి తీవ్రంగా పరిగణించాలని అన్నారు. అలాంటి అంశాలను రాజకీయాల కోసం ఉపయోగించుకోవద్దని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీకి సరిహద్దుల గురించి ఏమీ తెలియదని, అందుకే అలాంటి ప్రకటనలు చేస్తున్నారని మండిపడ్డారు. సరిహద్దుల గురించి ఆయన తెలుసుకుంటే మంచిదని సూచించారు.

# బిల్ గేట్స్‌తో మళ్లీ సమావేశం కావడంపై సీఎం చంద్రబాబు స్పందన

**1997లో తొలిసారి బిల్ గేట్స్‌ను కలిశానని వెల్లడి**


**అప్పుడు ఐటీ విజన్.. ఇప్పుడు స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంపై చర్చించామని వివరణ**

**అమరావతి సచివాలయంలో నా విజన్‌ను ఆయనకు వివరించానన్న చంద్రబాబు**

**ప్రజల జీవన ప్రమాణాలు పెంచేందుకు గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి పనిచేస్తామని ఉద్ఘాటన**

మైక్రోసాఫ్ట్ సహ వ్యవస్థాపకుడు, ప్రపంచ ప్రఖ్యాత దాతృత్వవేత్త బిల్ గేట్స్ సోమవారం నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుతో భేటీ అయ్యారు. అమరావతిలోని సచివాలయంలో జరిగిన ఈ కీలక సమావేశంలో 'స్వర్ణాంధ్ర 2047' విజన్‌పై ఇరువురు సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఇతర ఉన్నతాధికారులు కూడా ఈ భేటీలో పాల్గొని, రాష్ట్ర ప్రాధాన్యతా రంగాలపై బిల్ గేట్స్‌కు వివరించారు. ఈ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు సోషల్ మీడియా ద్వారా స్పందించారు. 1997లో తాను తొలిసారి బిల్ గేట్స్‌ను కలిసి ఐటీ రంగానికి సంబంధించిన తన విజన్‌ను పంచుకున్న విషయాన్ని ఆయన గుర్తుచేసుకున్నారు. "1997లో నేను తొలిసారి మిస్టర్ బిల్ గేట్స్‌ను కలిశాను. అప్పుడు ఆయనకు నా ఐటీ విజన్‌ను వివరించాను. ఆ రోజు ఒక టెక్నాలజీ ఎకోసిస్టమ్‌ను నిర్మించడంపై మా మధ్య మొదలైన సంభాషణ, ఇప్పుడు ఒక విస్తృత లక్ష్యంగా రూపాంతరం చెందింది. వినూత్న ఆవిష్కరణలను ఉపయోగించి పాలనలో మార్పులు తీసుకురావడం, ప్రజల జీవితాలను పెద్ద ఎత్తున మెరుగుపరచడమే ఆ లక్ష్యం. ఈ రోజు అమరావతి సచివాలయంలో ఆయనతో మరోసారి భేటీ అయ్యాను. ఈ సందర్భంగా, నా స్వర్ణాంధ్ర 2047 విజన్‌ను ఆయన ముందు ఉంచాను. ఈ సమావేశంలో మా మంత్రులు, కార్యదర్శులు కూడా పాలుపంచుకుని ఆయనతో సంభాషించారు. మా ప్రభుత్వ ప్రాధాన్యతా రంగాలపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించాం. రాష్ట్ర ప్రజలకు సాధికారత కల్పించి, వారి జీవన ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు గేట్స్ ఫౌండేషన్‌తో కలిసి ఏయే మార్గాల్లో పనిచేయవచ్చో అన్వేషించాం. ఆనాటి మా సంభాషణ నేటి మా విస్తృత లక్ష్యాలకు పునాది వేయడం సంతోషంగా ఉంది" అని చంద్రబాబు తన ట్వీట్ లో పేర్కొన్నారు.

పెన్ పవర్
తెలంగాణ రౌండప్




బౌరంపేట్ కత్వ చెరువు సమీపంలో (లేఅవుట్ ప్లాట్లలో) అక్రమ నిర్మాణం.. (కూల్చివేతకు ముందు)



అదే నిర్మాణాన్ని జేసిబితో కూల్చేస్తున్న ఆర్ఐ రవికుమార్, జిపిఓ ప్రకాశ్..

# అక్కడ "లేఅవుట్" ప్లాట్‌లట..!
# ఇక్కడ "58-59" జీవోలట..!

## అక్రమ నిర్మాణాలకి సహకారమే లక్ష్యం..? అధికారుల తప్పుడు సమాధానం..!

- దుండిగల్ మండలంలో రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో విధులు..?
- ప్రభుత్వ పట్టాలపై అవగాహన లేదా..? లేక ఆమ్యామ్యాల కోసమే బరితెగింపా..?
- అధికారిక ఫోన్‌లో ప్రశ్నిస్తే..! ఫోన్‌లు బ్లాక్ చేస్తున్న దుండిగల్ తహాశీల్దార్..!
- ఫోన్‌లు ఎత్తకుండా తహాశీల్దార్ దారిలోనే ఆ ఇద్దరు ఆర్ఐలు..
- అడిగేది అధికారుల సొంత ఆస్తుల గూర్చి కాదు..! ప్రభుత్వ భూముల గురించి..!
- ప్రభుత్వ ఆస్తుల కబ్జాలపై ప్రశ్నిస్తే..! ఫోన్‌లు బ్లాక్ చేయడం అంటే.?ఎలా పరిగణించాలి..?

సుమారు 2007 నాటి కాలం చెల్లిన ప్రభుత్వ పట్టాలకు దుండిగల్ గండిమైసమ్మ రెవెన్యూ అధికారులు న్యాయం చేస్తున్నారని భావిస్తున్నారు కాబోలు.. సుమారు 18 ఏళ్ళ క్రితమే లబ్దిదారులకు జారీచేసిన ప్రభుత్వ పట్టాల కాలపరిమితిపై రెవెన్యూ అధికారులకు అవగాహన లేకపోవడం బాధాకరం.. అందులో ఒకరు తహాశీల్దార్, ఇద్దరు ఆర్ఐలు.. వీళ్ళకు తోడు ఐదుగురు (విఆర్‌వో) జిపివోలు..! వీళ్ళ కింద మరికొందరు విఆర్ఏలు..! మరో హాస్యాస్పద విషయం ఏమిటంటే..! మరోచోట ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై, సాక్షాత్తు తహాశీల్దారే, మీడియా గ్రూపులో తప్పుడు సమాచారం ఇవ్వడం గమనార్హం.. దీనికి తోడు రెవెన్యూ రికార్డుల్లో 58-59 జీవోలుగా ఉన్నట్లు, తహాశీల్దార్ అధికారిక ఫోన్ నుండి మెస్సేజ్ పెట్టిన తహాశీల్దార్.. ఆ జీవో నకళ్లను అడిగినా ఇవ్వకపోవడం అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి..! తహసీల్దార్ మరో విషయం లోనూ స్పష్టత ఇవ్వాలి.. సంబంధిత ప్రభుత్వ భూమిలో అక్రమ ఇంటి నెంబర్‌లు, ఆపై రిజిస్ట్రేషన్‌లకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి.. ఈసారి ఏం సమాధానం చెపుతారో వేచి చూడాలి..

**మేడ్చల్ జిల్లా బ్యూరో, పెన్ పవర్, ఫిబ్రవరి 16:**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, గండిమైసమ్మ దుండిగల్ మండలంలో, ప్రభుత్వ భూముల పరిరక్షణ పక్కదారి పడుతుంది.. కాపాడాల్సిన ప్రత్యేక విభాగమైన రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యంతో, ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోతోందని సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.. బౌరంపేట్ సర్వే నెంబర్ 576 ప్రభుత్వ భూమిలో 2007లోనే అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపు 561 ప్లాట్లతో, కొన్ని పార్కులను కూడా లేఅవుట్‌లో చూపుతూ పేదలకు పట్టాలు జారీచేసింది.. కారణం ఏమైనప్పటికీ కొద్ది రోజులకే మరో 22 ప్లాట్‌లను సృష్టించి అధికారులే, ఓ పార్కు స్థలంలో 22 ప్లాట్‌లు కేటాయించినట్లు స్థానికుల ఆరోపణ.. మొత్తం 583 ప్లాట్‌లు లబ్దిదారులకు జారీచేశారు.. లేఅవుట్ నిర్మాణంలో కొన్ని పట్టాలు కత్వ చెరువు ఎఫ్‌టిఎల్ బఫర్ జోన్‌లోనూ ఉన్నట్లు సమాచారం.. ప్రభుత్వ పట్టాల జారీతో కొన్ని నిబంధనలు కూడా పొందుపరిచారు.. 6-12 నెలల లోపు నిర్మాణం చేపట్టక పోయినా..! సంబంధిత పట్టాలు లబ్దిదారులు విక్రయించినా..! ఇతరులు ఎవరైనా కొనుగోలు చేసినా సంబంధిత పట్టలాను రద్దుచేస్తూ, ప్లాట్‌ల స్థలాలు ప్రభుత్వం స్వాధీన పరచుకుంటుందనే నిబంధనలు, రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడం గమనార్హం.. కంచే చేను మేసిన చందంగా, ప్రభుత్వ నిబంధనలను రెవెన్యూ అధికరులే కాలరాస్తుంటే..! ఎవరిని నిందించాలి..? ఎవరిని ప్రశ్నించాలి..? వీరి నిర్వాకానికి ప్రశ్నించిన విలేఖరుల ఫోన్‌లు, తహాశీల్దార్ బ్లాక్ చేయడం కొసమెరుపు.. బాధ్యత లేనిది ఎవరికో జిల్లా కలెక్టర్ తేలుస్తారని ఆశిద్దాం..

-4లో

- బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో సర్వే నెంబర్ 576 ప్రభుత్వ భూమిలో అక్రమ కట్టడాలు..
- 18 ఏళ్ళనాటి కాలం చెల్లిన ప్రభుత్వ పట్టాలతో అక్రమ నిర్మాణాల పరంపర..
- ముందుగా పనులు నిలిపి వేస్తారు.. కార్యం సిద్ధించిన వెంటనే కట్టుకోనిస్తారు..
- దొమ్మర పోచంపల్లి సర్వే నెం.120లో 58-59 జీవోల పేరిట అక్రమ కట్టడాలు..
- సంబంధిత అక్రమ నిర్మాణాలపై మున్సిపల్ అధికారులు షోకాజ్ నోటీసులు జారీ..
- రిజిస్ట్రేషన్ పత్రాలు 58-59 జీవోల ప్రకారమా..? ఇంటి నెంబర్‌ల ప్రకారమా..?
- గాగిల్లాపూర్‌లో భూదాన్ భూముల్లోనూ అక్రమ షెడ్లకు ప్రజాప్రతినిధి సిఫార్సులట..!
- 22-ఎ నిషేధిత జాబితాలోని భూదాన్ భూమిలో అక్రమ షెడ్లపై తహాశీల్దార్ నిర్లక్ష్యం..
- అక్రమ షెడ్లపై ఓ ఫిర్యాదు దారునితో కలెక్టర్ ఆదేశిస్తేనే కూల్చేస్తా అంటూ సమాధానం..
- బహుదూర్‌పల్లి 227 ప్రభుత్వ భూమిలోనూ అక్రమ షెడ్డుకు నోటీసులిచ్చిన తహాశీల్దార్..
- ఏడాదిన్నర గడిచినా,227లోని సురేందర్ రెడ్డి అక్రమ షెడ్డుపై నేటికీ చర్యల్లేవు..
- అధికారుల విధులు ప్రభుత్వ భూముల పరిరక్షణకా..? సిఫార్సుల అమలుకా..?
- అలంకార ప్రాయంగా దుండిగల్ రెవెన్యూ అధికారుల విధుల నిర్వహణ..
- సమాధానం చెప్పలేక తహాశీల్దార్ ఫోన్‌లు బ్లాక్ చేస్తుంటే..!
- ఆర్ఐలు, జిపివోలు ఫోన్‌లే ఎత్తక పోవడం గమనార్హం..



బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీలో ఇలా ఒక పిల్లర్ ఉన్నప్పుడు పనులు నిలిపివేత..




అదే అక్రమ నిర్మాణం.. సోమవారం వరకు ఇలా అభివృద్ధి..

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## మాపై ప్రజలకున్న నమ్మకమే ఈ గెలుపు



**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాప్రభుత్వం అందిస్తున్న పారదర్శక పాలన, చేపడుతున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలకున్న నమ్మకం ఫలితమే ఈ మున్సిపల్ ఎన్నికల విజయమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పునరుద్ఘాటించారు. ఖమ్మం జిల్లా మధిరలో సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ... "కాంగ్రెస్ కేవలం గ్రామీణ పార్టీయేనని, పట్టణాల్లో లేదని బురదజల్లిన వారికి ఈ ఎన్నికల ఫలితాలు చెంపపెట్టులాంటివి. ఈ విజయం అందించిన ప్రతి ఓటరుకు కృతజ్ఞతలు. రెండేళ్లలో సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో మంత్రిమండలి సమష్టిగా పనిచేస్తూ ఒకవైపు అభివృద్ధిని.. మరోవైపు సంక్షేమాన్ని సమదృష్టితో ముందుకు తీసుకువెళ్లి అర్బన్ సెంటర్లను ప్రగతిబాట పట్టించింది. మున్సిపల్ శాఖ బాధ్యతలను స్వయంగా పర్యవేక్షిస్తున్న సీఎం.. పట్టణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్యూర్, క్యూర్, రేర్ విధానంతో ముందుకు సాగుతున్నారు" అని తెలిపారు. గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## భాజపాతో జత కట్టడమేనా... మీరు తెస్తామన్న మార్పు?

### కాంగ్రెస్‌కు హరీశ్‌రావు ప్రశ్న

**హైదరాబాద్ పెన్ పవర్:**మార్పు అంటే భాజపాతో జత కట్టడమేనా? రాష్ట్రంలో మీరు తెస్తామన్న మార్పు ఇదేనా? అని కాంగ్రెస్‌ను ఉద్దేశించి భారత రాష్ట్ర సమితి శాసనసభాపక్ష ఉప నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రశ్నించారు. రాష్ట్రంలో అధికారం కోసం కాంగ్రెస్, భాజపా తమ జెండాలు, ఎజెండాలను పక్కన పెట్టాయని విమర్శించారు. పురపాలిక ఫలితాలతో.. ఈ రెండు పార్టీల మధ్య ఉన్న బంధం మరోసారి రుజువైందన్నారు. రేవంత్‌రెడ్డి నడిపిస్తుంది కాంగ్రెస్ సర్కారునా? భాజపా సర్కారునా? భాజపా, తెదేపాతో కూడిన సంకీర్ణ సర్కారునా? అని ప్రశ్నించారు. ఈ మేరకు

-4లో



# అక్కడ "లేఅవుట్" ప్లాట్‌లట..! ఇక్కడ "58-59" జీవోలట..!



58-59 జీవో పట్టాలు ఉన్నాయని తహశీల్దార్ చెప్పిన వాటిలో ఇదొకటి..



గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో అక్రమ షెడ్డు, పాక్షిక చర్యలతో ఆర్ఐ మమః అనిపించారు..




ఈ అక్రమ షెడ్డుకూడా భూదాన్ భూమిలోనే, చర్యల ఊసేలేదు.. సిఫార్సులట..


**'పెన్ పవర్' దినపత్రిక అధికారుల ఆస్తులను ప్రశ్నించడం లేదు..! వారి సొంత విషయాలను అసలే అడగటం లేదు..! పర్సనల్ ఫోన్‌లకు ఫోన్‌లు చేయడం లేదు.. ప్రజలకు సేవకులు, ప్రభుత్వ భూముల పరిరక్షకులుగా రెవెన్యూ విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న, సంబంధిత తహశీల్దార్‌ను ప్రశ్నిస్తే, సమాధానం చెప్పలేక "ఫోన్ బ్లాక్" చేయడంలోనే తెలుస్తుంది ఏమేరకు పారదర్శకత విధులు నిర్వర్తిస్తున్నారో స్పష్టమవుతుంది.. ఫోన్‌లు బ్లాక్ చేస్తే "పెన్ పవర్" వెనకడుగు వేయదు.. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి స్పందించాలని విజ్ఞప్తి..**





ఈ నిర్మాణానికి కూడా 58-59 పట్టాలు ఉన్నాయని తహశీల్దార్ సమాధానం..


**దుండిగల్ గండిమైసమ్మ మండలం లోని ప్రభుత్వ భూముల్లో కబ్జాలు ఏవైనా కహానీలే కానీ చర్యలు ఉండవని గాగిల్లాపూర్ భూదాన్ భూమిలో అక్రమ షెడ్ల విషయంలో తేటతెల్లం చేస్తోంది..అటు బహదూర్‌పల్లి 227 ప్రభుత్వ భూమిలోనూ "సురేందర్ రెడ్డి" అక్రమ షెడ్డుకు, గతంలోనే తహశీల్దార్ మతీన్ నోటీసులు జారీచేసి ఏడాదిన్నరగా నేటికీ చర్యలు తీసుకోలేదు.. ప్రస్తుత తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డికి జిల్లా అదనపు కలెక్టర్ పలుమార్లు చర్యలకు ఆదేశించినా చర్యల్లేవు.. బౌరంపేట్ లో నాగరాజు, జగన్నాథ్ రెడ్డి (క్రయవిక్రయ దారులు) అక్రమ నిర్మాణాలపై నేటికీ చర్యల ఊసేలేదు.. ఇక దొమ్మర పోచంపల్లి సర్వే నెంబర్ 120 ప్రభుత్వ భూమిలో నిరంతర ప్రక్రియగా అక్రమ కట్టడాలు జోరుగా కొనసాగుతున్నాయనే ఫిర్యాదులు రెవెన్యూ అధికారులు లెక్క పెట్టడం లేదనే ఆరోపణలు లేకపోలేదు.. రెవెన్యూ భూములు కాపాడే బాధ్యత మరిచిన వారిపై "విజిలెన్స్" వ్యవస్థ నిద్రలో ఉందా..?**




చర్యలకు అవకాశమే లేని, అధికారుల అండతో ఈ అక్రమ కట్టడాలు..



ఇది ఓపెన్ ప్లాట్ అయినప్పటికీ అదే 58-59 జీవో ఉందని చెప్పడం విశేషం..



బౌరంపేట్ ఇందిరమ్మ కాలనీ ప్రభుత్వ లేఅవుట్ ఏ 2007



GOVERNMENT OF TELANGANA
(REVENUE DEPARTMENT)

Office of the Tahsil,
Gandimaisamma-Dundigal Mandal.

Dated:07.05.2024.

No.B/528/2024

NOTICE UNDER SECTION 7 OF
A.P. LAND ENCROACHMENT ACT III OF 1905

To
Kum. Gaddam Sahiti Reddy D/o. G.Surender Reddy

Whereas you are reported to be un-authorized occupation of the land specified in the scheduled below, which is the property of Government. You are hereby given notice that if you desire so you may, before 2 days show cause either in person or in writing before me/the Collector why you should not addition to the full assessment on the land under section (3) (1) of the Act to the rate prescribed by or under section 3 (ii) of the act to charged a penalty for such occupation under section 5 of Act III of 1905 or and be subjected to eviction from the land and things deposited there on under section 6 of the said Act.

| Name of Village | Sy. No. and Sub-Division | Description of land | Total extent Ac-gts., | Encroached extent Ac-gts., | Nature of Occupation |
|---|---|---|---|---|---|
| Bahadurpally | 227 | Poramboke | 353-35 | 400 sq. yds (approx) | (01) Shed |

In view of the above the Girdawar of this office are directed to service and to return the served copy.

07/5/24
Tahsildar,
Gandimaisamma-Dundigal Mandal.

9951944277

బహుదూర్‌పల్లి సర్వే నెం.227 ప్రభుత్వ భూమిలో అక్రమ షెడ్డుకు తహశీల్దార్ నోటీసు ఇదే..



227 ప్రభుత్వ భూమిలో తహశీల్దార్ నోటీసులిచ్చిన, సురేందర్ రెడ్డి అక్రమ షెడ్డు ఇదే..

## ఒప్పందపు నిర్మాణం వదిలేసి..? మరో నిర్మాణం కూల్చివేత..

గండిమైసమ్మ దుండిగల్ మండలం "రెవెన్యూ అధికారుల చర్యలకు అర్థాలే వేరయా విశ్వదాభిరామ వినవయ్యా వేమయ్యా..! అన్నట్టుంది..! బౌరంపేట్‌లో 120 గజాల్లో, కాలం చెల్లిన పేదల పట్టాలు కొనుగోలు చేసిన వ్యక్తి పిల్లర్‌లతో చేపడుతున్నారని, ప్రారంభం (ఒక పిల్లర్ నిర్మాణం) లోనే పనులు నిలిపివేసిన దుండిగల్ రెవెన్యూ అధికారులు.. ఏమైందో ఏమోకానీ, రెండు రోజుల విరామం తర్వాత యధావిధిగా పనులు చేపట్టడంలో ఏదో మతలబ్ ఉందని ఆరోపణలు వచ్చాయి.. అధికారులకు వాట్సప్ ఫిర్యాదుల తపాటు, ఓ తెలుగు దినపత్రికలో వార్తా కథనాలు వచ్చాయి.. అయినప్పటికీ సంబంధిత అక్రమ కట్టడం వ్యవహారంలో ఎవరు ఎవరితో ఒప్పందం కుదుర్చుకున్నారో తెలియదు కానీ..! సోమవారం రెవెన్యూ అధికారుల చర్యలు తీవ్ర విమర్శలకు తావిస్తోంది.. ఈ ఒప్పందపు అక్రమ నిర్మాణాన్ని వదిలేసిన ఆర్ఐ రవికుమార్, జిపివో ప్రకాశ్ ఆధ్వర్యంలో..! దగ్గరలోనే (అదికూడా ఇదే తరహా అక్రమ నిర్మాణమే) అదేప్రాంతంలో మరో అక్రమ నిర్మాణం కూల్చివేతలు చేపట్టడంపై అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.. రెండూ అక్రమ కట్టడాలే అయినప్పటికీ, ఒకదానిపై చర్యలకు మినహాయింపు ఇవ్వడం శోచనీయం..

## ఆ నిర్మాణాలకు "58-59" జీవోలు ఉత్తుత్తిదేనా..?

దుండిగల్ మండలం దొమ్మర పోచంపల్లి సర్వే నెం.120 ప్రభుత్వ భూముల్లో "58-59" జీవోల మాటున నిర్మితమవుతున్న అక్రమ కట్టడాలు "పెన్ పవర్" దినపత్రికలో వరుస కథనాలపై, దుండిగల్ తహశీల్దార్ రాజేశ్వర్ రెడ్డిని, వాట్సప్ గ్రూపులో మెస్సేజ్‌తో ప్రశ్నించగా..! అదే గ్రూపులో స్పందించిన తహశీల్దార్ సమాధానం ఇచ్చారు..సంబంధిత నిర్మాణాలు మీ దృష్టిలో 58-59 మాటున అక్రమ కట్టడాలు కావచ్చేమో కానీ..! తమ రెవెన్యూ రికార్డుల ప్రకారం "58-59" జీవోలు ఉన్నాయని, అవి పాతవి తొలగించి కొత్తవి కడుతున్నట్టు తెలిపారు.. తహశీల్దార్ చెప్పింది నిజమే అయితే..! "58-59" జీవో ప్రకారం క్రమబద్ధీకరణలో భాగంగా రెవెన్యూ అధికారులు రిజిస్ట్రేషన్ చేయాల్సిన స్థలానికి, ఇంటి నెంబర్‌లతో రిజిస్ట్రేషన్‌లు ఎందుకు..? మున్సిపల్ పర్మిషన్ ఎందుకు తీసుకోలేదు..? జీహెచ్ఎంసి షోకాజ్ నోటీసులకు డాక్యుమెంట్లు సమర్పించడంలో, నిర్మాణ దారుల ఆలస్యం దేనికి..? ప్రభుత్వ భూమిలో ఇంటి నెంబర్‌లతో రిజిస్ట్రేషన్‌లు చేయడం సరైనదేనా..? అయితే '58-59' జీవో ప్రకారం, క్రమబద్ధీకరణతో రెవెన్యూ చేసిన రిజిస్ట్రేషన్‌లు కాకెత్తుకెళ్ళిందా..?

## భాజపాతో జత కట్టడమేనా... మీరు తెస్తామన్న మార్పు?

- 3 పేజి తరువాయి

సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. "కాంగ్రెస్, భాజపా నేతలు దిల్లీలో కొట్టుకున్నట్టు నటిస్తున్నారు. గల్లీలో చేతులు కలుపుతూ వాటాలు వేసుకుని పదవులు పంచుకుంటున్నారు. అలియాబాద్, ఆమనగల్లు, నర్సాపూర్ పురపాలిక ఫలితాలే ఇందుకు నిదర్శనం. పురపాలిక పొత్తులో మీ చీకటి ఒప్పందాలను ప్రజలు గమనిస్తున్నారు. భారత రాష్ట్ర సమితి ను కాంగ్రెస్ పార్టీ ఒంటరిగా ఎదుర్కొనే సత్తా లేదు. అందుకే భాజపాతో పొత్తు పెట్టుకుంది. భారత రాష్ట్ర సమితి అత్యధిక వార్డులు గెలుచుకున్న పురపాలికల్లో కుట్రలు చేసి పదవులు దక్కించుకున్నారు" అని హరీశ్‌రావు ఆరోపించారు.

## సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ

**హైదరాబాద్ పెన్ పవర్:** త్రిపురారం మండలం చౌళ్ళ తండా గ్రామంలో బంజారాల ఆరాధ్య దైవం సద్గురు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. శ్రీ బంగారి మైసమ్మ తల్లి అమ్మవారి ఆలయం ఆవరణలో పూజారులు వాంకుడోత్ స్వామి నాయక్, నాగు నాయక్, క్రిష్ణ నాయక్ ఆధ్వర్యంలో మహా బోగ్ బండార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా, గిరిజనులకు తండాలను గ్రామాలుగా మార్చి స్థిర నివాసం కల్పించిన సేవాలాల్ మహారాజ్ గొప్పతనాన్ని కొనియాడారు. ప్రతి గిరిజనుడు, యువత ఆయన మార్గంలో నడవాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలు నల్గొండ జిల్లా, నాగార్జున సాగర్ నియోజకవర్గ పరిధిలో జరిగాయి.

# తెలంగాణలో వలంటీర్ల వ్యవస్థ

**నిజామాబాద్, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** యాసంగి పంట డిజిటల్ సర్వేను పూర్తి చేయడానికి తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. కేంద్ర ప్రభుత్వం నిర్దేశించిన గడువును చేరుకోవడానికి, తాత్కాలికంగా వాలంటీర్లు, ప్రైవేట్ సర్వేయర్లనునియమించాలని నిర్ణయించింది.రాష్ట్రవ్యాప్తంగా, 10,621 గ్రామాలలో 19.469 మిలియన్ల సర్వే నంబర్లు ఉన్నాయి. ఈ గ్రామాలలో 9,795 గ్రామాలకు గ్రామ మ్యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. 17.436 మిలియన్ల సర్వే నంబర్లకు అనుసంధానించిన పంట భూములను సర్వే చేసే బాధ్యత ప్రైవేట్ సర్వేయర్లు వాలంటీర్లకు అప్పగించారు. మిగిలిన 826 గ్రామాలలో వ్యవసాయ విస్తరణ అధికారులు పోడు భూముల సర్వేలను నిర్వహిస్తారు.ప్రతి గ్రామంలో ఒక స్థానికుడిని వాలంటీర్‌గా ఎంపిక చేస్తారు. ప్రతిరోజూ, వారు 150 నుంచి 200 సర్వే నంబర్లకు సంబంధించిన పంటల ఫొటోలను తీసుకొనిమొబైల్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. అధికారులు ఫొటోకు రూ.7 చెల్లింపును నిర్ణయించారు.కేంద్ర ప్రభుత్వం సర్వే కోసం రూ.30.42 కోట్లు కేటాయించింది. వీటిలో రూ.2.93 కోట్లు ఇప్పటికే వర్షాకాల సర్వేకుఖర్చు చేశారు. మిగిలిన నిధులను ప్రస్తుత రబీ సీజన్ సర్వేను పూర్తి చేయడానికి ఉపయోగిస్తారు.ఇటీవల, కేంద్ర ప్రభుత్వ సలహాదారు రాజీవ్ చావ్లా రాష్ట్ర వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశమై, డిజిటల్ సర్వేనునిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని నొక్కి చెప్పారు.బీఎస్సీ అగ్రికల్చర్ డిప్లొమా, ఇతర సైన్స్ అర్హతలు ఉన్నవారు లేదా ఇంటర్మీడియట్ లేదా 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. వారుమొబైల్ యాప్‌లను ఉపయోగించడంలో అన్నీ తెలిసి ఉండాలి. సర్వే పూర్తయ్యే వరకు వారు సెలవు లేకుండా పని చేయాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు.

02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పోలీస్ వాహనాన్ని ఢీకొన్న లారీ.. ఎస్సైకి గాయాలు



**దుబ్బాక, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** సంగారెడ్డి జిల్లా చౌటాకూర్ మండలం సరాఫ్ పల్లి వద్ద సోమవారం తెల్లవారుజామున పోలీస్ వాహనాన్ని వెనుక నుండి లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో జోగిపేట ఎస్సై పాండుగౌడ్ కు స్వల్ప గాయాలయ్యాయి. ఆయన ప్రస్తుతం సంగారెడ్డిలోని వెల్నెస్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్నారు. జోగిపేట నుండి సంగారెడ్డి వైపు వెళుతుండగా, నాందేడ్ అకోలా జాతీయ రహదారిపై అనుమానాస్పదంగా కనిపించిన ముగ్గురు వ్యక్తులను ప్రశ్నించేందుకు వాహనాన్ని ఆపిన సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో పోలీస్ వాహనం పూర్తిగా ధ్వంసమైంది.

## టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుకి ఘన సన్మానం

**గజ్వేల్, ఫిబ్రవరి 16పెన్ పవర్:** దౌల్తాబాద్ మండలం గాజులపల్లి దొమ్మట కైలాసపురంలో జరిగిన శివపార్వతుల కల్యాణ మహోత్సవానికి విచ్చేసిన టిటిడి చైర్మన్ బిఆర్ నాయుడుని గాజులపల్లి గ్రామ సర్పంచ్ పంజ స్వామి, గ్రామ ప్రజలందరి తరపున ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని టిటిడి చైర్మన్‌కు తమ గౌరవాన్ని తెలియజేశారు.

## మహాశివరాత్రి పర్వదినం.. మల్లన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

**హుస్నాబాద్, ఫిబ్రవరి 16పెన్ పవర్:** సిద్ధిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న ఆలయంలో మహాశివరాత్రి సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మహాశివరాత్రి రాత్రి ఒగ్గుపూజారులు నిర్వహించిన పెద్దపట్నం కార్యక్రమాన్ని వేలాది మంది వీక్షించారు. భక్తులు క్యూలైన్లలో నిలబడి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం రేణుకా ఎల్లమ్మకు నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

## నిధులు మంజూరు కావడంపై సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

**సిద్ధిపేట, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** సిద్ధిపేట జిల్లా చిన్నకోడూర్ మండలంలోని కమ్మర్లపల్లి పంచాయతీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో గ్రామస్తులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ నిధుల మంజూరుకు కృషి చేసిన జిల్లా ఇన్చార్జి మంత్రి వివేక్ వెంకట స్వామి, నియోజకవర్గ ఇన్చార్జి పూజల హరికృష్ణ, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావుకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్, నాయకులు రాజేశ్, వినోద్ కూడా పాల్గొన్నారు.

## మక్తల్ మున్సిపల్ చైర్మన్లను ప్రకటించిన మంత్రి శ్రీహరి



**మక్తల్, ఫిబ్రవరి 16పెన్ పవర్:** నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ పూర్తి మెజారిటీ సాధించింది. సోమవారం, మంత్రి వాకిటి శ్రీహరి పార్టీ సీనియర్ నాయకులతో కలిసి మక్తల్ మున్సిపల్ చైర్మన్ గా వాకిటి మానసను, వైస్ చైర్మన్ గా శైవిరెడ్డిని నియమించారు. 15 వార్డులకు జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 12 వార్డులను గెలుచుకుంది.

## అలంపూర్ లో ఆసక్తికర ఘటన.. ప్రమాణ స్వీకారం చేసిన చిన్నారి

**ఆలంపూర్, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ పురపాలక లో సోమవారం కౌన్సిలర్ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో ఆసక్తికర సంఘటన చోటు చేసుకుంది. 1వ వార్డు కౌన్సిలర్ స్వాతి కూతురితో కలిసి ప్రమాణ స్వీకారం చేయడంతో కౌన్సిల్ సభ్యులందరూ చిన్నారి కూడా కౌన్సిలర్ అయిందని అనడంతో ప్రమాణ స్వీకారం చేస్తున్న స్పెషల్ ఆఫీసర్ తో సహా కౌన్సిల్ సభ్యుల ముఖాలలో నవ్వులు విరిశాయి.

# ఆత్మరక్షణలో గులాబీ దళం




**హైదరాబాద్, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు భారత్ రాష్ట్ర సమితిని ఆత్మరక్షణలో పడేలా చేశాయి. "అధికార పక్షంపై వ్యతిరేకత ఉంది.. ప్రజలు మార్పు కోరుకుంటున్నారు.. గులాబీ జెండా మళ్ళీ రెపరెపలాడుతుంది" అని ఆ పార్టీ అభ్యర్థులు, నేతలు చేసిన ప్రచారం క్షేత్రస్థాయిలో నీటి మూటగానే మిగిలిపోయింది. వెలువడిన ఫలితాలు బీఆర్ఎస్ వర్గాల్లో తీవ్ర నిరాశను మిగిల్చాయి.మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ తన హవానుకొనసాగించగా, బీఆర్ఎస్ మాత్రం ద్వితీయ స్థానానికే పరిమితమైంది. మొత్తం స్థానాల్లో కాంగ్రెస్ సగానికి పైగా కైవసం చేసుకుని ఏకపక్ష విజయాన్ని నమోదు చేసింది. బీఆర్ఎస్ కేవలం 770 వార్డులకే పరిమితం కావడంఆ పార్టీ బలాన్ని గణనీయంగా తగ్గించినట్లయింది. హైదరాబాద్ చుట్టుపక్కల మినహా రాష్ట్రవ్యాప్తంగా గులాబీ పార్టీ గ్రాఫ్ పడిపోవడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.బీఆర్ఎస్ వైఫల్యానికి అనేక కారణాలు కనిపిస్తున్నాయి. ఒకప్పుడు బీఆర్ఎస్ కు బలమైన ఓటు బ్యాంక్ ఉన్న పట్టణ ప్రాంతాల్లో ఇప్పుడు కాంగ్రెస్ చొచ్చుకుపోయింది. హైదరాబాద్ చుట్టుపక్కల మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని కొన్ని మున్సిపాలిటీల్లోమాత్రమే బీఆర్ఎస్ ప్రభావం చూపగలిగింది. కానీ, ఉత్తర తెలంగాణ, ఉమ్మడి నల్గొండ వంటి ప్రాంతాల్లో పార్టీ గాలి తీసేసింది. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో వచ్చిన ఓట్ల శాతమే ఇప్పుడు కూడా కొనసాగింది. అంటే, పార్టీ కొత్తగా ఓటర్లను ఆకర్షించలేకపోయింది. "ప్రభుత్వ వ్యతిరేక ఓటు" తమకే పడుతుందని ఆశించిన బీఆర్ఎస్ కు, ఆ ఓట్లు చీలిపోవడం లేదా కాంగ్రెస్ వైపు మొగ్గడం పెద్ద దెబ్బ. అసెంబ్లీ ఎన్నికల తర్వాత వరుసగాఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు పార్టీని వీడటం కేడర్ లో నైతిక స్థైర్యాన్ని దెబ్బతీసింది. క్షేత్రస్థాయిలో కార్యకర్తలను నడిపించే నాథుడు కరువవ్వడం బీఆర్ఎస్ ఓటమికి ప్రధాన కారణం.మున్సిపల్ ఫలితాలను విశ్లేషిస్తే,బీఆర్ఎస్ కేవలం 'గ్రేటర్ హైదరాబాద్' పార్టీగా మారుతోందా అనే అనుమానాలు కలుగుతున్నాయి. సిటీ శివారు మున్సిపాలిటీల్లో ఆశించిన ఫలితాలు వచ్చినప్పటికీ, జిల్లాల్లోని పురపాలికల్లో కాంగ్రెస్ క్లీన్ స్వీప్‌చేసింది. నల్గొండ కార్పొరేషన్ ను కాంగ్రెస్ కైవసం చేసుకోవడండ, కరీంనగర్, నిజామాబాద్ లో బీజేపీ గట్టి పోటీ ఇవ్వడం చూస్తుంటే బీఆర్ఎస్ కు తన సొంత ప్రాబల్యం ఉన్న చోట కూడా పట్టు తప్పుతోందనిస్పష్టమవుతోంది.అధికారంలో ఉన్న పార్టీకి మున్సిపల్ ఎన్నికల్లో ఎడ్జ్ ఉండటం సహజమేనని బీఆర్ఎస్ నేతలు సరిపెట్టుకోవచ్చు. కానీ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ, ఇప్పుడు మున్సిపల్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌వరుస విజయాలు సాధించడం అనేది కేవలం అధికార ప్రభావం మాత్రమే కాదు. కాంగ్రెస్ అమలు చేస్తున్న గ్యారంటీలు, పట్టణ మౌలిక సదుపాయాలపై పెట్టిన దృష్టి ఓటర్లను ఆ పార్టీ వైపు తిప్పుకున్నాయి. బీఆర్ఎస్‌నేతలు కేవలం సోషల్ మీడియాలో, టీవీ డిబేట్లలో ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టడమే తప్ప.. క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి వెళ్లి నమ్మకాన్ని కలిగించడంలో విఫలమయ్యారనేది రాజకీయ విశ్లేషకులు చెప్తున్నమాట.బీఆర్ఎస్ఇకనైనా తన పంథాను మార్చుకోవాల్సిన అవసరం ఉంది. కేవలం హైదరాబాద్ కేంద్రంగా రాజకీయం చేస్తే సరిపోదని ఈ ఫలితాలు హెచ్చరిస్తున్నాయి. వార్డు స్థాయి నుండి కమిటీలను బలోపేతం చేయాలి. కేసీఆర్ ప్రత్యక్షరాజకీయాల్లో చురుగ్గా పాల్గొనకపోవడం పార్టీకి మైనస్ అవుతోంది. కేవలం కేటీఆర్, హరీష్ రావులపైనే భారం వేయడం వల్ల జిల్లాల్లో పట్టు కోల్పోతున్నారు. కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, ప్రజల సమస్యలపైపోరాటాలు చేయడంలో బీఆర్ఎస్ వెనుకబడిందనే భావన ఉంది.మొత్తానికి, ఈ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ కు ఒక వేక్-అప్ కాల్. రాబోయే ఎన్నికల నాటికైనా పుంజుకోవాలంటే, ఆ పార్టీ తన వ్యూహాలనుసమూలంగా మార్చుకోవాల్సిందే. లేదంటే తెలంగాణ రాజకీయాల్లో రెండో స్థానాన్ని కూడా కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది.

రేవంత్ ట్రాప్ లో గులాబీ టీమ్ 2023 ఎన్నికల్లో ఓటమి తర్వాత నుంచి ఆ పార్టీకి వరుస ఎదురు దెబ్బలు తగులుతూనే ఉన్నాయి. 2024 లో జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఆ పార్టీ ఘోరంగా ఓడిపోయింది. ఒక సీటు కూడా పార్లమెంట్లో లేకపోగా ఆతర్వాత జరిగిన ఉప ఎన్నికల్లో కూడా పార్టీ ఓటమిపాలైంది. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఎదుర్కొనే విషయంలో గులాబీ పార్టీ సరైన వ్యూహాలు రచించలేదు అనే విమర్శలు కూడా వచ్చాయి పంచాయతీఎన్నికల్లో సైతం పార్టీ సత్తా చాట లేకపోవడం ఆందోళన కలిగించింది. బలంగా ఉన్న జిల్లాలో కూడా పార్టీ క్యాడర్ అనుకున్న స్థాయిలో ఫలితాలను రాబట్ట లేకపోయింది. ఇక తాజాగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో మంత్రులుగా పనిచేసిన వారి నియోజకవర్గాల్లో కూడా పార్టీ ఓటమి పాలు కావడం అధిష్టానం జీర్ణించుకోలేకపోతోంది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఆ పార్టీ ఒకప్పుడు బలంగా కనపడింది. అయితే కాంగ్రెస్ పార్టీ దెబ్బకు ఈజిల్లాలో పూర్తిగా గులాబీ పార్టీ కనుమరుగైన పరిస్థితి కనపడుతుంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒక్కటంటే ఒక్క మున్సిపల్ స్థానాన్ని కూడా ఆ పార్టీ కైవసం చేసుకో లేకపోయింది.నిజామాబాద్ జిల్లాలో కూడా ఇదే పరిస్థితి ఆ పార్టీకి ఎదురైంది. నిజామాబాద్ జిల్లాలో కూడా పార్టీ ఖాతా తెరవలేదు. 116 స్థానాల్లో ఎన్నికలు జరిగితే కేవలం 13 స్థానాల్లో మాత్రమే పార్టీ విజయం సాధించడం పట్లఅధిష్టానం తీవ్ర అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే దీని వెనక కారణాలేంటి అనేది పక్కన పెడితే నాయకులను మార్చాల్సిందే అనే అభిప్రాయాలు వినపడుతున్నాయి. పార్టీ నేతలు అందరూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని టార్గెట్ చేస్తూ ముందుకు వెళ్లడమే మినహా నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయడం లేదని విమర్శలు కూడా ఉన్నాయి. రేవంత్ రెడ్డి చేస్తున్న విమర్శలకు ప్రతి విమర్శలు చేయడం మినహా, క్షేత్రస్థాయిలో ఏంజరుగుతుందో తెలుసుకోలేకపోతున్నారని ఆవేదన కేడర్లో వ్యక్తం అవుతుంది. ఎంతసేపు అధిష్టానం మెప్పుకోసం ప్రయత్నం చేయడం మినహా పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టకపోవడాన్ని కేడర్ జీర్ణించుకోవడం లేదు. కనీసంఉమ్మడి మెదక్ జిల్లాలో కూడా పార్టీ బలంగా ప్రభావం చూపించలేకపోవడాన్ని కేడర్ తప్పుపడుతోంది.

# కొత్త సమీకరణాలకు తెర లేపిన కమలం



**హైదరాబాద్, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు రాష్ట్ర రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు తెరలేపాయి. ప్రధానంగా భారతీయ జనతా పార్టీ సాధించిన ప్రగతి ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపుతుండగా, క్షేత్రస్థాయిలో ఇంకాఎదుర్కోవాల్సిన సవాళ్లను కూడా స్పష్టం చేస్తోంది. గతంతో పోలిస్తే ఓట్ల శాతం, సీట్ల సంఖ్య గణనీయంగా పెరగడం ద్వారా కమలనాథులు తమ పట్టును నిరూపించుకున్నారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణలో బీజేపీ తనబలాన్ని చాటుకోగా, దక్షిణాది జిల్లాల్లో మాత్రం ఆశించిన స్థాయిలో రాణించలేకపోయింది.ఈ ఎన్నికల్లో బీజేపీ సాధించిన అతిపెద్ద విజయం కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్. కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండిసంజయ్ నేతృత్వంలో బీజేపీ ఇక్కడ చరిత్ర సృష్టించింది. గతంలో కేవలం 13 స్థానాలకే పరిమితమైన పార్టీ, ఈసారి ఏకంగా 30 స్థానాలను కైవసం చేసుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. స్వతంత్ర అభ్యర్థులు, ఇతరపార్టీల మద్దతుతో మేయర్ పీఠాన్ని దక్కించుకునే దిశగా అడుగులు వేస్తోంది. బండి సంజయ్ తన కంచుకోటలో సత్తా చాటడం పార్టీకి జాతీయ స్థాయిలోనూ గుర్తింపునిచ్చింది.రాష్ట్రంలోని ఆరు ప్రధాన కార్పొరేషన్లలోమహబూబ్‌నగర్ మినహా బీజేపీ, బీఆర్ఎస్ కంటే మెరుగైన ఫలితాలు సాధించడం విశేషం. ఈ ఆరు కార్పొరేషన్లలోని 354 డివిజన్లకు గాను బీజేపీ 69 స్థానాలు గెలుచుకోగా, బీఆర్ఎస్ 48 స్థానాలకే పరిమితమైంది.ప్రతిపక్ష హోదాలో ఉన్న బీఆర్ఎస్ కంటే బీజేపీ అత్యధిక స్థానాలను గెలుచుకోవడం ఆసక్తికరంగా మారింది.బీజేపీ గత ఎన్నికలతో పోలిస్తే తన గ్రాఫ్‌ను గణనీయంగా పెంచుకుంది. గతంలో 239 వార్డుల్లో గెలిచిన బీజేపీ,ఈసారి సుమారు 350 వార్డుల్లో విజయం సాధించింది. గత ఎన్నికల్లో 13 శాతంగా ఉన్న ఓట్ల శాతం, ఈసారి 20 శాతానికి పైగా పెరిగింది. గతంలో ఆమన్‌గల్, మక్తల్‌కే పరిమితమైన చైర్మన్ పదవులు, ఈసారి ఆదిలాబాద్, నారాయణపేట, మెట్‌పల్లి, రాయికల్ వంటి చోట్ల దక్కించుకునే అవకాశం ఏర్పడింది.పార్టీకి ఎనిమిది మంది ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ, వారి నియోజకవర్గాల్లో ఫలితాలు మిశ్రమంగా ఉన్నాయి. ఆదిలాబాద్ లోపాయల్ శంకర్ ఆధ్వర్యంలో 49 వార్డుల్లో 21 స్థానాలు గెలిచి, ఎక్స్-అఫీషియో సభ్యుల మద్దతుతో చైర్మన్ పీఠానికి చేరువయ్యారు. కామారెడ్డిలో ఎమ్మెల్యే కె.వెంకటరమణారెడ్డి తన పట్టు నిలుపుకున్నారు. 18స్థానాలు సాధించారు. నిర్మల్ లో ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నియోజకవ ర్గంలో 13 స్థానాలకే పరిమితం కావడం కొంత నిరాశ కలిగించింది. ఆర్మూర్, భైంసా, సిర్పూర్‌లలో పార్టీ ఆశించిన స్థాయిలో సీట్లు సాధించలేకపోయింది.

# ఈ ఒప్పందంతో.. దేశ రైతాంగానికి ఉరే!

**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్–అమెరికా మధ్య కుదిరిన తాజా వాణిజ్య ఒప్పందం దేశ రాజకీయాల్లోనే కాకుండా వ్యవసాయ రంగంలోనూ తీవ్ర చర్చకు దారి తీసింది. అమెరికా అధికార వర్గాలు దీన్ని తమ రైతులకు లాభదాయకమని పేర్కొనడంతో..ఈ ఒప్పందం రైతాంగానికి ముప్పుగా మారుతుందనే ఆందోళనలు వ్యక్తమవుతు న్నాయి. ఈ నేపథ్యంలో, ఈ వాణిజ్య ఒప్పందం దేశ రైతాంగ భవిష్యత్తుపై ఎలాంటి ప్రభావం చూపుతుందన్న ప్రశ్న మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ వాణిజ్య ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించడం సైతం సర్వత్రా విమర్శలకు కారణమైంది. కాంగ్రెస్ పార్టీ అగ్రనేతలు, పలువురు ప్రతిపక్ష నేతలు ఈ వాణిజ్య ఒప్పందంలో వ్యవసాయం, పాడి పరిశ్రమలకు సంబంధించిన ప్రయోజనాలను విస్మరించారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయినా, మోడీ ప్రభుత్వం ఎవరి విజ్ఞప్తులను పట్టించుకోకుండా ముందుకు వెళ్లడంతో అన్ని వర్గాల నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతున్నది. ఇప్పటికే మోడీ ప్రభుత్వ నిరంకుశపూరిత వైఖరికి నిరసనగా.. ఫిబ్రవరి 12న దేశవ్యాప్తంగా రైతు సంఘాలు సమ్మె నిర్వహించాయి. ఈ ఒప్పందం మీద అమెరికా మంత్రి బ్రూక్ రోలిన్స్ మాట్లాడుతూ.. ఈ నిర్ణయం అమెరికా రైతులకు లాభదాయకమని అభివర్ణించారు.. కానీ, భారతీయ రైతులకు ఈ ఒప్పందం శరఘాతంలా మారిన విషయం ప్రధాని మోడీ ఆయన పరివారం ఎందుకు గుర్తించడం లేదో? కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలి. అమెరికా సోయాబీన్ ఆయిల్, డిస్టిలర్స్ గ్రెయిన్స్‌కు భారత మార్కెట్ తలుపులు తెరవడం ద్వారా దేశీయ రైతును తన నేలపైనే పోటీ చేయలేని స్థితికి నెట్టివేస్తున్నారు. చౌక విదేశీ దిగుమతులు పాడి, పశుసంవర్ధక రంగాలను కూల్చి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీస్తాయి. 'పంట మనది – లాభం పరాయిది' అనే దోపిడీ విధానాన్ని దేశంపై ప్రధాని మోడీ బలవంతంగా రుద్దుతున్నారు.. ఎంఎస్‌పీ హామీలతో అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం నేడు అంతర్జాతీయ డంపింగ్‌కు ద్వారాలు తెరిచి రైతును బలి చేస్తోందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి.. రైతు రక్షణ ముసుగులో అమెరికా బహుళజాతి సంస్థల ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నది. ఈ ఒప్పందం భారత ఆహార భద్రతను బలహీనపరిచే కుట్రనే. దేశానికి సంబంధించిన ఇంతటి కీలక నిర్ణయం తీసుకునే ముందు... రాష్ట్రాలను సంప్రదించకపోవడం, పార్లమెంటులో చర్చ జరపకపోవడం, రైతు సంఘాల అభిప్రాయాన్ని లెక్కలోకి తీసుకోకపోవడం ప్రజాస్వామ్య విలువల స్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తించారు. ఇది రాజ్యాంగ విలువల్నీ పాతరేయడం కిందకు వస్తుంది. ఈ ఒప్పందాన్ని తక్షణమే రద్దు చేసి రైతుకు చట్టబద్ధ రక్షణ కల్పించాల్సిన అవసరముంది. దేశాన్ని పోషించే రైతును బలి చేసి ఏ ప్రభుత్వం నిలబడలేదన్న విషయం మోడీ గుర్తించుకోవాలి. ఈ ఒప్పందం పాడి పరిశ్రమపై తీవ్రంగా ప్రభావం చూపుతుంది. అమెరికా నుండి పౌల్ట్రీ ఉత్పత్తులు, డిస్టిలర్స్ గ్రెయిన్స్ (పశువుల మేతగా వాడేవి) దిగుమతి అయితే, దేశీయ పశుగ్రాసం ధరలు పడిపోయతాయి. పాడి రైతులకు ఆదాయం తగ్గుతుంది. మన అవసరాలకు సరిపడా ఆహారాన్ని మనమే పండించుకోకుండా, దిగుమతులపై ఆధారపడితే.. భవిష్యత్తులో అంతర్జాతీయ మార్కెట్ హెచ్చుతగ్గుల వల్ల దేశంలో ఆహార కొరత ఏర్పడే ప్రమాదం లేకపోలేదు. అందుకే రైతులు కనీస మద్దతు ధర(ఎంఎస్పీ)ను కేవలం ప్రకటనలకే పరిమితం చేయకుండా, దానిని ఒక చట్టపరమైన హక్కుగా మార్చాలని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర జాబితాలో ఉన్న వ్యవసాయం గురించి కేంద్రం నిర్ణయాలు తీసుకునేటప్పుడు

రాష్ట్రాలను సంప్రదించ కపోవడంపై ఆగ్రహం కల్పించడం జరుగుతున్నది. వ్యవసాయ రంగంలోకి బహుళజాతి సంస్థల ప్రవేశం వల్ల రైతు కేవలం ఒక 'కూలీ'గా మారిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.. రాజ్యాంగం ప్రకారం వ్యవసాయం రాష్ట్ర పరిధిలోని అంశం. ఫెడరల్ స్ఫూర్తికి విరుద్ధంగా కేంద్రం ఇలాంటి ఒప్పందాలు కుదుర్చుకోవడం వల్ల కేంద్ర–రాష్ట్రాల సయోధ్య పోతుంది. ఇంతటి కీలకమైన మార్కెట్ మార్పులపై పార్లమెంటులో చర్చ జరగకపోవడం వల్ల, భవిష్యత్తులో తలెత్తే లోటుపాట్లను సరిదిద్దే అవకాశం లేకుండా పోతుంది. అమెరికా వంటి దేశాల్లో యాంత్రీకృత వ్యవసాయం వల్ల ఖర్చులు తక్కువ, కానీ భారత్‌లో ఎక్కువ మంది చిన్న, సన్నకారు రైతులే ఉన్నారు.. వీరిద్దరి మధ్య పోటీ అనేది అసమానమైనది. ఈ విషయాన్ని గుర్తించి కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ఈ ఒప్పందాన్ని వెనక్కి తీసుకొని... భారత రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం.

# గులాబీకి ముల్లుగా మారిన కవిత...

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 పెన్ పవర్:**
తెలంగాణ రాజకీయ ముఖచిత్రం ఇప్పుడు ఊహించని మలుపులు తిరుగుతోంది. భారత్ రాష్ట్ర సమితి ప్రస్తుతం పూర్వవైభవం పోరాడుతున్న తరుణంలో, ఆ పార్టీ ఇంటి పోరే పెద్ద శాపంగా మారేలా కనిపిస్తోంది.ముఖ్యంగా మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సొంతంగా పార్టీ పెట్టే దిశగా అడుగులు వేయడం గులాబీ బాటలో ముళ్ల కంచెగా మారుతోంది. పైకి బీఆర్ఎస్ శ్రేణులు ఆత్మవిశ్వాసం ప్రకటిస్తున్నా, క్షేత్రస్థాయిలో కవిత చీల్చేప్రతి ఓటు పార్టీ పునాదులను కదిలిస్తుందని తాజా పరిణామాలు నిరూపిస్తున్నాయి.మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సొంతంగా రాజకీయ అస్తిత్వం కోసం అడుగులు వేయడం, గులాబీ దళానికి కంటిమీద కునుకులేకుండా చేస్తోంది. ముఖ్యంగా ఇటీవలి మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, ఆ తర్వాత కవిత చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ పునాదులను కదిలిస్తున్నాయి.నేరుగా పార్టీ ప్రకటించకపోయినా, మున్సిపల్ ఎన్నికల్లో కవిత తనమద్దతుదారుల ద్వారా 'సింహం' గుర్తుకు మద్దతు ఇచ్చి క్షేత్రస్థాయిలో తన బలాన్ని నిరూపించుకున్నారు. కొన్ని కీలక నియోజకవర్గాల్లో ఈ గుర్తుపై పోటీ చేసిన అభ్యర్థులు సాధించిన ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపోటములను శాసించాయి. ఇది కేవలం యాదృచ్ఛికం కాదు, ఒక పక్కా వ్యూహంతో జరిగిన రాజకీయ దాడి అని విశ్లేషకులు భావిస్తున్నారు. కవిత చీల్చే ప్రతి ఓటూ నేరుగా బీఆర్ఎస్ ఖాతా నుంచే మైనస్అవుతుండటం ఆ పార్టీ అగ్ర నాయకత్వాన్ని ఆందోళనలో పడేసింది.కవిత తన విమర్శనాస్త్రాలను కేవలం ప్రత్యర్థి పార్టీల వైపు కాకుండా సొంత సోదరుడు కేటీఆర్, బావ హరీష్ రావుల వైపు మళ్లించడం ఇక్కడ ఆసక్తిరేపుతోంది. క్షేత్రస్థాయిలో క్యాడర్‌ను గాలికి వదిలేశారంటూ ఆమె చేస్తున్న వ్యాఖ్యలు పార్టీ కార్యకర్తల్లో తీవ్ర గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. తండ్రి కేసీఆర్ పట్ల అపారమైన గౌరవం ప్రకటిస్తూనే, ప్రస్తుత పార్టీ నిర్వహణపైఆమె నిప్పులు చెరుగుతున్నారు. దీనివల్ల పార్టీలో అసంతృప్తిగా ఉన్న ద్వితీయ శ్రేణి నాయకత్వం కవిత వైపు చూసే అవకాశం ఏర్పడింది. బీఆర్ఎస్‌లో తలెత్తిన శూన్యతను తన వైపు తిప్పుకోవడంలో ఆమెసఫలమవుతున్నట్లు కనిపిస్తోంది.ప్రస్తుతం కవిత తన రాజకీయ ఎజెండాలో బీసీ సామాజిక వర్గాన్ని ప్రధాన అస్త్రంగా ఎంచుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ బీసీల పట్ల నిర్లక్ష్యంగా



వ్యవహరించిందని, వారికిచ్చిన హామీలనుతుంగలో తొక్కిందని ఆమె చేస్తున్న ఆరోపణలు పార్టీ సంప్రదాయ ఓటు బ్యాంకుపై గట్టి దెబ్బ కొట్టేలా ఉన్నాయి. వచ్చే మూడు నెలల్లో కొత్త పార్టీ పేరు, జెండాను ప్రకటిస్తానని స్పష్టం చేయడం, అంతర్జాతీయ స్థాయి రాజకీయ వ్యూహకర్తల సహకారం తీసుకుంటున్నారనే వార్తలు బీఆర్ఎస్‌కు ముందరి కాళ్ళ బంధంగా మారాయి.మున్సిపల్ ఫలితాల అనంతరం కవిత చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్ శ్రేణులకు ఆగ్రహం తెప్పిస్తున్నాయి."ఇది కేవలం టీజర్ మాత్రమే.. అసలు సినిమా ముందుంది" అంటూ ఆమె ఇచ్చిన వార్నింగ్, రాబోయే రోజుల్లో పోరు మరింత ముదురుతుందని సంకేతాలిచ్చింది. తెలంగాణ జాగృతి నెట్‌వర్క్‌ను ఇప్పుడు పూర్తిస్థాయిరాజకీయ శక్తిగా మార్చడం ద్వారా, రాష్ట్రవ్యాప్తంగా ప్రతి గ్రామంలోనూ బీఆర్ఎస్ ఓట్లను చీల్చేందుకు ఆమె సిద్ధమవుతున్నారు. తెలంగాణలో ప్రస్తుతం కాంగ్రెస్, బీజేపీ బలంగా ఉన్నాయి. ఇలాంటి త్రిముఖ లేదాచతుర్ముఖ పోటీ నెలకొన్న తరుణంలో, కవిత నేతృత్వంలోని కొత్త శక్తి 4 నుంచి 5 శాతం ఓట్లు చీల్చినా, అది బీఆర్ఎస్ అభ్యర్థుల పాలిట మరణశాసనమే అవుతుంది. ఒకే సిద్ధాంతం, ఒకే రకమైన ఓటు బ్యాంకుఉన్నప్పుడు.. చీలిక అనేది ఎప్పుడూ మాతృ పార్టీకే నష్టం చేకూరుస్తుంది. రాజకీయాల్లో సానుభూతి అనేది ఒక శక్తివంతమైన ఆయుధం. కవిత తనపై వస్తున్న విమర్శలను ఎదుర్కుంటూనే, తనకంటూ ఒక స్వతంత్రఅస్తిత్వాన్ని సృష్టించుకుంటున్నారు. ఈ రాజకీయ యుద్ధంలో కవిత అధికారంలోకి వస్తారా లేదా అన్నది పక్కన పెడితే, బీఆర్ఎస్ ఓటమికి మాత్రం ఆమె ప్రధాన కారకురాలిగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి.మున్సిపల్ ఎన్నికల ఫలితాలు, కవిత వేస్తున్న అడుగులను గమనిస్తుంటే, రానున్న రోజుల్లో తెలంగాణలో చతుర్ముఖ పోరు తప్పదనిపిస్తోంది. ఒకవైపు అధికార కాంగ్రెస్ బలాన్ని పెంచుకుంటుంటే, మరోవైపు బీజేపీ తనఉనికిని చాటుకుంటోంది. ఈ పరిస్థితుల్లో కవిత రూపంలో ఎదురవుతున్న ఈ సొంత ముప్పును బీఆర్ఎస్ ఎలా ఎదుర్కొంటుందనేది ఆసక్తికరంగా మారింది. ఆమె చేసే విమర్శలు ఆమెకు సానుభూతిని కూడగట్టడమేకాకుండా, తనకంటూ ఒక స్వతంత్ర రాజకీయ అస్తిత్వాన్ని సృష్టిస్తున్నాయి. ఈ రాజకీయ యుద్ధంలో కవిత గెలుస్తారో లేదో కానీ, బీఆర్ఎస్ ఓటమికి మాత్రం ఆమె ప్రధాన కారకురాలిగా మారే అవకాశాలు మెండుగాఉన్నాయిసొంత గూటి నుంచే మొదలైన ఈ 'సింహ' గర్జనను గులాబీ దళం ఎలా తట్టుకుంటుందో వేచి చూడాలి.

# తెలంగాణలో కమలం పొత్తుల ప్లాన్ ఏపీ వ్యూహం తప్పదా

**హైదరాబాద్, ఫిబ్రవరి 16 పెన్ పవర్:**
దాదాపు గత ఆరేళ్ల నుంచి తెలంగాణలో భారతీయ జనతా పార్టీ బలోపేతం అవుతుంది అంటూ ఆ పార్టీ నాయకత్వం చెప్పే ప్రయత్నం చేస్తూనే ఉంది. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ఒక్క అసెంబ్లీ సీటు మాత్రమే గెలుచుకుని ఆ మరుసటి ఏడాది జరిగిన పార్లమెంటు ఎన్నికల్లో ఏకంగా నాలుగు ఎంపీ స్థానాలు గెలుచుకుంది ఆ పార్టీ. 2023 ఎన్నికల్లో అసెంబ్లీలో పర్వాలేదు అనిపించిన బిజెపి ఆ తర్వాత పార్లమెంట్ ఎన్నికల్లో ఏకంగా ఎనిమిది స్థానాలు గెలుచుకుంది. దీంతో ప్రతిపక్ష భారత రాష్ట్ర సమితికి ఊహించని దెబ్బ తగిలిందనే చెప్పాలి. ఇక ఆ తర్వాత నుంచి భారతీయ జనతా పార్టీ స్థానిక సంస్థల ఎన్నికల్లో పెద్దగా ప్రభావం చూపించలేకపోతోంది.గత ఏడాది జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ఆ పార్టీ.. కనీసం ప్రభావం చూపించలేదు. ఇక పంచాయతీ ఎన్నికల్లో కూడా పార్టీకి ప్రజలనుంచి మద్దతు కరువైంది. పార్టీ నాయకులు మాటలు చెప్పడమే మినహా బలోపేతం చేయలేకపోతున్నారనేది ఆ పార్టీ కేడర్ ఆవేదన. మున్సిపల్ ఎన్నికల్లో కూడా పార్టీ పెద్దగా ప్రభావం చూపించలేదు. కనీసం తమ ఎంపీలు ఎమ్మెల్యేలు ఉన్నచోట కూడా పార్టీ మున్సిపల్ స్థానాలను కైవసం చేసుకోలేకపోయింది. అయితే ఇప్పుడు.. బిజెపికి రాజకీయ పరిశీలకులు సూచనలు చేస్తున్నారు. వచ్చే సాధారణ ఎన్నికల్లో తెలంగాణలో పార్టీ అధికారంలోకి రావాలంటే పొత్తు పెట్టుకుని ముందుకు వెళ్లడం మినహా ఆ పార్టీకి మరో మార్గం లేదని.. దీనిపై అధిష్టానం కసరత్తు చేయాలని సూచిస్తున్నారు.ఆంధ్రప్రదేశ్ ఫార్ములాను తెలంగాణలో కూడా అమలు చేస్తేనే ఆ పార్టీ సత్తా చాటే అవకాశం ఉంటుందని.. స్థానిక సంస్థల్లో పట్టు లేనప్పుడు ఎంపీ స్థానాలు గెలిచిన పార్టీ బలోపేతం కావడం కష్టం అంటూ హెచ్చరిస్తున్నారు పరిశీలకులు. నాయకులు విమర్శలకు మాత్రమే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పనిచేయాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు బ్యాంకును వీలైనంత త్వరగా తమ వైపుకు తిప్పుకోకపోతే పార్టీ మరింతగా బలహీనపడే అవకాశం ఉంటుందని హెచ్చరిస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో పొత్తు పెట్టుకోకుండా బిజెపి ముందుకు వెళ్ళవద్దని.. కాంగ్రెస్ పార్టీని తక్కువ అంచనా వేయడం కరెక్ట్ కాదంటూ అభిప్రాయపడుతున్నారు. జనసేన పార్టీతో కలిసి మున్సిపల్ ఎన్నికల్లో పోటీ చేసి ఉంటే మంచి ఫలితాలు వచ్చేవని ఆ పార్టీనాయకత్వానికి పలువురు సూచిస్తున్నారు.

**ప్లాన్ బీలో కేటీఆర్...**

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ సాధించిన ఫలితాలు సంతృప్తికరంగా ఉన్నాయని, రాబోయే రోజుల్లో మరింత మెరుగైనఫలితాల కోసం పటిష్టమైన కార్యాచరణ రూపొందిస్తామని ఆయన ప్రకటించారు.: సుమారు 700–800 వార్డుల్లో విజయం సాధిస్తామని ఆశించామని, ప్రస్తుతం 15 మున్సిపాలిటీల్లో స్పష్టమైన మెజారిటీ సాధించామని కేటీఆర్ తెలిపారు. మరో 37 చోట్ల హంగ్ ఏర్పడిందని, అక్కడ బీఆర్ఎస్ బలంగా ఉందని పేర్కొన్నారు. గద్వాల, వర్ధన్నపేట వంటి చోట్ల అధికారులు రీకౌంటింగ్ పేరుతో కాలయాపన చేశారని, అయినప్పటికీ కార్యకర్తలు వీరోచితంగా పోరాడారని కొనియాడారు.అధికార కాంగ్రెస్ పార్టీ డబ్బు, మద్యం, పోలీసు యంత్రాంగాన్ని అడ్డం పెట్టుకుని అక్రమాలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు.సింగరేణి ప్రాంతంలో అక్రమాలను అడ్డుకునేందుకు సీపీఐతో కలిసి పనిచేస్తామని కేటీఆర్ స్పష్టం చేశారు. కొత్తగూడెం కార్పొరేషన్‌లో సీపీఐకి మద్దతు ఇస్తామని, ఈ మేరకు కూనంనేని సాంబశివరావుతో మాట్లాడినట్లు వెల్లడించారు.హంగ్ ఏర్పడిన చోట చైర్మన్ పీఠాల కోసం కాంగ్రెస్, బీజేపీలు లోపాయికారీ ఒప్పందాలు చేసుకుంటున్నాయని, బేరసారాలకు తెరలేపాయని విమర్శించారు.ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైందని, పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని కేటీఆర్ అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే, బీఆర్ఎస్ నుంచి వెళ్లిన 10 మంది ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలని ఆయన సవాల్ విసిరారు. రాష్ట్రానికి కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్ష అని ప్రజలు బలంగా నమ్ముతున్నారని ఆయన పునరుద్ఘాటించారు.

## బంజారాలను అవమానించిన కాంగ్రెస్ ప్రభుత్వం: ఎస్టీ సెల్ యూనియన్

**వైరా, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** ఖమ్మం జిల్లా, వైరాలో ఏన్కూర్ ప్రెస్ మీట్ లో ఏన్కూర్ మండల ఎస్టీ సెల్ అధ్యక్షులు భుక్యా వినోద్ కుమార్ రాథోడ్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం బంజారా ప్రజలను అవమానిస్తోందని ఆరోపించారు. గత ప్రభుత్వాలు బంజారాల ఆరాధ్య దైవం శ్రీ శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని ఘనంగా నిర్వహించేవని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు దాటినా ఒక్కసారి కూడా సేవాలాల్ జయంతిని నిర్వహించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

## డివైడర్ ను ఢీకొట్టిన లారీ

**పాలేరు, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** ములకలపల్లిలో సోమవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. వేగంగా వెళ్తున్న లారీ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. డివైడర్ నిర్మాణ పనులు జరుగుతున్న ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు లేకపోవడమే ప్రమాదానికి కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## కొత్తగూడెం కార్పొరేటర్ నరేష్ ప్రమాణ స్వీకారం, డివిజన్ అభివృద్ధికి హామీ

**సత్తుపల్లి, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్‌లో 48వ డివిజన్ కార్పొరేటర్ ధర్మాసోత్ నరేష్ ఘనంగా ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. డివిజన్ అభివృద్ధి తన ప్రధాన లక్ష్యమని, రహదారులు, డ్రైనేజీ, తాగునీటి సదుపాయాలు, వీధి దీపాల ఏర్పాటు వంటి సమస్యలను ప్రాధాన్యంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి, మహిళల సంక్షేమం, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణంపై దృష్టి సారిస్తానని, ప్రజలతో మమేకమై సమస్యలు పరిష్కరిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

## బిల్ నాయక్ తండాలో రోడ్డు ప్రమాదం

**నర్సంపేట, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం బిల్ నాయక్ తండా వద్ద సోమవారం రోడ్డు ప్రమాదం జరిగింది. రహదారిపై ఆగి ఉన్న ట్రాక్టర్ ను ఆటో ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు తెలియాల్సి ఉంది.

## ప్రశాంతంగా కౌన్సిలర్ ల ప్రమాణ స్వీకారం

**పరకాల, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** వరంగల్ జిల్లా నర్సంపేట మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన కౌన్సిలర్ల ప్రమాణ స్వీకారం సోమవారం ప్రశాంతంగా, అట్టహాసంగా మొదలైంది. వార్డుల వారీగా ప్రమాణ స్వీకార కార్యక్రమం సజావుగా సాగేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఉమారాణి, మున్సిపల్ కమిషనర్ భాస్కర్ హాజరయ్యారు.

## తొర్రూరులో ఎర్రబెల్లి పీఏపై కాంగ్రెస్ నాయకుల దాడి..!

**పాలకుర్తి, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మున్సిపల్ కేంద్రంలో సోమవారం ప్రమాణ స్వీకారం సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్యకర్తల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. మాజీ మంత్రి దయాకర్ రావు పీఏ, అనుచరులతో పాటు బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనతో తొర్రూరు కేంద్రంలో 144 సెక్షన్ విధించారు. పోలీసులు బందోబస్తును పటిష్ఠం చేశారు. ఈ ఘర్షణలో కొందరు మీడియా ప్రతినిధులను కూడా తోసివేశారు.

## ప్రమాణ స్వీకారంకు హాజరు కానీ స్వతంత్ర అభ్యర్థి

**వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** వర్ధన్నపేట మున్సిపాలిటీలో చైర్మన్ పదవిపై ఉత్కంఠ నెలకొంది. 11 వార్డుల ప్రమాణస్వీకారం పూర్తయింది. అయితే, 5వ వార్డు నుంచి స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన శిభారాణి ప్రమాణస్వీకారం పూర్తి కాకపోవడంతో సందిగ్ధత నెలకొంది. అసలు ఏం జరుగుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. రాజకీయ విశ్లేషకులు ఇది కాంగ్రెస్ రాజకీయ సమీకరణాలలో భాగంగా జరుగుతుందని భావిస్తున్నారు.

## షవర్ కు ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య

**వరంగల్ వెస్ట్, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** షేక్‌పేటలోని నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్న వరంగల్ మహబూబాబాద్ కు చెందిన గుగులోత్ సంధ్యారాణి(20) హాస్టల్ గదిలో షవర్ కు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం స్నేహితురాళ్లతో కలిసి అల్పాహారం తీసుకున్న తర్వాత, సెలవు దినం కావడంతో అందరూ నిద్రపోతున్న సమయంలో ఈ ఘటన జరిగింది. స్నేహితులు తలుపు తట్టగా లోపలి నుంచి గడియ వేసి ఉండటంతో హాస్టల్ యజమానికి సమాచారం అందించారు. ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మడికొండలో అగ్నిగుండాల కార్యక్రమం: భక్తుల ఆధ్యాత్మిక అనుభూతి



**వర్ధన్నపేట, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండలోని శ్రీ మెట్టు రామలింగేశ్వర స్వామి దేవాలయంలో శివపార్వతుల కళ్యాణం అనంతరం ఉపవాసం, జాగారం ఉన్న భక్తులు శివనామ స్మరణతో అగ్నిగుండాల ఏర్పాట్లను వీక్షించారు. కుల, మతాలకు అతీతంగా అనేక ప్రాంతాల ప్రజలు ఈ అగ్నిగుండాలను దాటారు. మడికొండ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ జయరాజ్ గత మూడు సంవత్సరాలుగా ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు.

## తూప్రాన్‌లో కౌన్సిలర్ల రాకతో రాజకీయ ఉద్రిక్తత

**నర్సాపూర్, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** తూప్రాన్ పట్టణంలో మున్సిపల్ ఛైర్పర్సన్, వైస్ ఛైర్మన్ ఎన్నికల సందర్భంగా ఉద్రిక్తత నెలకొంది. కాంగ్రెస్, బీజేపీకి చెందిన ఏడుగురు కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యారు. మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు రోడ్డుపై ఆందోళన చేపట్టారు. బీఆర్ఎస్ సభ్యుల వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారనే ఆరోపణలు వినిపించాయి. పోలీసులు వెంటనే చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా కొనసాగుతోంది.

## రెండవ రోజు జాతర పురస్కరించుకొని అమ్మవారి ప్రత్యేక హారతి

**మెదక్, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** మెదక్ జిల్లా పాపన్నపేట మండలంలోని నాగసానుపల్లి గ్రామంలో ఉన్న శ్రీ ఏడుపాయల వన దుర్గ భవాని అమ్మవారి ఆలయంలో సోమవారం రెండో రోజు జాతర వైభవంగా కొనసాగింది. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, విశేష పూజలు, అభిషేకాలు, హారతులు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

## బల్దియాకు ఎంఐఎం కౌన్సిలర్లు

**ఆదిలాబాద్, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** ఆదిలాబాద్ మున్సిపాలిటీలో విజయం సాధించిన ఆరుగురు ఎంఐఎం నూతన కౌన్సిలర్లు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరయ్యారు. క్యాంపు నుంచి నేరుగా ప్రత్యేక వాహనంలో కార్యాలయానికి చేరుకున్న వీరు, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల్లో ఏ పార్టీకీ స్పష్టమైన మెజారిటీ లేని నేపథ్యంలో కీలక పాత్ర పోషించనున్నారు. ఎంఐఎం సభ్యుల మద్దతు ఎవరికి ఉంటుందనేది ఆసక్తికరంగా మారింది.

## ఆదిలాబాద్‌లో ఎమ్మెల్యే, డీఎస్పీ మధ్య వాగ్వాదం

**బోథ్, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికల సమయంలో బల్దియా వద్ద ఎమ్మెల్యే పాయల్ శంకర్, డీఎస్పీ జీవన్ రెడ్డి మధ్య వాగ్వాదం జరిగింది. ఓటు హక్కు లేని వారిని కార్యాలయంలోకి ఎలా అనుమతిస్తారని ఎమ్మెల్యే ప్రశ్నించగా, నిబంధనల ప్రకారం ఓటర్లను మాత్రమే అనుమతిస్తామని డీఎస్పీ వివరించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యే కొద్దిసేపు అసహనం వ్యక్తం చేశారు.

## పండగ వేళ విషాదం..
## కాలువలో పడి బాలుడి మృతి

**నిర్మల్, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** మహాశివరాత్రి పండుగ సందర్భంగా ఆదిలాబాద్ జిల్లాలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. బోథ్ మండలంలోని కరత్వాడ ప్రాజెక్టు వద్ద మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ సమీపంలోని కాలువలో షేక్ ఇమ్రాన్ (12) అనే బాలుడు ప్రమాదవశాత్తు జారి పడి మృతి చెందాడు. స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుతున్నప్పుడు బంతి కాలువలో పడడంతో, దానిని తీసుకోవడానికి వెళ్ళిన బాలుడు కాలువలో పడి మరణించినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఉపవాస దీక్షలు విడిచిన భక్తులు

**ముథోల్, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** నిర్మల్ జిల్లా కేంద్రంలోని పలు శైవ క్షేత్రాలు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మారుమోగాయి. రెండవ రోజు సోమవారం భక్తులు ఉపవాస దీక్షలు విడిచి, అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. సోన్ మండలం సాకెర గ్రామ సమీపంలోని శ్రీ రమా సహిత సత్యనారాయణ శివ పంచాయతన కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉదయం అన్న పూజా కార్యక్రమం నిర్వహించారు.

## కలమడుగు వద్ద పెట్రోల్ లేక భక్తుల ఇక్కట్లు

**ఖానాపూర్, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలకు వెళ్లే భక్తులు, వాహనదారులు మంచిర్యాల జిల్లా, జన్నారం మండలం, కలమడుగు గ్రామ శివారులో గోదావరి బ్రిడ్జి సమీపంలోని హెచ్‌పీ బంకులో పెట్రోల్ అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కారణంగా వాహనాలు ఇరువైపులా నిలిచిపోయాయి. ప్రధాన రహదారి పక్కన ఉన్న ఈ బంకులో పెట్రోల్ స్టాక్ ఉండేలా హెచ్‌పీ యాజమాన్యం చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

## కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్ అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ !

**కరీంనగర్, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** కరీంనగర్ మేయర్ పీఠంపై ఉత్కంఠ కొనసాగుతోంది. మేయర్ పదవికి కొలగాని శ్రీనివాస్‌ను, డిప్యూటీ మేయర్ పదవికి సునీల్ రావులను బీజేపీ తమ అభ్యర్థులుగా ప్రకటించింది. ఈ ప్రకటనతో రాజకీయ వాతావరణం వేడెక్కింది. రాబోయే రోజుల్లో ఈ పదవుల కోసం తీవ్రమైన పోటీ నెలకొనే అవకాశం ఉంది. బీజేపీ తమ అభ్యర్థులను ప్రకటించడం ద్వారా ఎన్నికల ప్రచారానికి సన్నద్ధమవుతోంది.

## జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం వద్ద ఉత్కంఠ

**హుజూరాబాద్, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ కార్యాలయం వద్ద ఉత్కంఠ నెలకొంది. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నుండి గెలిచిన కౌన్సిలర్లు, ఇండిపెండెంట్లు మున్సిపల్ కార్యాలయానికి చేరుకున్నారు. బీఆర్ఎస్ పార్టీ మ్యాజిక్ ఫిగర్‌కు చేరుకోవడంతో చైర్మెన్ పీఠం దక్కించుకునే అవకాశం ఉంది. ఈ పరిణామాలతో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

## కీసర గుట్టలో ఉపసర్పంచ్ విజయ్ కుమార్ ప్రత్యేక పూజలు

**మానకొండూరు, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** మహా శివరాత్రి సందర్భంగా కీసర గుట్ట శ్రీ రామలింగేశ్వర ఆలయంలో కేశవపట్నం ఉపసర్పంచ్ ఆకుబత్తిని విజయ్ కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో, ఐశ్వర్య సంపదలతో ఉండాలని, గ్రామం అభివృద్ధి దిశగా ముందుకు సాగాలని పరమేశ్వరుడిని ప్రార్థించినట్లు తెలిపారు. కరీంనగర్ జిల్లా, మానకొండూర్, హుజురాబాద్ ప్రాంతంలోని కేశవపట్నం గ్రామ ప్రజలకు మహా శివరాత్రి శుభాకాంక్షలు తెలిపారు. ఆయన కుటుంబ సమేతంగా అభిషేకాలు, అర్చనలు నిర్వహించి భక్తిశ్రద్ధలతో శివుని ఆశీర్వాదాలు పొందారు.

## పండుగ పూట విషాదం:
## బైక్ అదుపు తప్పి యువకుడు మృతి

**సిరిసిల్ల, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** కోనరావుపేట మండలంలోని ధర్మారానికి చెందిన మల్లబోయిన మహేశ్ (34) అనే యువకుడు పండుగ పూట విషాదంలో మరణించాడు. మత్స్యకారుడిగా జీవనం సాగిస్తున్న మహేశ్, తన బైక్‌పై కోనరావుపేట నుండి తిరిగి వస్తుండగా నిజామాబాద్ ఎల్లమ్మ ఆలయం మూలమలుపు వద్ద బైక్ అదుపు తప్పి పొలంలోకి దూసుకెళ్లింది. బురదలో కూరుకుపోయిన మహేశ్ శ్వాస ఆడక మృతిచెందినట్లు సమాచారం. అటుగా వెళ్తున్న వాహనదారులు ఈ విషయాన్ని కుటుంబీకులకు తెలియజేశారు.

## ద్వారకామయి ఆసుపత్రి కరీంనగర్ వారి ఉచిత వైద్య శిబిరము

**చొప్పదండి, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** బోయినపల్లి మండలం విలాసాగర్ గ్రామ సర్పంచ్ ఏనుగుల కనకయ్య ఆధ్వర్యంలో ద్వారకామయి ఆసుపత్రి, కరీంనగర్ వారు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏనుగుల కనకయ్య, వార్డు సభ్యులు కమటం రాజమహేందర్, హాస్పిటల్ మేనేజ్మెంట్ డాక్టర్ శ్రావ్య శ్రీ, డాక్టర్ రాజేష్ రెడ్డి, డాక్టర్ రాథోడ్, జువ్వెంతల శ్రీనివాస్ రెడ్డి, ప్రశాంత్, మార్కెటింగ్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు. ఈ శిబిరం ద్వారా గ్రామ ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించబడ్డాయి.

### వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన

**ఖమ్మం, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** ప్రకృతి, వన్యప్రాణుల సంరక్షణకు అటవీ శాఖ ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోంది. పండుగలు, జాతరల వద్ద భక్తులకు అవగాహన కల్పించేందుకు జిల్లా అటవీ అధికారి సిద్ధార్థ్ విక్రమ్ సింగ్ ఆధ్వర్యంలో కార్యాచరణ ప్రారంభమైంది. ఇందుకోసం కంట్రోల్ రూం ఏర్పాటు చేసి, సమస్యల పరిష్కారానికి 8742295323 నంబర్‌ను అందుబాటులో ఉంచారు. మహా శివరాత్రి సందర్భంగా జిల్లాలోని అటవీ ప్రాంతాల సమీప ఆలయాల వద్ద భక్తులకు అవగాహన కల్పించారు.



## ప్రగతి నగర్ ఆలయంలో అన్నదానం




**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** నిజాంపేట్ సర్కిల్, ప్రగతి నగర్‌లో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీ వాసవి సేవక్ ఆధ్వర్యంలో పట్టాభి రామాంజనేయ స్వామి ఆలయంలో ఘనంగా ప్రసాదం పంపిణీ కార్యక్రమం జరిగింది. సంస్థ అధ్యక్షులు అల్లాడి మహేష్ గుప్తా మాట్లాడుతూ, ప్రగతి నగర్ వాసవి సేవక్ ప్రెసిడెంట్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్, కమిటీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని భక్తులకు ప్రసాదం అందించారని తెలిపారు. ముఖ్యంగా ఐటీ ఉద్యోగులు తమ సమయాన్ని కేటాయించి సేవా కార్యక్రమంలో పాల్గొనడం అభినందనీయమని పేర్కొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## అంతరిక్ష అద్భుతం కంకణాకార సూర్యగ్రహణం




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్‌లో 17 ఫిబ్రవరి 2026 రోజున ఖగోళ దృశ్యం ఆవిష్కృతం అవనున్నది. ఈ రోజు అరుదైన కంకణాకార సూర్యగ్రహణం సంభవించనుంది. 2026లో తొలి సూర్యగ్రహణంగా గుర్తించబడి ఖగోళ శాస్త్రవేత్తల్లో ఉత్సుకతను రేకెత్తిస్తున్నది. ప్రధానంగా అంటార్కిటికా, దక్షిణాఫ్రికా ప్రాంతాల్లో కూడా కనిపించే సూర్యగ్రహణం 17 ఫిబ్రవరి రోజు మధ్యాహ్నం 3:26 గంటలకు ప్రారంభమై రాత్రి 7:57 గంటలకు ముగుస్తుంది. చంద్రుడు భూమి నుంచి ఎక్కువ దూరంలో ఉండి సూర్యుడి కన్న చిన్నగా కలిపిస్తాడు. సూర్యుడు మరియు భూమి మధ్య ప్రయాణించి, సూర్యుడి కేంద్రాన్ని కమ్మి, దాని బయటి అంచులు కనిపించే విధంగా ప్రకాశవంతమైన వలయాన్ని సృష్టిస్తుంది. ఈ వలయాన్ని 'అగ్ని వలయం (రింగ్ ఆఫ్ ఫైర్)' లేదా 'కంకణాకార సూర్యగ్రహణం'గా పిలవడం జరుగుతున్నది. ఈ వలయం సుమారుగా 2 నిమిషాల 20 సెకన్లు స్పష్టంగా కనిపిస్తుంది. ఈ సమయంలో చంద్రుడు సూర్యుడిని దాదాపు 96 శాతం కప్పివేస్తాడు. ఈ గ్రహణం భారతదేశం నుంచి చూడలేం. సూర్యగ్రహణ సమయంలో సూర్యుడిని నేరుగా చూస్తే దృష్టి సమస్యలు రావచ్చని గమనించాలి. ఆధునిక శాస్త్రంతో పాటు వేద సంప్రదాయ కలయికగా ఈ అద్భుతమైన భౌతిక దిగ్విజయం అని తెలుసుకోవాలి. ఈ సూర్యగ్రహణ కాలాన్ని "సూతక్ కాలం" లేదా "సూతకం" అని పిలుస్తాం. మనకు కనిపించని పగటి పూట సంభవిస్తున్న సూర్యగ్రహణ సమయంలో సూతకం ఉండదు కాబట్టి భారతదేశంలో అన్ని రోజువారీ కార్యక్రమాలు, దేవాలయాల దర్శనం కొనసాగించవచ్చు. 03 మార్చి 2026 రోజు మరో సంపూర్ణ చంద్ర గ్రహణం సంభవించనున్నది. సూర్యగ్రహణం అనే ఒక ఖగోళ సంఘటన ప్రభావం 12 రాశిచక్రాలపై అనుభూతి చెందుతుంది. గ్రహణ సమయంలో సూర్యుడు కుంభరాశిలో ఉన్నందున శు భప్రదమని భావించాలి. ఖగోళ అద్భుతాలను అవగాహన చేసుకుంటూ, నక్షత్ర గ్రహ ఉపగ్రహాల కదలికలను గమనిస్తూ మన విజ్ఞాన రెక్కలను బలీయం చేసుకుందాం. కంకణాకార సూర్యగ్రహణం మానవాళికి మేలు చేయాలని కోరుకుందాం.

# కౌన్సిల్ సంఖ్యాబలం? నాయకత్వ పోరాటం

**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ పట్టణ రాజకీయాల్లో మరో కీలక మలుపుకు నేడు తెరలేపుతోంది. వార్డు సభ్యుల ఎన్నికలతో వ్యక్తమైన ప్రజా తీర్పు ఇప్పుడు మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల రూపంలో అధికార నిర్మాణంగా మారబోతోంది. పట్టణ స్థానిక సంస్థలు కేవలం పరిపాలనా యంత్రాంగాలే కావు; ప్రజల దైనందిన జీవన ప్రమాణాలు, మౌలిక సదుపాయాలు, పౌర సేవల నాణ్యత ? ఇవన్నీ ఇక్కడే నిర్ణయ మవుతాయి. అందుకే ఈ ఎన్నికలు స్థానిక రాజకీయాలకు మాత్రమే పరిమితం కాకుండా రాష్ట్ర రాజకీయ దిశను సూచించే సూచికలుగా భావించబడు తున్నాయి. ప్రజాస్వామ్యంలో అత్యంత దగ్గర స్థాయిలో జరిగే ఈ ప్రక్రియలో ప్రజల అభిప్రాయం, పార్టీల వ్యూహాలు, స్థానిక సామాజిక సమీకరణాలు కలిసి ఒక సమగ్ర రాజకీయ దృశ్యాన్ని సృష్టిస్తున్నాయి. ఈ ఎన్నికల నిర్వహణ మొత్తం రాజ్యాంగబద్ధ వ్యవస్థలో భాగంగా జరుగుతోంది. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలను పర్యవేక్షిస్తూ నియమ నిబంధనలను అమలు చేస్తున్నది తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం. ఎన్నికల షెడ్యూల్ నుంచి ఫలితాల ధృవీకరణ వరకు ప్రతి దశలో పారదర్శకత, చట్టబద్ధతను కాపాడే బాధ్యత ఈ సంస్థపై ఉంది. వార్డు సభ్యుల ఎన్నికల అనంతరం కౌన్సిల్ ఏర్పడుతుంది. ఆ కౌన్సిల్‌లోని ఎన్నికైన సభ్యులే మేయర్ లేదా చైర్మన్‌ను ఎన్నుకుంటారు. ఈ విధానం ప్రత్యక్ష ప్రజా తీర్పు మరియు ప్రతినిధి ప్రజాస్వామ్యం మధ్య సమతుల్యతను సూచిస్తుంది. కొన్ని చోట్ల ఎక్స్-ఆఫిషియో సభ్యుల పాత్ర, చట్టపరమైన వివరణలు, పార్టీ విప్‌లు వంటి అంశాలు ఎన్నికల ఉత్కంఠను పెంచుతాయి. ప్రస్తుతం నిర్వహించిన పట్టణ ఎన్నికలు రాష్ట్ర వ్యాప్తంగా అనేక మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలను కవర్ చేశాయి. వేల సంఖ్యలో వార్డుల్లో జరిగిన పోటీ పట్టణ ఓటర్ల చైతన్యాన్ని ప్రతిబింబించింది. నీటి సరఫరా, పారిశుధ్యం, ట్రాఫిక్, రహదారులు, పట్టణ ప్రణాళిక, పన్నుల నిర్వహణ వంటి సమస్యలు ఎన్నికల ప్రధాన అజెండాగా నిలిచాయి. స్థానిక సమస్యలపై స్పష్టమైన హామీలు ఇచ్చిన అభ్యర్థులకు ప్రజలు ప్రాధాన్యం ఇచ్చినట్టు ఫలితాల ధోరణి సూచిస్తోంది. పట్టణ ఓటరు ఇప్పుడు అభివృద్ధి, సేవల నాణ్యత, పరిపాలనా సమర్థత ఆధారంగా నిర్ణయం తీసుకుంటున్నాడనే అభిప్రాయం బలపడుతోంది. ఫలితాల పరంగా చూస్తే పట్టణ రాజకీయాల్లో స్పష్టమైన పోటీ కనిపించింది. అధికారంలో ఉన్న ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ అనేక పట్టణాల్లో ముందంజలో నిలవడం ద్వారా కౌన్సిళ్లలో ఆధిక్యాన్ని సంపాదించింది. రాష్ట్ర నాయకత్వం, ముఖ్యంగా రేవంత్ రెడ్డి ముందుంచిన అభివృద్ధి, సంక్షేమ దృక్కోణం పట్టణ ఓటర్లపై ప్రభావం చూపిందనే విశ్లేషణ వినిపిస్తోంది. కౌన్సిల్‌లో స్పష్టమైన సంఖ్యాబలం ఉన్న చోట మేయర్, చైర్మన్ ఎన్నికలు సులభతరంగా జరిగే అవకాశం ఉంది. అయితే పట్టణ రాజకీయాల్లో స్థానిక నాయకత్వం, వ్యక్తిగత ప్రభావం కూడా కీలక పాత్ర పోషిస్తాయి. ప్రధాన ప్రతిపక్షంగా నిలుస్తున్న భారత్ రాష్ట్ర సమితి అనేక పట్టణాల్లో గట్టి పోటీ ఇచ్చింది. గత పాలనలో చేపట్టిన పట్టణ మౌలిక వసతుల అభివృద్ధిని ప్రధానంగా ప్రస్తావిస్తూ ఈ పార్టీ తన బలం నిలబెట్టుకునే ప్రయత్నం చేసింది. కొన్ని కౌన్సిళ్లలో స్పష్టమైన మెజారిటీ దక్కకపోయినా, కీలక స్థానాల్లో ప్రభావం చూపే స్థాయిలో సభ్యత్వాన్ని సాధించింది. హంగ్ పరిస్థితుల్లో ఈ పార్టీ పాత్ర మరింత ప్రాధాన్యం సంతరించుకుంటుంది. స్వతంత్ర సభ్యుల మద్దతు, వ్యూహాత్మక చర్చలు, రాజకీయ సమన్వయం ? ఇవన్నీ నాయకత్వ ఎన్నికల్లో నిర్ణయాత్మకంగా మారవచ్చు. పట్టణ స్థాయిలో విస్తరణ లక్ష్యంగా భారతీయ జనతా పార్టీ కూడా గణనీయ ప్రదర్శన కనబరిచింది. మధ్యతరగతి పట్టణ ఓటర్లను ఆకర్షించే అభివృద్ధి వాదన, స్థానిక సమస్యలపై దృష్టి ఈ పార్టీకి కొన్నిచోట్ల కీలక స్థానాలను తెచ్చిపెట్టాయి. ఇదే సమయంలో నగర ప్రాంతాల్లో ప్రభావం కలిగిన ఆల్ ఇండియా మజ్లిస్-ఇత్తెహాదుల్ ముస్లిమీన్ తన సామాజిక ఆధారాన్ని నిలబెట్టుకుంటూ కొన్ని కౌన్సిళ్లలో ప్రభావాన్ని కొనసాగిస్తోంది. ఈ వైవిధ్యం పట్టణ రాజకీయాల బహుముఖ స్వరూపాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ ఎన్నికలలో ముఖ్యంగా గమనించాల్సిన అంశం హంగ్ కౌన్సిళ్ల పెరుగుదల. అనేక పట్టణాల్లో ఏ ఒక్క పార్టీకి పూర్తి మెజారిటీ రాకపోవడంతో స్వతంత్రులు, చిన్న పార్టీలు కీలక పాత్రలోకి వచ్చాయి. ఇలాంటి సందర్భాల్లో రాజకీయ చర్చలు, కూటములు, వ్యూహాత్మక మద్దతులు ప్రధానమవుతాయి. సభ్యుల నిర్ణయాలు, పార్టీ విప్‌లు, చట్టపరమైన పరిమితులు ? ఇవన్నీ కలిసి నాయకత్వ ఎన్నికల దిశను నిర్ణయిస్తాయి. ప్రజాస్వామ్యంలో చర్చా సంస్కృతి, రాజీ రాజకీయాలు ఇక్కడ స్పష్టంగా కనిపిస్తాయి. మేయర్ లేదా చైర్మన్ పదవి పట్టణ పాలనలో కేంద్ర స్థానం. పట్టణ బడ్జెట్ వినియోగం, అభివృద్ధి ప్రాధాన్యాల నిర్ణయం, పౌర సేవల సమన్వయం, పరిపాలనా పర్యవేక్షణ ? ఇవన్నీ నాయకత్వంపై ఆధారపడి ఉంటాయి. కౌన్సిల్‌తో సమన్వయం సాధించడం, అధికార యంత్రాంగంతో సమర్థంగా పని చేయడం, ప్రజా సమస్యలకు వేగంగా స్పందించడం ? ఇవి విజయవంతమైన పట్టణ పాలనకు అవసరమైన లక్షణాలు. అందువల్ల ఈ ఎన్నికలు కేవలం రాజకీయ విజయాల కొలమానం కాకుండా పట్టణ ప్రజల జీవన నాణ్యతను ప్రభావితం చేసే నిర్ణాయక దశ. పూర్వ ఎన్నికలతో పోలిస్తే పట్టణ ఓటర్ల ప్రాధాన్యతల్లో మార్పు కనిపిస్తోంది. వ్యక్తిగత సేవా చరిత్ర, స్థానిక సమస్యలపై అవగాహన, అభివృద్ధి దృక్కోణం ? ఇవి అభ్యర్థుల ఎంపికలో కీలక ప్రమాణాలుగా మారాయి. పార్టీ గుర్తింపు ఉన్నప్పటికీ, స్థానిక నాయకత్వం ప్రభావం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. ఇది పట్టణ ప్రజాస్వామ్యంలో పరిపక్వతకు సంకేతంగా విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీల వ్యూహాల పరంగా చూస్తే స్పష్టమైన సంఖ్యాబలం ఉన్న చోట నాయకత్వ ఎన్నికలు సులభంగా జరిగే అవకాశం ఉంది. హంగ్ పరిస్థితుల్లో మాత్రం చర్చలు, మద్దతు సమీకరణాలు కీలకం. ప్రతి పార్టీ తనకు అనుకూలమైన కూటమి

నిర్మాణానికి ప్రయత్నిస్తోంది. స్వతంత్ర సభ్యుల ప్రాధాన్యం పెరగడంతో రాజకీయ చాతుర్యం పరీక్షకు లోనవుతోంది. ఈ ప్రక్రియ మొత్తం పట్టణ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీయవచ్చు. మొత్తం మీద ఈ పట్టణ ఎన్నికలు తెలంగాణ రాజకీయ దిశను ప్రతిబింబిస్తున్నాయి. ప్రజా తీర్పు ఆధారంగా ఏర్పడే కౌన్సిళ్లు, వాటి నుంచి ఎన్నికయ్యే నాయకత్వం పట్టణాభివృద్ధికి కొత్త దిశను నిర్దేశించే సామర్థ్యం కలిగి ఉంది. పారదర్శక పరిపాలన, సమర్థ సేవల అమలు, ప్రజల భాగస్వామ్యం ? ఇవే విజయవంతమైన పట్టణ పాలనకు మూల స్తంభాలు. నేడు జరుగుతున్న మేయర్, చైర్మన్ ఎన్నికలు ఆ దిశగా కీలక అడుగు. పట్టణ ప్రజాస్వామ్యం బలపడితేనే రాష్ట్ర అభివృద్ధి స్థిరంగా ముందుకు సాగుతుంది. తెలంగాణ పట్టణ రాజకీయాల్లో ఈ ఎన్నికలు ఒక కీలక మైలురాయిగా నిలిచి, భవిష్యత్ పాలనా రూపురేఖలను నిర్దేశించనున్నాయి.

# ఎమ్మెల్యేలకు సీఎం స్వీట్ వార్నింగ్



**విజయవాడ, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** సెంబ్లీలో మీడియాతో చిట్ చాట్ లో పలు అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. కీలక వ్యాఖ్యలు చేశారు చంద్రబాబు. పార్టీ ఎమ్మెల్యేలకు చంద్రబాబు వార్నింగ్ ఇచ్చారు. మారకపోతే మీకే నష్టం అని తేల్చి చెప్పారు. ఎమ్మెల్యేలకు సీల్డ్ కవర్ లో ఇచ్చే నివేదిక ద్వారా వారిని వారికి అద్దంలో చూపిస్తున్నా అని చెప్పారు. 95-96 మాదిరిగానే ఈసారి నిక్కచ్చిగా ఉంటానని చంద్రబాబు స్పష్టం చేశారు. మొత్తం 9 పేరా మీటర్లలో సర్వే చేయించి వారికి నివేదిక ఇస్తున్నా అని తెలిపారు. వారికి తెలియని ఇంకొన్ని పేరా మీటర్లు కూడా తన దగ్గర ఉన్నాయన్నారుసిఎం చంద్రబాబు మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేసారు. ప్రస్తుత పరిస్థితుల్లో మెరుగైన బడ్జెట్ ప్రవేశపెట్టామన్నారు. వైసీపీ విధ్వంసం నుంచి కోలుకోవడానికి ఇంకా సమయం పడుతుందని, ఇబ్బందులు అధిగమించిన ఇప్పుడిప్పుడే ట్రాక్ ఎక్కుతున్నామని తెలిపారు. రాష్ట్రంలో సమస్యలు అయితే మాత్రం ఇంకా చాలా ఉన్నాయి.. ఆదాయం తక్కువ ఖర్చులు ఎక్కువ అనేది వారసత్వంగా వచ్చిందన్నారు. కేంద్రం సహకారంతో మేనేజ్ చేసుకుంటూ వస్తున్నాం.. వ్యవసాయం నుంచి ఎక్కువ ఆదాయం రావాలని ఆకాంక్షించారు. సేవా రంగంలోనూ ఆదాయం మరింత పెరగాలి.. ఒంగోలు పాలకు, అనంతపురం పండుకు ఎంతో డిమాండ్ ఉందని తెలిపారు. ఈ రెండింటి రుచి మరెక్కడా రాదు.. రెండు మూడేళ్లలో మరింత మెరుగైన బడ్జెట్ ప్రవేశపెడతామన్నారు. అప్పటికి పూర్తిగా గాడిలో పడతాం.. రెండు మూడేళ్లలో అమరావతికి ఒక రూపు వస్తుందని పేర్కొన్నారు. అమరావతి రోడ్లను జాతీయ రహదారికి అనుసంధానిస్తున్నామని పేర్కొన్నారు. ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్ వల్ల యాక్సిస్ మరింత పెరుగుతుందన్నారు సిఎం.రాయలసీమ ముఖచిత్రం మార్చింది మేమే.. హార్టికల్చర్ హబ్ కు రూ. 30 వేల కోట్లు కేటాయించడం బాగుందని తెలిపారు. రాయలసీమలో ఒకప్పుడు పశువులకు నీరు కూడా దొరికేది కాదన్న ఆయన.. పశుగ్రాసం, నీళ్లను రైళ్లలో తరలించిన సందర్భాలు ఉన్నాయన్నారు. 2014 19 మధ్య కూడా రైన్ గన్స్ తో పంటలు కాపాడే పరిస్థితి ఉండేది..అప్పుడే హంద్రీనీవాను సీరియస్గా తీసుకున్నామని, దేశంలోనే నాణ్యమైన పండ్లు రాయలసీమ నుంచి వస్తున్నాయి.. రాయలసీమలో పండే దానిమ్మకు మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు.ఎమ్మెల్యేలకు సీల్డ్ కవర్లో ఇచ్చే నివేదిక వారి పని తీరుకు నిలువుటద్దమని తెలిపారు. నేను గతంలో ఉన్నట్లే నిక్కచ్చిగానే ఉంటా.. మారకపోతే వాళ్లకే నష్టమని హెచ్చరించారు. మొత్తం తొమ్మిది పేరా మీటర్లలో సర్వే చేయించి వారికి నివేదిక ఇస్తున్నానని.. వారికి తెలియని ఇంకొన్ని పేరా మీటర్లు కూడా నావద్ద ఉన్నాయన్నారు. లోకేష్ తన పని తాను చేస్తున్నాడు.. నా పని నేను చేస్తున్నా అని.. నేతలతో మానవీయ సంబంధం, మోటివేషన్ భయం భక్తిలా ఉండాలంటూ చెప్పుకొచ్చారు.

# వల్లభనేని వంశీకి షాక్



**విజయవాడ, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ రాజకీయ భవిష్యత్తు విషయంలో ఇప్పుడు ఆసక్తి నెలకొంది. 2019లో పార్టీ మారిన ఆయన.. ఆ తర్వాత తెలుగుదేశం పార్టీ విషయంలో అనుసరించిన వైఖరి ఇప్పుడు ఆయనకు ఇబ్బందులు తెచ్చిపెడుతుంది అనే మాట వాస్తవం. ఇక ప్రస్తుతం వైసీపీలో ఉన్న వల్లభనేని వంశీ మోహన్.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తారా లేదా అనే దానికి సంబంధించి స్పష్టత రావటం లేదు. జైలు నుంచి విడుదలైన తర్వాత, ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేసిన వంశీ, మళ్లీ వెనక్కు తగ్గినట్లుగానే కనబడుతోంది.అయితే గ్రామాల్లో ఆయనకు కొంత ఫాలోయింగ్ ఉండటంతో, వంశీ ప్రజల్లోకి వెళ్లాలని ఆ పార్టీ అధిష్టానం కూడా కోరుతున్నప్పటికీ వంశీ దూకుడు ప్రదర్శించడం లేదు. కేసులు భయం కారణంగా వంశీ వెనక్కు తగ్గుతున్నట్లుగా స్పష్టంగా అర్థం అవుతుంది. వచ్చే ఎన్నికల నాటికి గన్నవరం నియోజకవర్గంలో పార్టీని బలోపేతం చేయాలి అంటే.. కచ్చితంగా వంశీ ప్రజల్లోకి రావాలని, ఆ పార్టీ కార్యకర్తలు కూడా కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను తనకు అనుకూలంగా మార్చుకోవాల్సిన అవసరం కూడా వంశీ పై ఉంది.అదేవిధంగా స్థానిక ఎమ్మెల్యే పై వచ్చే ఆరోపణల విషయంలో, కూడా వంశీ కాస్త దూకుడు ప్రదర్శించాలని

ఆ పార్టీ నాయకత్వం కోరుతోంది. అయితే ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో వంశీ బయటకు రావడానికి ఇష్టపడటం లేదు. దీనితో గన్నవరం నియోజకవర్గంలో, ఇన్చార్జిను మార్చాలనే ఆలోచనలో కూడా పార్టీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి ఇప్పటికే పూర్తిస్థాయిలో కసరత్తు కూడా చేశారని, అయితే ఒకరిద్దరి నేతలు అధినేత వైఎస్ జగన్ వద్ద నియోజకవర్గ పరిస్థితిని ప్రస్తావించడంతోనే వెనక్కు తగ్గినట్లుగా తెలుస్తోంది.వంశీ అరెస్టు విషయంలో గ్రామాల్లో కొంత సానుభూతి ఉంది అనే ప్రచారం కూడా ఉంది. దీనిని వంశీ వాడుకునే ప్రయత్నం కొంత చేసినప్పటికీ ఆ తర్వాత పరిస్థితులు సహకరించకపోవడంతో మళ్లీ సైలెంట్ అయిపోయారు. ఇక నియోజకవర్గంలో నాయకత్వాన్ని మారిస్తే, భవిష్యత్తులో సమస్యలు వచ్చే అవకాశం ఉందని అధిష్టానానికి ఇప్పటికే కొంతమంది చెప్పినట్లుగా వైసిపి వర్గాలు అంటున్నాయి. అందుకే వంశీ విషయంలో అధిష్టానం ఏ నిర్ణయం తీసుకోలేని పరిస్థితిలో ఉందని సమాచారం.

# మూడు ప్రాంతాల్లో 3 ఎకనామిక్ రీజియన్స్

**విజయవాడ, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి ప్రభుత్వం భారీ ప్రణాళికను సిద్ధం చేసింది. బడ్జెట్ లో తాజాగా కీలక ప్రతిపాదనలు చేశారు. ప్రాంతాల మధ్య అసమానతలు తొలగించి, అన్ని జిల్లాల్లో సమాన వృద్ధిని సాధించడమే ఈ భారీ వ్యూహం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం.మంత్రి పయ్యావుల కేశవ్ తన బడ్జెట్ ప్రసంగంలో.. విజన్ స్వర్ణాంధ్ర 2047 అమలు కోసం ప్రాంతీయ ఆకాంక్షలను నెరవేర్చేందుకు, సమ్మిళిత అభివృద్ధి సాధించేందుకు ప్రభుత్వం ప్రాంతీయ అభివృద్ధి విధానాన్ని అనుసరిస్తోందని చెప్పారు. ఇందులో భాగంగా విశాఖపట్టణం, అమరావతి, తిరుపతి రీజియన్లను రాష్ట్రానికి కీలకమైన గ్రోత్ ఇంజిన్లుగా గుర్తించిందని చెప్పారు. నీతి ఆయోగ్‌తో కలిసి విశాఖపట్టణం ఎకనమిక్ రీజియన్ (వీఈఆర్)కి ఎకనమిక్ మాస్టర్ ప్లాన్ తయారు చేశామని చెప్పారు. శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్టణం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, పోలవరం, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలు దీని పరిధిలోకి వస్తాయని చెప్పారువిశాఖపట్టణం ఎకనమిక్ రీజియన్ పరిధిలో ఏడు గ్రోత్ ఇంజిన్లు ఉన్నాయి. వీటిలో మ్యానుఫ్యాక్చరింగ్, సర్వీసెస్, మౌలిక వసతులు, పట్టణీకరణ, వ్యవసాయంలో 41హై ఇంపాక్ట్ ప్రాజెక్టులు ఏర్పాటవుతాయని చెప్పారు. వాటికి అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం, ప్రైవేట్ రంగాల నుంచి సమకూర్చుకుంటామని పయ్యావుల కేశవ్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొన్నారు. అంతేకాదు.. మెట్రో రైల్ ప్రాజెక్టులు సహా వీఈఆర్ కి సంబంధించి సుమారు 28వేల కోట్ల రూపాయలతో ప్రాజెక్టు ప్రతిపాదనలు సమర్పిస్తున్నామని చెప్పారు.వీఈఆర్ తరహాలోనే అమరావతి ఎకనామిక్ రీజియన్‌ను ప్రభుత్వం అభివృద్ధి చేయనుంది. ఈ రీజియన్ పరిధిలోకి ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు, గుంటూరు, పశ్చిమగోదావరి, ప్రకాశం, పల్నాడు, బాపట్ల, మార్కాపురం జిల్లాలు రానున్నాయి. ఈ ప్రాంత సమగ్ర అభివృద్ధికి

దోహదం చేసే వనరులు.. గ్రోత్ ఇంజిన్లు, బలాల్ని గుర్తించేందుకు శాస్త్రీయ పద్దతుల్లో సామాజిక, ఆర్థిక అధ్యయనం నిర్వహిస్తున్నామని బడ్జెట్ ప్రసంగంలో పయ్యావుల కేశవ్ తెలిపారు.వీఈఆర్, అమరావతి ఎకనామిక్ రీజియన్ అభివృద్ధి తరహాలో.. రాయలసీమ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ప్లాన్ ను ప్రభుత్వం సిద్ధం చేసింది. అనంతపురం, అన్నమయ్య, చిత్తూరు, కర్నూలు, నంద్యాల, ప్రకాశం, మార్కాపురం, శ్రీసత్యసాయి, తిరుపతి, వైఎస్ఆర్ కడప జిల్లాల్లోని 303 మండలాల్లో 200పైగా గ్లోబల్ హార్టికల్చర్ హబ్స్ గా మార్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది.

## సైలెంట్ మోడ్ లోకి కొట్టు సత్యనారాయణ

**ఏలూరు, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో సీనియర్ నేత అలకపాన్పు వైసీపీలో చర్చనీయాంశంగా మారింది. తాడేపల్లిగూడెం నియోజకవర్గ ఇంచార్జ్ బాధ్యతల నుంచి తప్పించడంతో..మాజీ డిప్యూటీ సీఎం, కొట్టు సత్యనారాయణ పూర్తిగా సైలెంట్ మోడ్‌లోకి వెళ్లిపోయారు. పార్టీ పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ మెంబర్ పోస్ట్ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకూ ప్రజాపక్షంగా గానీ, పార్టీ పరంగా గానీ ఆయన గొంతు వినిపించకపోవడంతో, కొట్టు అలకపాన్పు ఎక్కినట్లు చర్చే జరుగుతోంది.వడ్డీ రఘురామ్ నాయుడుకు వైసీపీ అధిష్టానం తాడేపల్లిగూడెం అసెంబ్లీ కోఆర్డినేటర్‌గా నియమించడంతో ఒక్కసారిగా సీన్ మారిపోయింది. అయితే కొట్టు మద్దతు ఇస్తారా, లేదా అన్న డైలమా కొనసాగింది. కానీ క్యాడర్ ఆయన మద్దతు ఉన్నా, లేకున్నా, ముందుకు వెళ్లడం తప్పదంటూ కొత్త రథసారథికి స్వాగతం పలకడం, నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశాన్ని సక్సెస్ చేయడంతో..కొట్టు డైలమాలో పడిపోయారట.ఈ సమావేశానికి ఇదే తాడేపల్లిగూడెంలో ఉండి కూడా కొట్టు సత్యనారాయణ హాజరుకాకపోవడం హాట్ టాపిక్‌గా మారింది. జిల్లా పార్టీ అధ్యక్షుడితో కలిపి వడ్డీ రఘురామ్ స్వయంగా కొట్టు సత్యనారాయణ నివాసానికి వెళ్లి మరీ, పార్టీ సమావేశానికి రావాలని ఆహ్వానించినా, ఆయన గైర్హాజరు కావడంపై అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారట. తాడేపల్లిగూడెం, పెంటపాడు మండల అధ్యక్షులు కూడా సమావేశానికి రాకపోవడంతో, వారిపై వేటు తప్పదేమోనన్న చర్చ మొదలైంది.తాడేపల్లిగూడెంలో క్యాడర్‌ను బలోపేతం చేసే పనిలో పడ్డారట వడ్డీ రఘురామ్. పార్టీ ఇంచార్జ్ బాధ్యతలు నుంచి తొలగించిన తర్వాత ఎక్కడా కనపడని కొట్టు సత్యనారాయణ..భీమవరం పర్యటనకు వెళ్లిన వైసీపీ అధినేత జగన్‌కు స్వాగతం పలికారు. ఆ సమయంలో కొట్టు సత్యనారాయణతో జగన్ కాస్త సీరియస్‌గానే వ్యవహరించినట్లు టాక్. అధిష్టానం నిర్ణయానికి ఎవరైనా కట్టుబడి ఉండాల్సిందేనని చెప్పినట్లు తెలుస్తోంది. కాంగ్రెస్ పార్టీలో, ఆ తర్వాత టీడీపీలో, ఆ తర్వాత వైసీపీలో చేరి ఎమ్మెల్యేగా, మంత్రిగా, డిప్యూటీ సీఎంగా కూడా పనిచేసిన కొట్టు సత్యనారాయణ నెక్స్ట్ స్టెప్ ఏంటనేది ఆసక్తికరంగా మారింది. ఓవైపు నియోజకవర్గంలో జనసేన ఎమ్మెల్యే ఉండటంతో ఆ పార్టీలోకి వెళ్లే ఛాన్స్ లేదంటున్నారు. ఇక టీడీపీలోకి వెళ్ళాలనుకున్నా..కొట్టు సత్యనారాయణను అంత తేలికగా పార్టీలోకి చేర్చుకోరని, పసుపు కండువా కప్పే అవకాశమే ఉండదని ప్రచారం జరుగుతోంది. దీంతో కొట్టు రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారిందన్న టాక్ వినిపిస్తోంది.తాడేపల్లిగూడెం వైసీపీలో రెండు వర్గాలు ఉండగా..కొట్టు సత్యనారాయణకు వైసీపీ అధిష్టానం చెక్ పెట్టడంతో..ఇక నియోజకవర్గంలో పార్టీ దూకుడుకు ఎలాంటి అడ్డంకులు ఉండబోవని క్యాడర్ హ్యాపీగా ఫీల్ అవుతోందట. గత ఎన్నికలకు ముందే కొట్టును తప్పించి ఉంటే..తాడేపల్లిగూడెంలో గెలిచే వాళ్లమంటూ పార్టీ పెద్దలకు చెప్పారట పలువురు ఫ్యాన్ పార్టీ లీడర్లు. దీంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో మీ ప్రతాపం చూపించండంటూ, నాయకులకు హితవు పలుకుతున్నారట వైసీపీ ముఖ్యనేతలు.కొత్త రథసారథి వడ్డీ రఘురామ్ అయినా అందర్నీ కలుపుకుని ముందుకెళ్తారో లేదో అన్నది కూడా చర్చనీయాంశంగా మారింది. అలక మీదున్న కొట్టు సత్యనారాయణ యాక్టీవ్ అవుతారా? లేక తనదారి తన చూసుకుంటారా అనేది క్యాడర్‌ను వెంటాడుతున్న ప్రశ్న. కొట్టుకు మద్దతుగా వైసీపీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశానికి గైర్హాజరైన మండల అధ్యక్షులపైనా వేటు వేస్తారా? వాళ్లిద్దరు కూడా వడ్డీ రఘురామ్‌తో కలిసి వస్తారా అనేది చూడాలి. ఇప్పటికైతే కొట్టు పొలిటికల్ ఫ్యూచర్‌లో డైలమాలో పడిందన్న చర్చ అయితే జరుగుతోంది.

## ఎన్నికలకు రెడీ అవుతున్న ఈసీ

**విజయవాడ,, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** స్థానిక పోరు, మున్సిపల్ ఎన్నికలపై ఏపీలో ఇప్పటినుంచే రాజకీయ వేడి రాజుకుంటోంది. లోకల్ బాడీస్, మున్సిపాలిటీల గడువు దగ్గర పడుతుంది. దీంతో స్థానిక ఎన్నికలకు ఈసీ రెడీ అవుతోంది. ఏపీలో ప్రస్తుత సర్పంచుల పదవీకాలం ఏప్రిల్‌లో ముగుస్తుంది.మార్చిలో..కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల్లో కార్పొరేటర్లు, కౌన్సిలర్ల పదవీకాలం ముగియనుంది. అందుకు తగ్గట్లుగానే స్టేట్ ఎలక్షన్ కమిషన్ అరేంజ్‌మెంట్స్‌ను స్పీడప్ చేసింది. మార్చిలో టెన్త్ ఎగ్జామ్స్ అయిపోయాక మొదట మున్సిపల్ ఎన్నికలకు..ఆ తర్వాత కొంత సమయం తీసుకుని సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలు పెట్టాలని ప్లాన్ చేస్తున్నారట. దీంతో ఏపీ రాజకీయ వేడి రాజుకుంటోంది. గ్రామాల్లో ఎలక్షన్ హీట్ స్టార్ట్ అయింది.రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే స్థానిక సంస్థల ఎన్నికల కోసం కసరత్తు మొదలెట్టింది. గత ఏడాది నుంచే ఏర్పాట్లలో బిజీ అయిపోయింది. అయితే జనగణన అడ్డంకిగా ఒకటి ఉందని ఆ మధ్య ప్రచారం జరిగింది. దాంతో ఎన్నికలు ఈ ఏడాది ఉండవేమో అని అనుకున్నారు. అయితే 2027 ఫిబ్రవరి 9 నుంచి 28 దాకా జనగణన ఉంటుందని అధికారులు ప్రకటించారు.స్థానిక ఎన్నికలు ముందుకు వచ్చాయి. యథావిధిగా షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరిపించాలని చూస్తున్నారట. మార్చి 9లోగా కార్పోరేషన్లు మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు చెందిన ఓటర్ల తుది జాబితాను ఫోటోలతో సహా రిలీజ్ చేయాలని ఎన్నికల సంఘం జిల్లాల అధికారులను ఆదేశించింది. ఆ తర్వాత ఓటర్ల జనాభా ఆధారంగా రిజర్వేషన్లు ఖరారు చేసి ఎన్నికల తేదీని ప్రకటిస్తారన్న టాక్ వినిపిస్తోంది.టీడీపీ 2014 నుంచి 2019 మధ్య అధికారంలో ఉన్నప్పుడు స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించలేదు. అనేక కారణాలతో జాప్యం జరిగింది. చివరికి ఎన్నికల ముందు ఎందుకు అనుకుని వాయిదా వేశారు. అయితే ఈ సారి అధికారంలో కూటమి మాత్రమే లేదు, జనసేన బీజేపీ కూడా ఉన్నారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరిపించాలని వారంతా కోరుతున్నారు.ఎన్నికలు జరిగితే ద్వితీయ తృతీయ శ్రేణి నేతలకు స్థానికంగా పదవులు దక్కుతాయని అంటున్నారు. దాంతో చాలాకాలంగా ఈ ఎన్నికల కోసం అంతా వేచి చూస్తున్నారు. ఈ క్రమంలో ఎన్నికలు పెట్టి తీరాలన్న భావన కూటమి పెద్దల్లో వ్యక్తం అవుతోందట. అయితే ముందుగా కార్పోరేషన్లు, మున్సిపాలిటీల ఎన్నికలు పెట్టి..ఆ తర్వాత స్థానిక ఎన్నికలకు వెళ్లే ఆలోచనలో సర్కార్ ఉందంటున్నారు. ఆ నిర్ణయం వెనక కూటమి పెద్దల వ్యూహం ఉందని కూడా చర్చ జరుగుతోంది.పట్టణాలలో మొదటి నుంచి వైసీపీకి కొంత బలం తక్కువగా ఉంటుంది. పైగా కూటమి పార్టీలకు అనుకూలంగా ఓటర్లు ఉంటారని అంటుంటారు. దాంతో పట్టణాల నుంచే పల్లెల వైపుగా స్థానిక ఎన్నికల యుద్ధాన్ని తీసుకెళ్లాలని కూటమి పెద్దలు ఆలోచన చేస్తున్నారట. కూటమి పటిష్టంగా ఉంది. పైగా విద్యావంతులు తటస్థులు ఇలా విభిన్న వర్గాలు పట్టణాల్లో తమకు అనుకూలంగా ఉంటారని భావిస్తున్నారట. అయితే స్థానిక ఎన్నికలు, మున్సిపల్ ఎన్నికలు పెడితే వైసీపీకి అసలైన రాజకీయ యుద్ధంగానే ఉంటుందని అంటున్నారు.కూటమి పార్టీలు ఉమ్మడిగా వస్తే వారిని తట్టుకుని నిలవాల్సిన అవసరం వైసీపీకి ఎంతైనా ఉంది. వైసీపీ ధీటైన వ్యూహాలను రచించి..బలమైన అభ్యర్థులను బరిలోకి నిలబెట్టకపోతే ఇబ్బంది తప్పదన్న చర్చ జరుగుతోందట. అయితే అధికారంలో ఏ పార్టీ ఉంటే..స్థానిక ఎన్నికల్లో ఆ పార్టీకే అనుకూలంగా ఫలితాలు వస్తుంటాయి. అయినా సరే తమ ఉనికి కోసం పోరాటం చేయాల్సిన బాధ్యత విపక్షంపైన ఉంటుంది. ఎంతో కొంత తమ సత్తా చాటి తమ బలం పెంచుకోవాల్సి ఉంటుంది. కూటమితో అమీతుమీ తేల్చుకునేందుకు వైసీపీ సై అంటుందో లేక ఎన్నికలను లైట్ తీసుకుంటుందో వేచి చూడాలి.

## పోటీ చేయాలంటున్న కేడర్...

**నెల్లూరు, ఫిబ్రవరి 16 పెన్ పవర్:** తెలంగాణ , ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రధాన ప్రతిపక్షాల తీరు మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. తెలంగాణలో అధికారాన్ని కోల్పోయినప్పటికీ, బీఆర్ఎస్ పార్టీ క్షేత్రస్థాయిలో గట్టి పోటీనిస్తోంది. పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనం. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ, అనేక మున్సిపాలిటీలు , వార్డుల్లో గులాబీ జెండా రెపరెపలాడింది. రాజకీయాల్లో అధికారం కోల్పోయిన వెంటనే చేతులెత్తేయకుండా, ఉనికిని చాటుకోవడంలో బీఆర్ఎస్ విజయవంతమైందని విశ్లేషకులు భావిస్తున్నారు.తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. సుమారు 730కి పైగా వార్డులను కైవసం చేసుకోవడమే కాకుండా, 15 మున్సిపాలిటీల్లో స్పష్టమైన మెజారిటీ సాధించి, మరో 30 చోట్ల అతిపెద్ద పార్టీగా ఆవిర్భవించింది. కేటీఆర్ , హరీష్ రావు వంటి నేతలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ క్యాడర్‌ను ఉత్తేజపరచడం పార్టీకి ప్లస్ పాయింట్ అయింది. అధికార పక్షం ప్రలోభాలను ఒత్తిళ్లను తట్టుకుని బీఆర్ఎస్ నిలబడటం చూస్తుంటే, ఆ పార్టీ ఇంకా తన పట్టును పూర్తిగా కోల్పోలేదని అర్థమవుతోంది.మరోవైపు ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి ఇందుకు భిన్నంగా కనిపిస్తోంది. వచ్చే నెలలో సర్పంచ్ , మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయన్న ప్రచారం ఉన్నప్పటికీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ఆ స్థాయి సన్నాహాలు కనిపించడం లేదు. గత అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత అనేక మంది కీలక నేతలు పార్టీని వీడటం , మౌనంగా ఉండిపోవడం జగన్ మోహన్ రెడ్డికి అతిపెద్ద సవాల్‌గా మారింది. ప్రభుత్వం అక్రమ కేసులు బనాయిస్తోందని, ఓట్ల తొలగింపు జరుగుతోందని ఆరోపిస్తున్న వైసీపీ నేతలు.. ఎన్నికలను బహిష్కరించాలనే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే కొన్ని ఎన్నికలను బహిష్కరించిన వైసీపీ, ఇప్పుడు స్థానిక పోరుకు కూడా దూరంగా ఉంటే అది ఆత్మహత్య సదృశమే అవుతుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు. ఈ విషయంలో వైసీపీ కూడా బీఆర్ఎస్ నుండి స్ఫూర్తి పొందాల్సిన అవసరం ఉంది. ఎన్నికల నుంచి తప్పుకోవడం వల్ల ప్రత్యర్థులకు ఏకగ్రీవ విజయాలను కట్టబెట్టినట్లవుతుంది. మిగిలి ఉన్న కేడర్ కూడా ఇతర పార్టీల వైపు చూసే అవకాశం ఉంది. ఏపీలో వైసీపీ నేతల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది. మాజీ మంత్రులు , ఎమ్మెల్యేలు స్థానిక ఎన్నికల బాధ్యతను తీసుకోవడానికి వెనుకంజ వేస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఎదురయ్యే ఇబ్బందులను ఎదుర్కోలేమనే భయం కొందరిలో ఉంటే, భవిష్యత్తుపై నమ్మకం లేక మరికొందరు మౌనంగా ఉన్నారు. ఇదే సమయంలో తెలంగాణలో బీఆర్ఎస్ నాయకత్వం తమ అభ్యర్థులకు అండగా నిలబడి, చట్టపరమైన , రాజకీయ పోరాటాలు చేస్తోంది. ఈ విధమైన ధైర్యం వైసీపీ అధినాయకత్వం ప్రదర్శించకపోతే, స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీ మరింత బలహీనపడే ప్రమాదం ఉందిప్రజాస్వామ్యంలో స్థానిక సంస్థల ఎన్నికలు పార్టీకి పునాదుల వంటివి. అక్కడ బలపడితేనే వచ్చే సార్వత్రిక ఎన్నికలకు దారులు సుగమం అవుతాయి. బీఆర్ఎస్ పార్టీ ఈ సత్యాన్ని గ్రహించి పోరాడుతోంది. వైసీపీ కూడా బహిష్కరణలు, ఆరోపణలకే పరిమితం కాకుండా, తమకున్న 40 శాతం ఓటు బ్యాంకును కాపాడుకోవాలంటే ఎన్నికల బరిలో నిలవక తప్పదన్న అంచనా

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# కొత్త రాజకీయ పార్టీ ఏర్పాటుకు శశికళ సన్నాహాలు

**హైదరాబాద్ పెన్ పవర్:** చెన్నై: తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి, అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు వీకే శశికళ కొత్త రాజకీయ పార్టీని ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు.తన ఆప్తమిత్రురాలి జయంతి రోజైన ఫిబ్రవరి 24న పార్టీ పేరు, జెండా, విధివిధానాలను ప్రకటించే అవకాశం ఉంది. ఈ మేరకు ఆమె తన రాజకీయ భవిష్యత్ కార్యాచరణపై దృష్టి సారించారు.2026 అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా శశికళ తన వ్యూహాలకు పదును పెడుతున్నారు. ఇందులో భాగంగా చెన్నైలోని తన నివాసంలో జిల్లా స్థాయి నేతలు, అనుచరులతో వరుసగా సమావేశమవుతున్నారు. ఈ నెల 18వ తేదీ వరకు ఈ చర్చలు కొనసాగనున్నాయి. ఎంజీఆర్, జయలలిత ఆశయాలకు అనుగుణంగా ప్రస్తుత అన్నాడీఎంకే నాయకత్వం పనిచేయడం లేదని, అందుకే ఎన్నికల బరిలో దిగి మన ఉనికిని చాటాలని మద్దతుదారులు శశికళపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.ఈ సమావేశాల్లో కొత్త పార్టీని స్థాపించడమా లేక తన సోదరుడు 2018లో రిజిస్టర్ చేసిన 'అన్నా ద్రావిడర్ కళగం' తరఫున అభ్యర్థులను నిలబెట్టడమా అనే అంశాలపై ప్రధానంగా చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా, దక్షిణ తమిళనాడులోని సుమారు 40 నియోజకవర్గాలపై దృష్టి సారించినట్లు ఊహాగానాలు వినిపి స్తున్నాయి.అయితే, అక్రమాస్తుల కేసులో శిక్ష పడటంతో శశికళ 2027 వరకు ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు అనర్హురాలు. అయినప్పటికీ, ఆమె ఒక రాజకీయ పార్టీకి



నాయకత్వం వహించడా నికి చట్టపరంగా ఎలాంటి అడ్డంకులు లేవు. సమావేశాలు ముగిసిన తర్వాత, జయలలిత జయంతికి ముందే శశికళ తన నిర్ణయాన్ని అధి కారికంగా ప్రకటించే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి.

# రైల్వే జనరల్ బోగీల్లోనూ ప్రతీ గంటకోసారి క్లీనింగ్




**హైదరాబాద్ పెన్ పవర్:** రైల్వే ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రైళ్లలో పరిశుభ్రత ప్రమాణాలను మెరుగుపరిచబోతున్నట్లు రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ శనివారం ఢిల్లీలోని రైల్ భవన్‌లో ప్రకటించారు.ఇకపై కేవలం రిజర్వ్‌డ్ బోగీలే కాకుండా సామాన్యులు ప్రయాణించే జనరల్ బోగీల్లోనూ ప్రతి గంటకోసారి శుభ్రం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ సరికొత్త సంస్కరణల ద్వారా ప్రయాణికులకు మరింత ఆహ్లాదకరమైన ప్రయాణ అనుభవాన్ని అందించడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమాన్ని తొలి విడతలో భాగంగా దేశవ్యాప్తంగా ఎంపిక చేసిన 80 రైళ్లలో ప్రారంభించనున్నారు. ఇందులో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని 5 ముఖ్యమైన రైళ్లు కూడా ఉండటం విశేషం. ఈ ప్రయోగాత్మక ప్రాజెక్టు విజయవంతమైన ఆరు నెలల తర్వాత మరో 80 రైళ్లకు.. ఆపై మూడేళ్ల కాలపరిమితిలో దేశంలోని అన్ని రైళ్లకు ఈ సదుపాయాన్ని విస్తరించాలని రైల్వే శాఖ ప్రణాళికలు సిద్ధం చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా ప్రతి రైలులో ఒక ప్రొఫెషనల్ క్లీనింగ్ టీమ్‌తో పాటు ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేస్తారు. అయితే వీరు బోగీలను క్లీన్ చేసిన తర్వాత ఫొటోలు తీసి వాటిని కంట్రోల్ రూమ్‌కు పంపుతారు. అక్కడ ఏఐ ఆధారిత సాఫ్ట్‌వేర్ ఆ ఫోటోలను విశ్లేషించి, పరిశుభ్రత నాణ్యతను రేటింగ్ చేస్తుంది. అయితే ఈ పనుల కోసం నియమించే సిబ్బందికి ప్రత్యేక శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు జారీ చేయనున్నారు. వీటిని పర్యవేక్షించే సూపర్‌వైజర్లకు కనీసం 12వ తరగతి లేదా ఐటీఐ (ఎంఎ) విద్యార్హత ఉండాలని నిబంధన విధించారు. అలాగే రైళ్లలో దిండ్లు, దుప్పట్లు సరఫరాతో పాటు చిన్నపాటి మరమ్మతులు వంటి పనులు అన్నింటినీ ఇకపై ఒకే కాంట్రాక్టర్‌కు అప్పగించనున్నారు.

## ఐరాస పాత్రికేయురాలు ఆల్బనేస్‌కు కళాకారుల మద్దతు




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆక్రమిత పాలస్తీనా ప్రాంతంలో ఐక్యరాజ్యసమితి పాత్రికేయురాలిగా పనిచేస్తున్న ఫ్రాన్సెస్కా ఆల్బనేస్‌కు వంద మందికి పైగా ప్రముఖ కళాకారులు మద్దతు తెలిపారు. ఉద్యోగ బాధ్యతల నుంచి వైదొలగాల్సిందిగా పలు ప్రపంచ దేశాలు ఆల్బనేస్‌పై ఒత్తిడి తెస్తున్నాయి. ఈ నేపథ్యంలో 'ఆర్టిస్ట్స్ ఫర్ పాలస్తీనా' గ్రూప్ పేరిట రాసిన లేఖపై కళాకారులు సంతకాలు చేశారు. మానవ హక్కులు? ముఖ్యంగా జీవించే హక్కు కోసం పాలస్తీనా ప్రజలు చేస్తున్న ఆందోళనకు బాసటగా నిలిచిన ఆల్బనేస్‌కు వారంతా పూర్తి మద్దతు తెలిపారు. 'బలప్రయోగం చట్టంగా ఉండకూడదని కోరుకునే వారు ఈ భూమిపై ప్రతి మూలలో ఉన్నారు. చట్టం అనే పదానికి నిజమైన అర్థమేమిటో ఎవరికి తెలుసు?' అని ఆ లేఖలో వారు ప్రశ్నించారు. లేఖపై సంతకాలు చేసిన వారిలో నటులు మార్క్ రుఫలో, జేవియర్ బార్డెమ్, నోబెల్ బహుమతి గ్రహీత, రచయిత అన్నే ఎర్నాక్స్, బ్రిటన్‌కు చెందిన సంగీత కళాకారుడు అన్నే లెనాక్స్? తదితర ప్రముఖులు ఉన్నారు. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణకాండను తీవ్రంగా విమర్శిస్తున్న వారిలో ఆల్బనేస్ ఒకరు. మానవాళికి ఉమ్మడి శత్రువు ఉన్నాడంటూ ఆమె గత వారం అల్ జజీరా వేదికపై వ్యాఖ్యానించారు. పాలస్తీనాలో మారణహోమానికి కారణమైన వ్యవస్థను ఉమ్మడి శత్రువుగా అభివర్ణించానని ఆమె ఆ తర్వాత వివరణ ఇచ్చారు. ఫ్రాన్స్, జర్మనీ సహా పలు యూరోపియన్ దేశాలు ఆల్బనేస్‌ను బాధ్యతల నుంచి తప్పించాలని కోరుతున్నాయి. అనేక పశ్చిమ దేశాలు ఆమెను లక్ష్యంగా చేసుకొని విమర్శలు చేస్తున్నాయి. ఇజ్రాయిల్‌ను విమర్శించడాన్ని అవి జీర్ణించుకోలేకపోతున్నాయి. పాలస్తీనాపై ఇజ్రాయిల్ యుద్ధాన్ని విమర్శించే వారిని నేరస్థులుగా చూస్తున్నారని, అదే సమయంలో మారణహోమానికి కుట్రలు పన్నిన వారిని వదిలేస్తున్నారని సినీ నిర్మాత, రచయిత ఫ్రంక్ భరత్ విమర్శించారు.

## ఆరురోజుల క్రితం అదృశ్యమైన భారతీయ విద్యార్థి మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆరు రోజుల క్రితం కనిపించకుండా పోయిన భారతీయ విద్యార్థి సాకేత్ శ్రీనివాసయ్య మృతదేహాన్ని గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. కాలిఫోర్నియా బర్కిలీ యూనివర్శిటీలో కెమికల్ అండ్ బయోమోలెక్యులర్ ఇంజనీరింగ్ చదువుతున్న కర్ణాటకకు చెందిన సాకేత్ ఫిబ్రవరి 9న అదృశ్యమయ్యాడు. అతని మృతదేహాన్ని గుర్తించినట్లు శాన్‌ఫ్రాన్సిస్కోలోని భారత రాయబార కార్యాలయం ధృవీకరించింది. వీలైనంత త్వరగా మృతదేహాన్ని భారత్‌కు పంపేందుకు ఏర్పాట్లు చేస్తామని ఒక ప్రకటనలో పేర్కొంది. విద్యార్థి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు పేర్కొంది. సాకేత్ చివరిసారిగా యూనివర్శిటీకి కిలోమీటరు దూరంలో కనిపించారని, అనంతరం అదృశ్యమయ్యాడని అన్నారు. లేక్ అంజా మరియు బర్కిలీ హిల్స్ తదితర ప్రాంతాల్లో, నగరవ్యాప్తంగా గాలింపు చేపట్టామని అన్నారు. అతని పాస్‌పోర్ట్, ల్యాప్‌టాప్ ఉన్న బ్యాగ్ క్యాంపస్ సమీపంలోని లిట్డెన్ రీజనల్ పార్క్ దగ్గర గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. అనంతరం మృతదేహం లభ్యమైందని అన్నారు.

## రష్యా చమురు కొనమని భారత్ హామీ ఇచ్చింది!

**హైదరాబాద్ పెన్ పవర్:** చమురు దిగుమతి విషయంలో జాతీయ ప్రయోజనాలే తొలి ప్రాధాన్యమని భారత్ పునరుద్ఘాటిస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయకూడదన్న విషయానికి కట్టుబడి ఉంటామని తెలిపిందన్నారు. జర్మనీలోని మ్యూనిక్‌లో జరిగిన భద్రతా సదస్సులో మాట్లాడిన ఆయన.. భారత్ గురించి మరోసారి ప్రస్తావించారు. వాణిజ్య ఒప్పందం గురించి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల మాట్లాడుతూ.. రష్యా నుంచి చమురు దిగుమతి చేసుకోకుండా ఉండేందుకు భారత్ అంగీకరించినట్లు ప్రకటించారు. ఆ తర్వాత అనేకసార్లు అగ్రరాజ్యం పలు సందర్భాల్లో ఇదే ప్రకటన చేసింది. ఈ క్రమంలోనే భారత్ నుంచి దిగుమతి చేసుకునే వస్తువులపై విధించిన 25శాతం అదనపు సుంకాలను వెనక్కి తీసుకునే ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను ఆయన జారీ చేశారు.

## కంటి చూపు కోల్పోతున్న ఇమ్రాన్




**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ మాజీ ప్రధాని, క్రికెట్ దిగ్గజం ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్యం విషయంలో పాక్ మాజీ క్రికెటర్లు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జైలులో అనారోగ్యంతో బాధపడుతున్న తమ 'కెప్టెన్'కు తక్షణమే అత్యుత్తమ వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాజకీయాలను పక్కనపెట్టి, ఒక జాతీయ హీరోగా ఇమ్రాన్‌కు దక్కాల్సిన గౌరవం, వైద్యం అందించాలని వసీం అక్రమ్, వకార్ యూనిస్, షోయబ్ అక్తర్ వంటి మాజీ స్టార్లు సోషల్ మీడియా వేదికగా గళమెత్తారు. అడియాలా జైలులో శిక్ష అనుభవిస్తున్న 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్ తన కుడి కంటిలో 85 శాతం చూపును కోల్పోయినట్లు తాజా నివేదికలు వెల్లడించాయి. రక్తం గడ్డకట్టడం వల్ల 'సెంట్రల్ రెటినల్ వీన్ ఆక్లూజన్' అనే తీవ్రమైన సమస్య తలెత్తినట్లు వైద్యులు నిర్ధారించారు. ప్రస్తుతం ఆయనకు కేవలం 15 శాతం దృష్టి మాత్రమే మిగిలి ఉందని తెలియడంతో ఆయన అభిమానులు, క్రీడాలోకంగ్ర్భాంతికి గురైంది.2023 సెప్టెంబర్ నుంచి ఇమ్రాన్ ఖాన్ జైలులో ఏకాంత నిర్బంధంలో ఉన్నారు. గత ఏడాది అక్టోబర్ నుంచే కంటి సమస్యలతో బాధపడుతున్నా, జైలు అధికారులు నిర్లక్ష్యం చేశారని ఆయన కుటుంబ సభ్యులు, న్యాయవాదులు ఆరోపిస్తున్నారు. ఈ విషయం పాకిస్థాన్ సుప్రీం కోర్టు దృష్టికి వెళ్లడంతో, కోర్టు ఆదేశాల మేరకు వైద్య పరీక్షలు నిర్వహించారు.ఈ వార్త తెలియగానే పాక్ క్రికెటర్లు స్పందించారు. "రాజకీయాలను పక్కన పెట్టి చూస్తే.. ఆయన మా జాతీయ హీరో. 1992 ప్రపంచ కప్ గెలిపించారు. క్యాన్సర్ హాస్పిటల్ కట్టించారు. అలాంటి వ్యక్తికి సరైన చికిత్స అందించాలి" అని వకార్ యూనిస్ భావోద్వేగంగా కోరారు.

# రష్యా చమురు దిగుమతులపై కేంద్రమంత్రి జైశంకర్ కీలక వ్యాఖ్యలు




**హైదరాబాద్ పెన్ పవర్:** భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందంలో భాగంగా రష్యా చమురు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. రష్యా నుంచి తక్కువ ధరకు చమురు దిగుమతి చేసుకోవడానికి భారత్ అంగీకరించిందని..అందుకే తాము భారత్‌పై విధించిన టారిఫ్‌లను తగ్గించినట్లు ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం ప్రపంచవ్యాప్తంగా పెను సంచలనం సృష్టించింది. అయితే భారత్ మాత్రం.. రష్యా చమురుపై ఎలాంటి క్లారిటీ ఇవ్వకపోవడంతో ఈ విషయంలో పెద్ద ప్రతిష్ఠంభన నెలకొంది. ఈ క్రమంలోనే ప్రస్తుతం జపాన్‌లోని మ్యూనిచ్ పర్యటనలో ఉన్న విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు ఇదే ప్రశ్న ఎదురైంది. 62వ మ్యూనిచ్ సెక్యూరిటీ కాన్ఫరెన్స్‌లో భాగంగా జర్మనీ విదేశాంగ మంత్రి జోహాన్ వాడెఫుల్‌తో విదేశాంగ మంత్రి జైశంకర్ సమావేశమయ్యారు. అయితే రష్యా నుంచి ఆయిల్ కొనుగోళ్లు తగ్గించాలని భారత్‌పై ఒత్తిడి వస్తోందా అని అడిగిన ప్రశ్నకు జైశంకర్ సమాధానం ఇచ్చారు. ప్రపంచ ఆయిల్ మార్కెట్ చాలా సంక్లిష్టంగా ఉంటుందని పేర్కొన్న జైశంకర్.. యూరప్ లేదా ప్రపంచంలోని ఇతర ప్రాంతాల్లో అందుబాటులో ఉన్న చమురు సంస్థలు, ఖర్చు, నష్టాలను అంచనా వేసి భారత్ కొనుగోళ్లు చేస్తుందని వెల్లడించారు. తమకు ఏది లాభమో చూసుకుని.. వాటి ఆధారంగానే నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. సొంతంగా నిర్ణయాలను తీసుకునే అధికారాన్ని భారత్ ఎప్పుడూ కలిగి ఉంటుందని తేల్చి చెప్పిన జైశంకర్.. ఇది భారతదేశ చరిత్రలో ఒక భాగమని, అదే భారత విధానమని స్పష్టం చేశారు. పశ్చిమ దేశాల ఆలోచనలు, విధానాలతో తాము ఏకీభవించాల్సిన అవసరం లేదని జైశంకర్ వెల్లడించారు. ఆయిల్ కొనుగోళ్లలో రాజకీయ ఒత్తిళ్లు పనిచేయవని తేల్చి చెప్పారు. అది పూర్తిగా దేశ ప్రయోజనాలపై ఆధారపడి ఉంటుందని తెలిపారు. మరోవైపు.. ఇటీవలె భారత్ అమెరికా తాత్కాలిక వాణిజ్య ఒప్పందం కుదిరింది. ఈ క్రమంలోనే భారత దిగుమతులపై టారిఫ్‌లను 50 శాతం నుంచి 18 శాతానికి తగ్గిస్తున్నట్లు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఇందులో భాగంగానే రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడాన్ని భారత్ నిలిపివేసేందుకు రెడీగా ఉందని పేర్కొన్నారు. కానీ దీనిపై భారత్ మాత్రం ఇంకా స్పందించలేదు. ఈ నేపథ్యంలోనే జైశంకర్ తాజాగా చేసిన వ్యాఖ్యలతో రష్యా చమురుపై అమెరికాకు ఒక క్లారిటీ ఇచ్చినట్లయింది.

## పత్తి రైతులకు అందుబాటులోకి రానున్న కొత్త హార్వెస్టింగ్ మెషిన్



**హైదరాబాద్ పెన్ పవర్:** పత్తి రైతుల ఏళ్లనాటి కష్టాలకు చెక్ పెట్టే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. కూలీల కొరత, అధిక ఖర్చులతో సతమతమవుతున్న రైతులకు ఉపశమనం కలిగించేలా దేశీయంగా అభివృద్ధి చేసిన 'కపాస్ హార్వెస్టింగ్ మెషిన్'ను కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ రైతులకు అంకితం చేశారు. భోపాల్‌లోని ఐకార్-సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ శాస్త్రవేత్తలు ఈ యంత్రాన్ని రూపొందించారు.ఇప్పటివరకు కూలీలతో చేతితో చేసే పత్తి తీత ప్రక్రియ ఈ యంత్రం ద్వారా పూర్తిగా ఆటోమేటిక్ అవుతుంది. దీనివల్ల కూలీల ఖర్చు, సమయం గణనీయంగా ఆదా అవుతుందని, పత్తి సాగు మరింత లాభదాయకంగా మారుతుందని మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా యంత్రం పనితీరును ఆయన స్వయంగా పరిశీలించారు. ఈ మెషిన్ త్వరలోనే రైతులకు అందుబాటులోకి వస్తుందని హామీ ఇచ్చారు.పత్తిలో ఉత్పాదకతను పెంచేందుకు అధిక దిగుబడినిచ్చే, రోగనిరోధక శక్తి కలిగిన కొత్త వంగడాలను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. అలాగే, ఎకరానికి ఎక్కువ మొక్కలు నాటే విధానాలపై కూడా పరిశోధనలు జరుగుతున్నాయని వివరించారు. భోపాల్‌లోని అఎంఇ 51వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకల సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. భారత వ్యవసాయ రంగ యాంత్రీకరణలో ఇది ఒక కీలకమైన ముందడుగుగా నిపుణులు భావిస్తున్నారు.

# ఉద్యోగి అంటే కట్టుబానిస కాదు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఉద్యోగుల హక్కుల విషయంలో కేరళ హైకోర్టు ఒక చారిత్రాత్మక తీర్పును వెలువరించింది. ఒక వ్యక్తి తన వ్యక్తిగత లేదా ఇతర కారణాల వల్ల ఉద్యోగానికి రాజీనామా చేసినప్పుడు. ఆ లేఖను ఆమోదించకుండా అడ్డుకునే హక్కు యాజమాన్యాలకు లేదని కోర్టు స్పష్టం చేసింది. రాజీనామాను ఆమోదించకపోవడం అంటే ఆ ఉద్యోగిని ఒక కట్టు బానిసలా చూడటమేనని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ తీర్పు కార్పొరేట్‌తో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో పని చేస్తున్న లక్షలాది మంది ఉద్యోగులకు పెద్ద ఊరటనిచ్చే అంశంగా నిలుస్తోంది.. న్యాయమూర్తి తన తీర్పులో భారత రాజ్యాంగంలోని 23వ అధికరణాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. దేశంలో వెట్టిబానిసత్వాన్ని లేదా బలవంతపు చాకిరీని రాజ్యాంగం పూర్తిగా నిషేధించిందని గుర్తు చేశారు. ఒక ఉద్యోగి తన ఇష్ట పూర్వకంగా సంస్థ నుంచి వెళ్లిపోవాలని నిర్ణయించుకున్నప్పుడు.. ఒప్పందంలో బలమైన చట్టపరమైన షరతులు ఉంటే తప్ప, వారిని బలవంతంగా కొనసాగించడం రాజ్యాంగ విరుద్ధమని కోర్టు ఉద్ఘాటించింది. ఈ కేసులో పిటిషనర్ ఒక ప్రభుత్వ రంగ సంస్థలో సెక్రటరీగా పని చేస్తున్నారు. 2020లో ఆయన తండ్రి మరణించగా.. అప్పటి నుంచి ఆయన తల్లి తీవ్రమైన మానసిక, నాడీ సంబంధిత వ్యాధులతో బాధ పడుతున్నారు. అయితే తల్లిని కంటికి రెప్పలా చూసుకోవాల్సిన బాధ్యత తనపై ఉన్నందున.. తాను చేస్తున్న ఉద్యోగానికి రాజీనామా చేసి, ఇంటికి దగ్గరగా ఉండే మరో పనిని వెతుక్కోవాలని సదరు పిటిషనర్ నిర్ణయించుకున్నారు.ఈక్రమంలనే ఆయన వెంటనే రాజీనామా పత్రాన్ని కూడా కంపెనీకి సమర్పించారు. అయితే సదరు యాజమాన్యం ఆర్థిక కారణాలు, పని ఒత్తిడిని సాకుగా చూపుతూ ఆయన రాజీనామాను తిరస్కరించింది. అంతేకాకుండా 2022 అక్టోబర్ నుంచి ఆయనకు జీతం చెల్లించడం కూడా నిలిపివేసింది. రాజీనామా ఆమోదం పొందితేనే ఆయన మరొక సంస్థలో చేరే అవకాశం ఉండటంతో.. పిటిషనర్ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొని చివరకు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషనర్ వాదనలను విన్న హైకోర్టు.. సదరు సంస్థపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పిటిషనర్ రాజీనామాను వెంటనే ఆమోదించాలని ఆదేశించింది. నిలిపివేసిన జీతం బకాయిలు, గ్రాట్యుటీ, పీఎఫ్ వంటి అన్ని ప్రయోజనాలను లెక్కగట్టి, రెండు నెలల వ్యవధిలోపు అతడికి చెల్లించాలని స్పష్టం చేసింది. ఉద్యోగ నియామక ఒప్పందంలో నిష్క్రమణకు సంబంధించి ఎలాంటి తీవ్రమైన చట్టపరమైన అడ్డంకులు లేనప్పుడు.. యాజమాన్యం మొండిగా వ్యవహరించకూడదని హితవు పలికింది.

# మళ్లీ తగ్గిన బంగారం ధర



బంగారం, వెండి ధరల్లో హెచ్చుతగ్గులు క్రమంగా కొనసాగుతున్నాయి. కొద్దిరోజులుగా వెండి రేట్లలో కొత్తట్రెండ్ కనిపిస్తోంది. ప్రతి మూడురోజులకు ఒకసారి వెండి ధరలు మారుతున్నాయి. ఫిబ్రవరి 13న రూ.20,000తగ్గిన కిలో వెండి ధర రూ.2,80,000 వద్ద స్థిరపడింది. నేడు కూడా ఇదే ధర కొనసాగుతోంది. బంగారం విషయానికొస్తే.. నేడు ధరలు స్వల్పంగా తగ్గాయి. 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1310 తగ్గి రూ.1,56,440వద్ద కొనసాగుతోంది. అలాగే 22 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1200 తగ్గి రూ.1,43,400గా ఉంది. ఎల్లుండి నుంచి తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా పెళ్లిళ్లు, శుభకార్యాలు ప్రారంభం కానున్న క్రమంలో బంగారం ధరలు తగ్గడం కొనుగోలు దారులకు కాస్త ఊరటనిచ్చిందని చెప్పాలి. ఇదిలా ఉండగా.. 2027 చివరినాటికి 10 గ్రాముల మేలిమి బంగారం ధర రూ.90,000 నుంచి లక్షరూపాయల మధ్యలో స్థిరపడుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం రష్యా - అమెరికా మధ్య డాలర్ డీల్ జరుగుతుందన్న వార్తలు రావడమే. రష్యా.. అమెరికా డాలర్లలో వ్యాపారానికి డీల్ చేసుకుంటే బంగారం ధర గరిష్ఠంగా తగ్గుతుందని చెప్తున్నారు. గత నెలలో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1.84 లక్షలు తాకినా.. ప్రస్తుతం రూ.1.56 లక్షల వద్ద కొనసాగుతోంది. బంగారంపై పెట్టుబడులు పెరగడంతోనే దాని ధర అమాంతం పెరిగిపోయింది.

# దేశీయంగా మొట్టమొదటి స్టోర్ ప్రారంభించిన నథింగ్ ఇండియా




ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్లు, టెక్ గ్యాడ్జెట్‌లకు భారత మార్కెట్ అత్యంత అనువైన కేంద్రంగా మారుతోంది. ఇప్పటికే భారత్ మార్కెట్లో రిటైల్ స్టోర్ల ఏర్పాటుతో ఎంట్రీ ఇచ్చిన యాపిల్ రికార్డు స్థాయిలో అమ్మకాలను సాధిస్తోంది. ఈ క్రమంలో మరో గ్లోబల్ కంపెనీ, బ్రిటీష్ బ్రాండ్ నథింగ్ దేశీయంగా తన మొట్టమొదటి ఫ్లాగ్‌షిప్ రిటైల్ స్టోర్‌ను ఏర్పాటు చేసింది. బెంగళూరులో ఏర్పాటు చేసిన ఈ స్టోర్ ప్రారంభానికి నథింగ్ సీఈఓ కార్ల్ పీ, కో-ఫౌండర్, నథింగ్ ఇండియా ప్రెసిడెంట్ అకిల్ ఎవాంజెలిడిస్ హాజరయ్యారు. ఈ ఫ్లాగ్‌షిప్ స్టోర్ ద్వారా కంపెనీ భారత మార్కెట్లో తన బ్రాండ్ కింద ఉన్న స్మార్ట్‌ఫోన్, దుస్తులు సహా ఇతర ఉత్పత్తులను విక్రయించనుంది. దేశీయంగా కంపెనీ విస్తరణకు ఈ స్టోర్ కీలక మైలురాయిగా నిలుస్తుందని కంపెనీ అభిప్రాయపడింది. ఇప్పటికే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న తమ బ్రాండ్‌కు స్థానిక కమ్యూనిటీ సంబంధాలు మరింత బలపడేందుకు ఈ స్టోర్ సహకారం అందిస్తుందని అభిప్రాయపడింది. బెంగళూరులోని ఇందిరానగర్‌లో ఉన్న ఈ స్టోర్ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ప్రజలు అందుబాటులో ఉంటుందని నథింగ్ ఇండియా స్పష్టం చేసింది. ఇప్పటివరకు నథింగ్ కంపెనీ లండన్‌లో మాత్రమే స్టోర్‌ను నిర్వహిస్తోంది. దీని తర్వాత భారత్‌లో మాత్రమే రెండో స్టోర్‌ను ఏర్పాటు చేయడం గమనార్హం. ఈ స్టోర్‌లో నథింగ్ స్మార్ట్‌ఫోన్‌లతో పాటు స్మార్ట్‌వాచ్‌లు, ట్రూ వైర్‌లెస్ ఇయర్‌బడ్స్, ఇతర స్మార్ట్ పరికరాలను కస్టమర్లు స్వయంగా సందర్శించి కొనుగోలు చేయవచ్చని కంపెనీ వెల్లడించింది.

# సగానికి పైగా ఈవీ మార్కెట్ వాటా మూడు కంపెనీలదే



దేశీయ ఎలక్ట్రిక్ వాహనాల(ఈవీ) రంగంలో దేశీయ టీవీఎస్ మోటార్, బజాజ్ ఆటో, హీరో మోటోకార్ప్ వంటి సాంప్రదాయ దిగ్గజ కంపెనీలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఈ కంపెనీలు దేశంలోని ఎలక్ట్రిక్ స్కూటర్, బైక్ మార్కెట్‌లో 60 శాతం వాటాను కలిగి ఉన్నాయి. వీటి ముందు కొత్త స్టార్టప్ కంపెనీలు ఈ మాత్రం సత్తా చాటడంలేదు. ఈవీ రంగం ప్రారంభ దశలో ఉన్నప్పుడు చిన్న స్టార్టప్ బ్రాండ్‌లు ఎలక్ట్రిక్ వాహన మార్కెట్లో ముందంజలో ఉన్నాయి. కానీ గతేడాది కంపెనీలన్నీ ఈవీ విభాగంలో కొత్త బైక్, స్కూటర్లను తీసుకురావడం, కస్టమర్ల నుంచి నమ్మకాన్ని పొందడంతో ఈ ఏడాది పెద్ద ఎత్తున అమ్మకాలను సాధించాయి. 2023లో టీవీఎస్, బజాజ్, హీరో కంపెనీల వాటా కేవలం 34 శాతం మాత్రమే ఉండేది. ఆ సమయంలో ఓలా, ఏథర్ లాంటి కంపెనీలు అగ్రస్థానంలో ఉన్నాయి. అయితే, ఆలస్యంగా ఈవీ విభాగంలోకి వచ్చినప్పటికీ ఈ మూడు కంపెనీలు తమ పెట్టుబడుల సామర్థ్యం, నెట్‌వర్క్, తొందరగా కొత్త మోడల్స్‌ను తీసుకురావడం ద్వారా తక్కువ సమయంలోనే మార్కెట్ వాటాను సొంతం చేసుకున్నాయి. అధికారిక వివరాల ప్రకారం, ఈ ఏడాది జనవరి నాటికి టీవీఎస్ 28 శాతం, బజాజ్ ఆటో 21 శాతం, ఏథర్ 18 శాతం, హీరో మోటోకార్ప్ 11 శాతం వాటాను కలిగి ఉన్నాయి. ఈవీలు కొత్తగా వచ్చిన సమయంలో 35 శాతానికి పైగా వాటా ఉన్న ఓలా ప్రస్తుతం 6 శాతానికి పడిపోయింది.

# అందరూ వాట్సాప్ స్పామ్ బాధితులే




వాట్సాప్‌లో స్పామ్ మెసేజ్‌లు, కాల్స్ బెడద ఎక్కువైపోయాయి. దీనిపై చాలామంది నుంచి ఫిర్యాదులు కూడా వెల్లువెత్తాయి. ముఖ్యంగా అంతర్జాతీయ నెంబర్లతో వచ్చే కాల్స్ మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ఇలాంటి స్పామ్ మేసేజ్‌లు, కాల్స్‌ను ఆసరాగా తీసుకుని సైబర్ మోసగాళ్లు కూడా రకరకాల స్కామ్‌లతో సామాన్యులను బురిడీ కొట్టిస్తున్నారు. పెరుగుతున్న డిజిటల్ వినియోగానికి తగినట్టుగా ఈ స్పామ్ కాల్స్, మేసేజ్‌లు పట్టణాలకే పరిమితం కాలేదు, గ్రామీణ ప్రాంతాలకూ విస్తరించింది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా ప్రతి వాట్సాప్ యూజర్ ప్రతిరోజూ ఏదొక స్పామ్, ప్రమోషనల్ వాట్సాప్ మెసేజ్‌లను ఎదుర్కొంటున్నారు. ప్రముఖ లోకల్ సర్కిల్స్ నిర్వహించిన తాజా సర్వేలో మరిన్ని వివరాలు బహిర్గతం అయ్యాయి. దాదాపు 96 శాతం వాట్సాప్ యూజర్లు ప్రతిరోజూ ఈ స్పామ్ మెసేజ్, కాల్స్ వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనివల్ల కస్టమర్ల ప్రైవసీ, డేటా దుర్వినియోగం, స్పామ్‌ల తనిఖీలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. వాట్సాప్‌లో ప్రతిరోజూ రకరకాల ప్రమోషనల్, స్పామ్ మెసేజ్‌లు వస్తున్నాయని యూజర్లు చెబుతున్నారు. దేశవ్యాప్తంగా 324 జిల్లాల్లోని వాట్సాప్ యూజర్ల నుంచి లోకల్ సర్కిల్స్ వివరాలను సేకరించగా, కేవలం 4 శాతం మంది మాత్రమే తమకు అటువంటి మెసేజ్‌లు రావట్లేదన్నారు. సగం మందికి(54 శాతం) పైగా యూజర్లు రోజుకు మూడు సార్లు స్పామ్ మెసేజ్‌లు వస్తున్నాయని, 30 శాతం మంది 4-7 స్పామ్ మెసేజ్‌లను, 11 శాతం మంది 8, అంతకంటే ఎక్కువ మెసేజ్‌లు వస్తున్నాయని చెప్పారు. ఈ మెసేజ్‌లలో ఎక్కువగా బిజినెస్ అకౌంట్ల నుంచి వస్తున్నాయని, స్పామ్ మెసేజ్‌లు పంపేవారు వాట్సాప్ ప్లాట్‌ఫామ్‌కు డబ్బు చెల్లిస్తున్నారని యూజర్లు తెలిపారు. ప్రస్తుతం వస్తున్న స్పామ్‌లు మూడేళ్ల నాటితో పోలిస్తే గణనీయంగా పెరిగాయని లోకల్ సర్కిల్స్ నివేదిక అభిప్రాయపడింది. గత 36 నెలల్లో స్పామ్‌ల సమస్య మరింత తీవ్రమైందని డేటా చెబుతోంది. రోజుకు ఒకటి నుంచి మూడు స్పామ్ మెసేజ్‌లను ఎదుర్కొనే యూజర్ల సంఖ్య తగ్గినప్పటికీ, 4-7 మెసేజ్‌లు,

8 లేదా అంతకంటే ఎక్కువ స్పామ్ మెసేజ్‌లను చూసే యూజర్ల సంఖ్య బాగా పెరిగింది. ప్రతిరోజూ 8 లేదా అంతకంటే ఎక్కువ స్పామ్ మెసేజ్‌లు చూసే వారు 2023లో 11 శాతం ఉండగా, ఇప్పుడు 19 శాతానికి పెరిగారు.

# రూపాయికి ముడి చమురు సెగ!



అమెరికా ఒత్తిడితో రష్యాయేతర చమురు కొనుగోళ్లకు భారత్ మొగ్గు చూపడం ద్వారా రూపాయి మరింత బలహీనపడనుందని ఫిచ్ రేటింగ్స్ అంచనా వేసింది. ఖరీదైన రష్యాయేతర ముడి చమురు కొనుగోలు కారణంగా 2026 నాటికి డాలర్‌తో రూపాయి విలువ 93కి పడిపోవచ్చని విశ్లేషించింది. గతేడాది కాలంలో డాలర్‌తో రూపాయి 5 శాతం పతనమై 92 మార్క్‌ను దాటిన విషయం తెలిసిందే. "గతేడాది డాలర్‌తో పోలిస్తే 5 శాతం క్షీణించిన రూపాయి ఇటీవల యుఎస్- ఇండియా వాణిజ్య ఒప్పందం వల్ల ప్రస్తుతం రూ.90.4 వద్ద నమోదవుతోంది. మేము గతంలో డాలర్‌తో రూపాయి విలువ 95కి చేరుతుందని అంచనా వేయగా.. ఇప్పుడు 2026 చివరి నాటికి రూపాయి మరింత నెమ్మదిగా క్షీణించి సుమారు 93 వద్ద ట్రేడ్ కావొచ్చుని భావిస్తు న్నాము. మార్కెట్ల నుంచి ఎఫ్ఐఐలు తరలిపోవడం, వాణిజ్య ఒప్పందం ప్రకారం ఖరీదైన రష్యాయేతర ముడి చమురు వైపు మళ్లడం ఈ క్షీణతకు కారణ మవుతాయి." అని ఫిచ్ తన నివేదికలో పేర్కొంది. అమెరికా వడ్డీ రేట్ల తగ్గింపు ఆసియా కరెన్సీలకు మద్దతునిస్తుందని.. అయితే దేశీయ స్థిరత్వం కీలక పాత్ర పోషిస్తుందని ఫిచ్ తెలిపింది. 'బలహీనమైన యుఎస్ డాలర్ నేపథ్యం ఎంపిక చేసిన కరెన్సీలకు మద్దతు ఇస్తుంది.. కానీ లాభాలు అసమానంగా ఉంటాయి. బలమైన కరెంట్ ఖాతాలు, ఆర్థిక లోటు, వాణిజ్య క్షీణత లేదా జోక్యం ఎక్కువగా ఉండే దేశాల కరెన్సీలు తమ విలువను నిలబెట్టుకోవడంలో ఇబ్బంది పడతాయి." అని ఫిచ్ తెలిపింది.

# ఈ ఏడాది పీఎస్‌బీల లాభాలు రూ. 2 లక్షల కోట్లకు పైనే




ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వ రంగ బ్యాంకులు(పీఎస్‌బీ) రూ. 2 లక్షల కోట్లకు పైగా రికార్డు లాభాలను సాధిస్తాయని ఆర్థిక సేవల కార్యదర్శి ఎం నాగరాజు విశ్వాసం వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ రంగ ఆర్థికంగా బలపడుతోందని, స్థిరమైన లాభాలను చూస్తున్నాయని ఆయన తెలిపారు. పీటీఐతో జరిగిన ఇంటర్వ్యూలో మాట్లాడిన ఆయన.. బ్యాంకులు ఎక్కువ రుణాలు ఇస్తున్నాయి, డిపాజిట్లు అంతే స్థాయిలో పెరుగుతున్నాయి. ఇది మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ సామర్థ్యం బలంగా ఉండటాన్ని సూచిస్తుంది. ఈ ఏడాది పీఎస్‌బీలో క్రెడిట్ వృద్ధి దాదాపు 12 శాతం వద్ద ఉంది. ఇదే సమయంలో డిపాజిట్ల వృద్ధి దాదాపు 10 శాతం ఉందని నాగరాజు వివరించారు. ఈ నేపథ్యంలో పీఎస్‌బీలు చారిత్రాత్మక లాభాలను చూడనున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలోనే దాదాపు రూ. లక్ష కోట్లను చేరుకున్నాయి. మిగిలిన సగంలో రూ. 2 లక్షల కోట్లను దాటడం సులభమేనని ఆయన అభిప్రాయపడ్డారు. గత మూడేళ్లలో బ్యాంకింగ్ రంగం ఆదాయం భారీగా పెరిగింది. 2022-23లో పీఎస్‌బీలు రూ. లక్షల కోట్లకు పైగా లాభాలను చూశాయి. 2023-24లో రూ. 1.41 లక్షల కోట్లను, 2024-25లో రూ. 1.78 లక్షల కోట్ల లాభాలను నమోదు చేశాయని ఎం నాగరాజు పేర్కొన్నారు.

## ఏఐ లీడర్‌గా ఉండేందుకు భారత్‌కు అన్ని అర్హతలు ఉన్నాయి



పూర్తిస్థాయిలో ఏఐ లీడర్‌గా ఉండేందుకు భారత్‌కు అన్ని అర్హతలు ఉన్నాయని ఓపెన్ఏఐ సీఈఓ శామ్ ఆల్ట్‌మన్ అన్నారు. మనదేశంలో గ్లోబల్ ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్ జరగానికి కొన్ని గంటల ముందు శామ్ ఆల్ట్‌మన్ ఈ వ్యాఖ్యలు చేయడం విశేషం. భారత్‌కు ఉన్నటెక్నాలజీ ప్రతిభ, జాతీయ వ్యూహం, టెక్నాలజీ సామర్థ్యంపై నమ్మకం ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యం దేశమైన భారత్ స్వదేశీ నైపుణ్యం ద్వారా ఏఐలో సరైన స్థాయిలో అమలు చేసేందుకు విధానపరమైన ప్రోత్సాహం కలిగి ఉంది. ముఖ్యంగా భారత ప్రభుత్వం ఇండియాఏఐ మిషన్ లక్షలాది మందికి అవసరమైన సాధనంగా మారుతోంది. కంప్యూటర్ సామర్థ్యాన్ని విస్తరించేందుకు, స్టార్టప్‌లకు మద్దతిచ్చేందుకు, హెల్త్‌కేర్, వ్యవసాయం, పబ్లిక్ సర్వీసెస్‌లో యాప్‌లను రూపొందించడంలో విజయవంతమైందని శామ్ ఆల్ట్‌మన్ వివరించారు. ఏఐ టూల్స్‌ను వేగంగా ఉపయోగించడంలో 10 కోట్లకు పైగా యాక్టివ్ యూజర్లతో అమెరికా తర్వాత రెండో స్థానంలో ఉంది. ఈ క్రమంలో భారత్ పూర్తిస్థాయి ఏఐ లీడర్‌గా ఉండటానికి అన్ని అర్హతలను కలిగి ఉంది. ఏఐ ప్రయోజనాలను విస్తరించేందుకు యాక్సెస్, అడాప్షన్, ఏజెన్సీపై పురోగతి అవసరమని శామ్ ఆల్ట్‌మన్ వెల్లడించారు.

# 17న బంగ్లాదేశ్ ప్రధానిగా తారిఖ్ ప్రమాణ స్వీకారం



పొరుగుదేశం బంగ్లాదేశ్ నూతన ప్రధానిగా తారిఖ్ రెహమాన్ ఈనెల 17న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని బంగ్లాదేశ్ పార్లమెంటు హౌస్‌లోని సదరన్ ప్లాజాలో నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనాలని యూనస్ నేతృత్వంలోని తాత్కాలిక ప్రభుత్వం భారత్, చైనా, సౌదీ అరేబియా, పాకిస్తాన్, టర్కీ, ఖతార్, శ్రీలంక, నేపాల్ సహా 13 దేశాలకు ఆహ్వానం పంపింది. ఈ కార్యక్రమంలో పాల్గొనాల్సిందిగా భారత ప్రధాని మోడీకి ఆహ్వానం అందినట్టు వెల్లడించింది. ఫ్రాన్స్ అధ్యక్షుడు మ్యాక్రాన్ భారత పర్యటకు వస్తుండడంతో మోడీ ఢాకాకు వెళ్లే అవకాశం లేదని భారత అధికారులు వివరించారు. అందువల్ల భారత్ తరఫున లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా హాజరుకానున్నారు. భారత విదేశాంగశాఖ ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. బంగ్లాదేశ్‌లో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తారిఖ్ రెహమాన్ నేతృత్వంలోని బిఎన్‌పి విజయం సాధించిన విషయం తెలిసిందే.

# నానబెట్టిన శనగలు తింటే.. శరీరంలో జరిగేది ఇదే..!

శనగలు ఆరోగ్యానికి చాలా మంచివి. ఈ విషయం చాలా మందికి తెలియదు. అందుకే వీటిని కేవలం గుడిలో ప్రసాదం, ఉడికించి తినే గుగ్గిలుగా చూసేవారు చాలా మంది ఉంటారు. కానీ, శనగలను ఒకరోజంతా నీళ్లలో నానబెట్టి తినడం వల్ల లెక్కలేనన్నీ ఎక్కువ లాభాలు కలుగుతాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. నానబెట్టిన నల్ల శనగల్లో యాంటీఆక్సిడెంట్లు, ఫైటోన్యూట్రియెంట్లు పుష్కలంగా ఉంటాయి. రక్తం గడ్డకట్టకుండా నిరోధించే ముఖ్యమైన ఖనిజాలు కూడా వాటిలో ఉంటాయి. శనగల్లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి మిమ్మల్ని ఎక్కువ కాలం కడుపు నిండి ఉంచుతాయి, అనారోగ్యకరమైన చిరుతిళ్లను నివారించడంలో మీకు సహాయపడతాయి. నానబెట్టిన నల్ల శనగల్లో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. అవి జీర్ణవ్యవస్థకు కూడా సహాయపడతాయి. అవి శరీరం నుండి హానికరమైన టాక్సిన్స్ ని తొలగించి జీర్ణవ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతాయి. నానబెట్టిన నల్ల శనగపప్పు తినడం వల్ల ఏవైనా చర్మ సమస్యలు రాకుండా ఉంటాయి. ఇది మీ చర్మానికి సహజమైన మెరుపును ఇస్తుంది. నానబెట్టిన

నల్ల శనగల్లో యాంటీఆక్సిడెంట్లు, ఫైటోన్యూట్రియెంట్లు పుష్కలంగా ఉంటాయి. రక్తం గడ్డకట్టకుండా నిరోధించే ముఖ్యమైన ఖనిజాలు కూడా వాటిలో ఉంటాయి. శనగల్లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి మిమ్మల్ని ఎక్కువ కాలం కడుపు నిండి ఉంచుతాయి, అనారోగ్యకరమైన చిరుతిళ్లను నివారించడంలో మీకు సహాయపడతాయి. నల్ల శనగల్లో కరిగే ఫైబర్ ఉంటుంది. ఫైబర్ పుష్కలంగా ఉండటం వల్ల, అవి బరువు తగ్గడంలో, కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో,



రక్తంలో చక్కెర స్థాయిలను సమతుల్యం చేయడంలో సహాయపడతాయి. నల్ల శనగలు మీ జుట్టు ఆరోగ్యానికి అవసరమయ్యే ముఖ్యమైన విటమిన్లు, పోషకాలు కలిగి ఉంటాయి. నానబెట్టిన నల్ల శనగలను క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల తెల్ల జుట్టు సమస్య రాకుండా ఉంటుంది. నల్ల శనగలు మన రక్తంలోకి చక్కెర శోషణను నియంత్రిస్తాయి. నల్ల శనగపప్పులోని కార్బోహైడ్రేట్లు రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించి టైప్-2 డయాబెటిస్ ప్రమాదాన్ని తగ్గిస్తాయి.

# నల్ల పసుపును ఎప్పుడైనా తిన్నారా?



ప్రతి వంటగదిలో ఉపయోగించే పసుపు ఆహారం రంగును మార్చడమే కాకుండా, శరీరానికి చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. దీనిలో ఉన్న యాంటీమైక్రోబయల్, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు చర్మం నుండి గుండె వరకు ప్రతిదీ ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. మీరు ఎప్పుడైనా నల్ల పసుపు గురించి విన్నారా? ప్రతి వంటగదిలో ఉపయోగించే పసుపు ఆహారం రంగును మార్చడమే కాకుండా, శరీరానికి చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. దీనిలో ఉన్న యాంటీమైక్రోబయల్, యాంటీఆక్సిడెంట్ లక్షణాలు చర్మం నుండి గుండె వరకు ప్రతిదీ ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. నల్ల పసుపు, కుర్కుమా కాసియా లేదా నల్ల పసుపు అని కూడా పిలుస్తారు. ఇది ఔషధ గుణాలతో కూడిన మొక్క. దీని లోపలి రంగు ముదురు నీలం లేదా నలుపు. దీనిని సుగంధ ద్రవ్యంగా ఉపయోగించరు. కానీ, వివిధ వ్యాధుల ఉపశమనం కోసం ఉపయోగిస్తారు. దీని వాసన పసుపు పసుపు కంటే బలంగా ఉంటుంది. దాని రుచి కొద్దిగా చేదుగా ఉంటుంది. అందుకే దీనిని వంటలో ఉపయోగించరు. పసుపులో కర్కుమిన్ ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీ ఇన్ఫ్లమేటరీ, యాంటీఆక్సిడెంట్ లక్షణాలతో సమృద్ధిగా ఉంటుంది. అయితే, నల్ల పసుపులో కర్కుమిన్ పరిమాణం చాలా తక్కువగా ఉంటుంది. కానీ ముఖ్యమైన నూనెలు, కర్పూరం, ఫినోలిక్ సమ్మేళనాలు వంటి అంశాలు ఇందులో కనిపిస్తాయి. ఇవి గృహ నివారణలలో చాలా సహాయకారిగా ఉంటాయి. యాంటీమైక్రోబయల్ లక్షణాలు: నల్ల పసుపులో ఉండే యాంటీమైక్రోబయల్ లక్షణాలు శరీరం ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి, గాయాలను నయం చేయడానికి సహాయపడతాయి. వాపు నుండి ఉపశమనం: కీళ్ల నొప్పులు, కండరాల ఒత్తిడితో బాధపడేవారికి, దీని ఉపయోగం చాలా ప్రయోజనకరంగా పరిగణించబడుతుంది. ఎందుకంటే దీనిలో ఉన్న అంశాలు మంటను తగ్గించడంలో సహాయపడతాయి. రోగనిరోధక శక్తిని పెంచుతుంది: శరీర రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంలో నీలం పసుపు కూడా చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

# కివీ రోజుకు ఒక్కటి తింటే.. ఆసుపత్రిని మర్చిపోండి!



ప్రతిరోజూ పండ్లు, కూరగాయలు తినడం వల్ల మీ ఆరోగ్యం మెరుగుపడుతుందని వైద్యులు చెప్పడం మీరు తరచుగా వినే ఉంటారు. ఈ రకమైన ఆహారం తీసుకోవడం వల్ల దీర్ఘకాలిక వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. కొలెస్ట్రాల్ సమస్యలు మెరుగుపడతాయి. ఆరోగ్యకరమైన పండ్లలో కివీ కూడా ఒకటి. ఈ పండు రోజుకు ఒక్కటి తింటే చాలు.. డాక్టర్‌కి గుడ్ బై చెప్పొచ్చు అంటున్నారు ఆరోగ్య నిపుణులు. కివి పండు చాలా మందికి నచ్చకపోయినా, ఇది పోషకాలతో నిండి ఉంటుంది. చూసేందుకు చిన్నగా ఉన్నప్పటికీ, ఇందులో విటమిన్ సి, ఫైబర్, ఫోలేట్, పొటాషియం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవన్నీ మన రోగనిరోధక శక్తిని పెంచుతాయి. జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. శరీరానికి అవసరమైన శక్తిని అందిస్తాయి. ఆకుపచ్చ కివి పండు పోషకాలతో నిండి ఉంటుంది. యూరోపియన్ కమిషన్ ఇటీవల ఆకుపచ్చ కివి పండుపై ప్రత్యేక వ్యాఖ్యలు చేసింది. జీర్ణ ఆరోగ్యాన్ని ప్రోత్సహించే లక్షణాల కారణంగా ఇది ప్రేగు కదలికలను సాధారణీకరించడంలో సహాయపడే మొదటి పండు. సరైన మొత్తంలో కివి తినడం వల్ల ప్రేగు కదలికలను సులభతరం చేస్తుందని చెప్పారు. యూరోపియన్ యూనియన్ నిబంధనల ప్రకారం, రోజుకు దాదాపు 200 గ్రాముల ఆకుపచ్చ కివి పండ్లను తీసుకోవడం మంచిది. అంటే రెండు పెద్ద కివి పండ్లు తింటే సరిపోతుంది. సమతుల్య ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలిలో భాగంగా కివి పండ్లను తీసుకోవడం వల్ల ప్రేగులు సజావుగా పనిచేయడానికి సహాయపడుతుంది. కివి పండులో కరిగే, కరగని ఫైబర్ రెండూ ఉంటాయి. కరగని ఫైబర్ మలబద్ధకం సమస్యను తగ్గిస్తుంది. ఇది ప్రేగు కదలికలను సులభతరం చేస్తుంది. అదనంగా, కివిలోని సహజ చక్కెరలు, నీటి శాతం పేగులను సున్నితంగా ప్రేరేపిస్తుంది. దీని ప్రత్యేకత ఏమిటంటే ఇది మందుల తీవ్రమైన దుష్ప్రభావాలు లేకుండా సహజంగా పనిచేస్తుంది.చాలా కాలంగా మలబద్ధకంతో బాధపడుతున్న వారికి కివి పండు ఒక గొప్ప ఔషధం.

# బాడీలో ఈ మార్పులు కనిపిస్తే వెంటనే మందు మానేయండి..



మనం తాగే ప్రతి మద్యం చుక్కా లివర్‌పై గాయంలా మారుతుందని మీకు తెలుసా..? రాత్రి తాగిన మద్యం ప్రభావం ఉదయం పూట మీ శరీరంలో కొన్ని ప్రత్యేక లక్షణాల రూపంలో కనిపిస్తుంది. ఆ సంకేతాలను నిర్లక్ష్యం చేస్తే, అది కాలేయ వైఫల్యానికి దారితీసే ప్రమాదం ఉంది. మద్యం సేవించడం అనేది ఈ రోజుల్లో ఒక సరదాగా మారిపోయింది. కానీ అది కాలేయంపై చూపే ప్రభావం మాత్రం అత్యంత భయంకరమైనది. అధికంగా మద్యం తాగడం వల్ల కాలేయంపై మచ్చలు ఏర్పడతాయి. ఇవి ఒకరకమైన గాయాల వంటివి, వీటినే వైద్య పరిభాషలో లివర్ సిర్రోసిస్ అంటారు. మీరు తక్కువ మొత్తంలో తాగినా, అప్పుడప్పుడు తాగినా అది కాలేయానికి హానికరమే. ముఖ్యంగా శరీరంలో ఈ మూడు మార్పులు కనిపిస్తే.. మీ కాలేయం ప్రమాదంలో ఉందని అర్థం. రాత్రి కొంచెం మద్యం తాగినప్పటికీ, ఉదయం నిద్రలేవగానే తల విపరీతమైన బరువుగా అనిపించడం, ఒంట్లో అస్సలు శక్తి లేకపోవడం వంటివి జరిగితే అది హెచ్చరికగా భావించాలి. ఏ పని చేయాలని అనిపించకపోవడం, నిరంతరం శరీర నొప్పులు, వికారం లేదా వాంతులు వచ్చే సూచనలు కనిపిస్తాయి. ఇవి ప్రారంభ కాలేయ వైఫల్యం సంకేతాలు. మీ కాలేయం విషతుల్యమైన ఆల్కహాల్‌ను క్లీన్ చేయడానికి చాలా కష్టపడుతోందని దీని అర్థం. మద్యం మీ జీర్ణవ్యవస్థను పూర్తిగా దెబ్బతీస్తుంది. ఆహారం సరిగ్గా అరగకపోవడం వంటి సమస్యలు తరచుగా ఎదురవుతుంటే జాగ్రత్త పడాలి. కడుపు నొప్పి, కడుపులో గ్యాస్ పట్టేసినట్లు భారంగా అనిపించడం, తరచుగా త్రేన్పులు రావడం వంటి లక్షణాలు ఉంటాయి. జీర్ణవ్యవస్థ దెబ్బతినడం వల్ల కాలేయం తన పనితీరును నెమ్మదిస్తుంది. ఈ దశలోనూ మద్యం మానకపోతే పరిస్థితి విషమించవచ్చు. మద్యం సేవించడం వల్ల గాఢ నిద్ర పడుతుందని చాలామంది భ్రమపడుతుంటారు. కానీ వాస్తవానికి అది నిద్రను నాశనం చేస్తుంది. రాత్రిపూట తరచుగా నిద్ర భంగం కలగడం, గాఢ నిద్ర లేకపోవడం వల్ల ఉదయం నీరసంగా అనిపించడం. ఒకవేళ మీకు మద్యం తాగకుండా నిద్ర పట్టడం లేదంటే, మీరు ఆల్కహాల్‌కు బానిసయ్యారని అర్థం. ఇది కాలేయంతో పాటు మానసిక ఆరోగ్యాన్ని కూడా దెబ్బతీస్తుంది.


## ఆ పప్పులు ఎడా పెడా తినేస్తున్నారా?





వారంలో రెండు సార్లు అయినా పప్పును చేసుకుని తింటాము. అయితే, ఇది ఆరోగ్యానికి మంచిదో కాదో అని కొంచం కూడా ఆలోచించకుండా తినేస్తాము. ఇక కొందరైతే అదే పనిగా చేసుకుని తింటూనే ఉంటారు. మన ఆరోగ్యానికి కొన్ని రకాల పప్పులు మంచివి కావని అంటున్నారు. పప్పు దినుసులను మనం సరిగ్గా ఉండకపోతే జీర్ణం కాదు. ఆ తర్వాత జీర్ణ సంబంధిత సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అలాగే, గ్యాస్ సమస్యలు కూడా ఎక్కువతాయి. తిన్నది జీర్ణం కాక ఆ తర్వాత హాస్పిటల్స్ చుట్టూ తిరుగుతుంటారు. మసూర్ పప్పు అంటే ఎర్ర పప్పు. చాలా మంది దీనిని టమాటలతో కలిపి వండుతారు. దీనిని తిన్నా కూడా ఎలాంటి గ్యాస్ సమస్యలు రావని నిపుణులు చెబుతున్నారు. ఇది మిగతా పప్పుల కంటే ఇది చాలా బెటర్.మనం తినే అన్ని పప్పుల్లో పెసర పప్పు చాలా మంచిది. దీనిలో మన శరీరానికి కావాల్సిన పోషకాలు ఉన్నాయి. అలాగే, వీటిని తిన్న వెంటనే అవి జీర్ణ మవుతాయి. కాబట్టి, ఇదే మంచిదని నిపుణులు కూడా చెబుతున్నారు.మినప పప్పు కూడా మన జీర్ణవ్యవస్థను దెబ్బ తీస్తుంది. ఇది యాసిడ్ ఉత్పత్తి చేసి సరిగా జీర్ణం కానివ్వదు. ఆ తర్వాత అనారోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి, దీనిని అతిగా తినకండి. కంది పప్పును వారంలో నాలుగు సార్లు తినే వాళ్ళు కూడా ఉంటారు. అలాంటి వాళ్లు ఇక నుంచి తినే తప్పుడు జాగ్రత్త. ఎందుకంటే, ఇది గ్యాస్ సమస్యలను పెంచుతుంది. ఇంకా కడుపును కూడా ఇబ్బంది పెడుతుంది.

## ఆచితూచి తిన్నా బరువు పెరుగుతున్నారా?



ఆచితూచి తిన్నాసరే చాలా మంది బరువు మాత్రం ఏమాత్రం తగ్గరు. పైగా ఇంకా పెరుగుతూనే ఉంటుంది. బరువు తగ్గాలనుకునే వ్యక్తులు సాధారణంగా వారి ఆహారంపై ఎక్కువ నియంత్రణ కలిగి ఉంటారు. కానీ వారి బరువు నియంత్రణలో ఉండదు. లావుగా అవుతామనే భయంతో తక్కువ తినే వారిని మీరు చూసే ఉంటారు. అంత ఆచితూచి తిన్నాసరే వారి బరువు మాత్రం ఏమాత్రం తగ్గదు. పైగా ఇంకా పెరుగుతూనే ఉంటుంది. బరువు తగ్గాలనుకునే వ్యక్తులు సాధారణంగా వారి ఆహారంపై ఎక్కువ నియంత్రణ కలిగి ఉంటారు. కానీ వారి బరువు నియంత్రణలో ఉండదు. మీకూ ఇలాంటి సమస్య ఉంటే దానిని అంత తేలికగా తీసుకోకండి. ఇది శరీరంలోని కొన్ని వ్యాధుల లక్షణం కావచ్చు. అంతే కాదు ఇది జీవక్రియకు నేరుగా సంబంధించినది కావచ్చు. రాజీవ్ గాంధీ హాస్పిటల్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అజిత్ జైన్ ఏం చెబుతున్నారంటే.. తక్కువ ఆహారం తీసుకున్న తర్వాత కూడా బరువు పెరగడం చాలా మందిలో కనిపించే సాధారణ సమస్య. ఇది 40 ఏళ్ల తర్వాత ప్రత్యేకంగా కనిపిస్తుంది. దీనికి ప్రధాన కారణం జీవక్రియ నెమ్మదిగా జరగడం. దీంతో శరీరం కేలరీలు బర్న్ చేయడానికి పట్టే సమయం చాలా నెమ్మదిస్తుంది. అందుకే తక్కువ తిన్న తర్వాత కూడా శరీర బరువు పెరుగుతుంది. కాబట్టి ఏమి తిన్నా, శరీరంలో కొవ్వు పేరుకుపోతుంది. ఇది ఊబకాయం, బరువు పెరగడానికి దారితీస్తుంది. ఆహారం తీసుకోవడం తగ్గించినప్పటికీ బరువు పెరగడానికి మరో ప్రధాన కారణం హార్మోన్ల అసమతుల్యత. ఇటువంటి సమస్యలు మహిళల్లో ఎక్కువగా కనిపిస్తాయి. సాధారణంగా ఖఅూూ, రుతువిరతి, గర్భం తర్వాత సంభవించే హార్మోన్ల మార్పుల వల్ల బరువు పెరగవచ్చు. 40 ఏళ్ల తర్వాత ఈ సమస్యలు సర్వసాధారణం అవుతాయి. వయస్సు పెరిగే కొద్దీ బరువు కూడా పెరుగుతుంది. సాధారణంగా కొంతమంది ఆహారం సరిగ్గా తీసుకోరు. అంటే వారు అవసరమైన దానికంటే తక్కువ తింటారు లేదా ఎక్కువసేపు ఆకలితో ఉంటారు. అలాంటి సందర్భాలలో శరీరం కొవ్వును కాల్చదు. దీంతో దానిని నిల్వ చేయడం ప్రారంభిస్తుంది. కాబట్టి ఈ రకమైన అలవాట్లు బరువు పెరగడానికి దారితీస్తాయి. అలాగే, స్టెరాయిడ్ మందులు తీసుకునే వారిలో ఈ రకమైన సమస్య కనిపిస్తుంది.

## ఎక్కువగా స్వీట్లు తినాలని అనిపిస్తుందా?

కొంతమందికి స్వీట్లు తినడమంటే మహా ఇష్టం. ప్రతిరోజూ తినే దానికంటే ఎక్కువగా తీపి పదార్థాలు తింటుంటారు. ఈ విధంగా స్వీట్లు తినాలనే కోరిక (షుగర్ క్రేవింగ్స్) క్రమంగా రోజువారీ అవసరంగా మారుతుంది. కొన్నిసార్లు భోజనం తర్వాత లేదా చిరుతిండికి ముందు ఎటువంటి సమయ పరిమితి లేకుండా స్వీట్లు విపరీతంగా తినాలని అనిపిస్తుంది. ఇది మొదట్లో సాధారణమైనదిగా అనిపించినప్పటికీ ఈ కోరిక పదే పదే తలెత్తడం ప్రారంభించినప్పుడు అది ఆందోళన కలిగించే విషయంగా మారుతుంది. స్వీట్లు తినడం వల్ల శరీరానికి తాత్కాలికంగా మనశ్శాంతి, శక్తి లభిస్తుంది. అందుకే కొంతమంది అలసిపోయినప్పుడు లేదా ఒత్తిడికి గురైనప్పుడు స్వీట్లు ఎక్కువగా తింటుంటారు. కానీ వీటి అధిక వినియోగం శరీరాన్ని ప్రభావితం చేస్తుందని మర్చిపోకూడదు. లేడీ హార్డింగ్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌హెచ్ ఘోటేకర్.. స్వీట్లు తినాలనే కోరిక కేవలం రుచి గురించి మాత్రమే కాదు. చాలా మందికి ఈ అలవాటు వారి దినచర్య, జీవనశైలికి సంబంధించినది. సక్రమంగా తినకపోవడం, ఎక్కువసేపు ఆకలితో ఉండటం, ఎక్కువ జంక్ ఫుడ్ తీసుకోవడం కూడా దీనికి కారణాలు కావచ్చు. అంతే కాదు ఒత్తిడి, నిద్ర లేకపోవడం, మానసిక అలసట కూడా స్వీట్ల కోరికను పెంచుతాయి. కొంతమంది అలసిపోయినప్పుడు కూడా స్వీట్లు తింటారు. కాలక్రమేణా, ఇది ఒక అలవాటుగా మారుతుంది. వారు స్వీట్లు లేకుండా ఉండలేని స్థితికి చేరుకుంటారు. తరచుగా స్వీట్లు తినడం వల్ల శరీరంలో అనేక మార్పులు వస్తాయి. ఇది వేగంగా బరువు పెరగడం, ఊబకాయానికి దారితీస్తుంది. అంతే కాదు ఎక్కువ చక్కెర తీసుకోవడం వల్ల రక్తంలో చక్కెర స్థాయిలలో అసమతుల్యత ఏర్పడుతుంది. డయాబెటిస్ ప్రమాదం పెరుగుతుంది. దీనితో పాటు దంతక్షయం, బలహీనత, అలసట వంటి సమస్యలు కూడా సంభవించవచ్చు. కొందరిలో ఇది జీర్ణ సమస్యలు, చర్మ సమస్యలను పెంచుతుంది. ఈ అలవాటు చాలా కాలం పాటు కొనసాగితే ఇది గుండె ఆరోగ్యాన్ని కూడా ప్రభావితం చేస్తుంది. తరచుగా స్వీట్లు తినకుండా ఉండటానికి లేదా ఆ కోరికను నివారించడానికి సమతుల్య ఆహారం తీసుకోవాలి. సమయానికి భోజనం, స్నాక్స్ తినాలి. ఎక్కువసేపు ఆకలితో ఉండకూడదు. ప్రతిరోజూ తగినంత నీళ్లు తాగాలి. మంచి నిద్ర, విశ్రాంతి తీసుకోవాలి. ఒత్తిడిని తగ్గించడానికి యోగా లేదా తేలికపాటి వ్యాయామం చేయాలి. స్వీట్లకు బదులుగా పండ్లు, డ్రై ఫ్రూట్స్, ఆరోగ్యకరమైన స్నాక్స్ ఎంచుకోవాలి. వీటన్నింటితో పాటు క్రమంగా స్వీట్ల పరిమాణాన్ని తగ్గించడం ద్వారా ఈ అలవాటును నియంత్రించవచ్చు.

# మనిషివా.. మిషన్‌వా.. బ్రో!

## టీ20 క్రికెట్ చరిత్రలో రషీద్ ఖాన్ సరికొత్త రికార్డ్





**హైదరాబాద్ పెన్ పవర్:** ఆఫ్ఘానిస్తాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ సరికొత్త చరిత్ర సృష్టించారు. టీ20 ఫార్మాట్లో 700 వికెట్లు తీసిన తొలి బౌలర్‌గా అరుదైన ఘనత సాధించాడు. టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా యూఏఈతో జరిగిన మ్యాచులో ఈ రేర్ ఫీట్ నెలకొల్పాడు. అఫ్గాన్ తరఫున 191 వికెట్లు, మిగిలిన 509 వికెట్లు ఐపీఎల్ వంటి లీగ్‌లలో సాధించాడు. రషీద్ ఖాన్ తర్వాత టీ20 ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన జాబితాలో వెస్టిండీస్ దిగ్గజాలు బ్రావో (631), నరైన్ (613లి) ఉన్నారు. ఒకే ఫార్మాట్‌లో 700 వికెట్లు పడగొట్టి సంచలనం సృష్టించిన రషీద్ ఖాన్‌పై ప్రశంసలు కురిపిస్తున్నారు క్రికెట్ ఫ్యాన్స్. మనిషివా.. మిషన్‌వా.. బ్రో అంటూ ఫన్నీగా అభినందిస్తున్నారు. ఇక మ్యా విషయానికి వస్తే.. టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా సోమవారం (ఫిబ్రవరి 16) ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో జరిగిన మ్యాచులో యూఏఈపై ఆఫ్ఘానిస్తాన్ ఘన విజయం సాధించింది. ఆల్ రౌండ్ షోతో యూఏఈను 5 వికెట్ల తేడాతో చిత్తు చేసింది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన యూఏఈ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 160 రన్స్ చేసింది. అనంతరం 19.2 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఆఫ్ఘానిస్తాన్ లక్ష్యాన్ని ఛేధించింది. 4 వికెట్లు, 40 పరుగులతో ఆల్ రౌండ్ షో చేసిన అజ్మాతుల్లా ఒమర్జాయ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ అందుకున్నాడు.

## వ్యూస్‌లో సరికొత్త రికార్డు సృష్టించిన ఇండియా - పాకిస్థాన్ మ్యాచ్

- పాకిస్థాన్ పై 61 పరుగుల తేడాతో గెలుపొందిన భారత్
- డిజిటల్ వేదికపై రికార్డులు క్రియేట్ చేసిన మ్యాచ్
- జియో హాట్ స్టార్ లో మ్యాచ్ ను వీక్షించిన 45.4 కోట్ల మంది



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్ 2026లో భాగంగా భారత్–పాకిస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్ లో టీమిండియా ఘన విజయం సాధించింది. ఈ విజయంతో కేవలం ఇండియాలో మాత్రమే కాకుండా ఆఫ్ఘనిస్థాన్, పాకిస్థాన్ లోని బలోచిస్థాన్ లలో కూడా సంబరాలు జరిగాయి. మరోవైపు, ఈ మ్యాచ్ డిజిటల్ వేదికలపై కూడా రికార్డులు క్రియేట్ చేసింది. జియో హాట్‌స్టార్ యాప్, వెబ్ సైట్‌లో ఈ మ్యాచ్‌ను 45.4 కోట్ల మంది వీక్షించారు. ఇది టీ20 వరల్డ్ కప్ చరిత్రలోనే అత్యధిక వ్యూయర్‌షిప్.అంతకుముందు ఫిబ్రవరి 7న అమెరికాతో జరిగిన మ్యాచ్‌కు 26 కోట్లు, నమీబియాతో మ్యాచ్‌కు 24 కోట్ల వ్యూస్ వచ్చాయి. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ టీవీల ద్వారా దేశవ్యాప్తంగా అభిమానులు ఈ దాయాదుల పోరును లైవ్‌లో చూశారు.కొలంబోలోని ప్రేమదాస స్టేడియంలో గ్రూప్–ఏ మ్యాచ్‌లో భారత్ మొదట బ్యాటింగ్ చేసి 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. ఓపెనర్ ఇషాన్ కిషన్ 40 బంతుల్లో 10 ఫోర్లు, 3 సిక్సర్లతో 77 పరుగులు చేసి భారీ స్కోరుకు బాటలు వేశాడు. 176 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన పాకిస్థాన్ 18 ఓవర్లలోనే 114 పరుగులకు ఆలౌట్ అయింది. హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి బౌలర్లు పాక్ బ్యాటర్లను కట్టడి చేశారు. దీంతో, భారత్ 61 పరుగుల భారీ తేడాతో భారీ విజయం సాధించింది.

## టాస్ దగ్గరే పాకిస్థాన్ ఓడిపోయిందన్న టీమిండియా స్పిన్ దిగ్గజం

టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకోవడమే పాక్ ఓటమికి కారణమన్న అశ్విన్
ఒత్తిడిని ఎదుర్కోవడంలో భారత్ 100 రెట్లు మెరుగ్గా ఉందని వెల్లడి
పాక్ కెప్టెన్ సల్మాన్ ఆఘా వ్యూహాత్మక తప్పిదాలు చేశాడని విమర్శలు
ఇషాన్ కిషన్ ఎదుట షహీన్ అఫ్రిదిని ప్రయోగించడం పెద్ద తప్పు అని విశ్లేషణ

**హైదరాబాద్ పెన్ పవర్:** 2026 టీ20 ప్రపంచకప్‌లో పాకిస్థాన్‌పై భారత్ ఘన విజయం సాధించడంపై టీమిండియా మాజీ స్పిన్ ఆల్‌రౌండర్ రవిచంద్రన్ అశ్విన్ తన విశ్లేషణను పంచుకున్నాడు. కొలంబో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 61 పరుగుల తేడాతో గెలిచింది. అయితే, టాస్ గెలిచిన పాకిస్థాన్ బౌలింగ్ ఎంచుకోవడమే వారి ఓటమిని నిర్ణయించిందని అశ్విన్ అభిప్రాయపడ్డాడు. ఛేజింగ్ చేయాలన్న నిర్ణయం దారుణంగా బెడిసికొట్టిందని అన్నాడు.తన యూట్యూబ్ ఛానెల్ 'యష్ కీ బాత్'లో మాట్లాడుతూ... ఈ టోర్నీలో ఛేజింగ్ కష్టంగా ఉన్న పిచ్‌పై పాక్ ఫీల్డింగ్ ఎంచుకోవడం వ్యూహాత్మక తప్పిదమని తెలిపాడు. "ప్రేమదాస స్టేడియంలో చివరి 10 ఓవర్లలో 100 పరుగులు చేయడం అసాధ్యం. ఒత్తిడిని ఎదుర్కొనే విషయంలో భారత్‌తో పోలిస్తే పాకిస్థాన్ 100 రెట్లు వెనుకబడి ఉంది. నిజాయతీగా చెప్పాలంటే వాళ్లు ఆ స్థాయిలో లేరు" అని అశ్విన్ పేర్కొన్నాడు.పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా బౌలర్లను ఉపయోగించిన తీరును కూడా అశ్విన్ ప్రశ్నించాడు. ముఖ్యంగా, లెఫ్ట్ ఆర్మ్ సీమర్ల బౌలింగ్‌లో ఇషాన్ కిషన్ ప్రమాదకరమని తెలిసినా... షహీన్ అఫ్రిదితో బౌలింగ్ చేయించడాన్ని తప్పుబట్టాడు. "డేటా నిజం చెబుతుంది. షహీన్ దెబ్బలు తింటున్నా, అతడితోనే బౌలింగ్ కొనసాగించడం పెద్ద తప్పిదం. కనీసం రౌండ్ ది వికెట్ వచ్చి బౌలింగ్ చేయాల్సింది. రెండో ఓవర్ సయీమ్ అయూబ్‌కు ఇచ్చి ఉండాల్సింది" అని అశ్విన్ వివరించాడు.ఆట చివర్లోనూ పాకిస్థాన్ పట్టు సాధించలేకపోయిందని అశ్విన్ విమర్శించాడు. డెత్ ఓవర్లలో మళ్లీ షహీన్ అఫ్రిదిని తీసుకురావడంతో, భారత బ్యాటర్లు సులభంగా పరుగులు సాధించారని గుర్తుచేశాడు. "భారత్ స్కోరు 19 ఓవర్లకు 159గా ఉంది. ఆ సమయంలో బౌలింగ్‌కు వచ్చిన అఫ్రిది చివరి ఓవర్లో 16 పరుగులు ఇచ్చాడు" అని తెలిపారు. లీగ్ దశలో తమ చివరి మ్యాచ్‌ను భారత్ బుధవారం అహ్మదాబాద్‌లో నెదర్లాండ్స్‌తో ఆడనుంది. ఈ మ్యాచ్ అనంతరం సూపర్ 8 దశకు సన్నద్ధం కానుంది.



# హనుకి ప్రభాస్ డెడ్ లైన్..నిజమెంత?







ఇండియన్ సూపర్ స్టార్లలో అత్యంత బిజీగా ఉన్న స్టార్ హీరో ప్రభాస్. వరుస పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లతో బిజీ బిజీగా గడిపేస్తున్నారు. స్టార్ హీరోలకు భిన్నంగా ఒకేసారి రెండు మూడు క్రేజీ సినిమాల్లో నటిస్తూ వరుస షూటింగ్‌లతో బిజీగా ఉంటున్నారు. ఈ ఏడాది హారర్ కామెడీ థ్రిల్లర్ –రాజాసాబ్–తో ప్రేక్షకుల ముందుకొచ్చిన ప్రభాస్ ఇదే ఏడాది మరో భారీ పాన్ ఇండియా మూవీతో ప్రపంచ వ్యాప్తంగా సినీ ప్రియుల్ని అలరించడానికి రెడీ అవుతున్నాడు. ప్రభాస్ ప్రస్తుతం రెండు క్రేజీ ప్రాజెక్ట్‌లలో నటిస్తున్న విషయం తెలిసిందే.–సీతారామం–తో బ్లాక్ బస్టర్ హిట్‌ని సొంతం చేసుకుని దర్శకుడిగా విమర్శకుల ప్రశంసలు అందుకున్న హను రాఘవపూడి డైరెక్షన్‌లో యుద్ధం రాసిన ప్రేమకథగా –ఫౌజీ–ని రూపొందిస్తున్నాడు. ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తుండగా కీలక పాత్రల్లో మిథున్ చక్రవర్తి, అనుపమ్‌ఖేర్, జయప్రద, భానుచందర్ తదితరులు నటిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్‌తో కలిసి టీ సిరీస్ సంయుక్తంగా ఈ భారీ వార్ లవ్ డ్రామాని నిర్మిస్తోంది. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఈ మూవీతో పాటు ప్రభాస్ –స్పిరిట్–లో నటిస్తున్న విషయం తెలిసిందే.

క్రే.జీ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న సందీప్‌రెడ్డి వంగ ఈ మూవీని అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నాడు. ఏ విషయంలోనూ రాజీపడకుండా బాడీ డబుల్‌ని కూడా వాడనివ్వకుండా చాలా స్ట్రిక్ట్‌గా ఈ మూవీ షూటింగ్ చేస్తున్నాడు. ఇప్పటికే కీలక ప్యాడింగ్ ఆర్టిస్ట్‌లని రంగంలోకి దించేసిన సందీప్ ఈ మూవీ షూటింగ్‌ని పరుగులు పెట్టిస్తున్నాడు. ఇదిలా ఉంటే ఈ మూవీతో పాటు త్వరలో –కల్కి 2898ఏడీ– సీక్వెల్ షూటింగ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో –ఫౌజీ– డైరెక్టర్‌తో పాటు టీమ్‌కి డెడ్ లైన్ విధించినట్టుగా తెలిసింది.వరుస క్రేజీ ప్రాజెక్ట్‌ల షూటింగ్‌లతో బిజీ బిజీగా గడిపేస్తున్న ప్రభాస్ అనుకున్న టైమ్‌కి సినిమాని థియేటర్లలోకి తీసుకురావాలంటే షూటింగ్ మరింత ఫాస్ట్‌గా చేయాలని భావిస్తున్నాడట. ఇప్పటికే –ఫౌజీ–ని దసరాకు రిలీజ్ చేయాలని టార్గెట్ పెట్టుకున్నా ఆ సమయానికి రిలీజ్ చేయలేకపోతే తరువాత ప్రాజెక్ట్‌లకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయని భావించిన ప్రభాస్ –ఫౌజీ– టీమ్‌కు డెడ్ లైన్ విధించాడట. ఎట్టిపరిస్థితుల్లోనూ సినిమాని పూర్తి చేసి దసరాకు రిలీజ్ చేయాలని చెప్పడంతో ఇప్పుడు టీమ్ రాత్రింబవళ్లు పని చేస్తున్నారట.ఖరెస్ట్ లేకుండా పని చేస్తేనే –ఫౌజీ– అనుకున్న అక్టోబర్‌కు రెడీ అవుతుందని, దాంతో ఇతర సినిమాలకు ఎలాంటి ప్రాబ్లం ఉండదని చెబుతున్నారు. సందీప్ రూపొందిస్తున్న –స్పిరిట్– విషయంలో ప్రభాస్‌కు ఎలాంటి టెన్షన్ లేదు. కారణం ప్రభాస్ రెస్ట్ తీసుకుందామన్నా, బాడీ డబుల్‌తో లాగించేద్దామన్నా సందీప్ రెడ్డి వంగ వినే రకం కాదు. అనుకున్నది అనుకున్నట్టు చేయాల్సిందేనని పట్టుబట్టే రకం కాబట్టి –స్పిరిట్– సందీప్ చెప్పిన టైమ్‌కే వచ్చేస్తుందని ప్రభాస్ ఫుల్ కాన్ఫిడెన్స్‌తో ఉన్నాడట.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965